

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 38

SUNDAY Special | ఆదివారం 22-10-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



క్లాసెన్ కమాల్.. ఇంగ్లండ్ ఢమాల్..

వన్డే వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్ జట్టు 229 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో భారీ పరాజయాన్ని మూటగట్టుకుంది. దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 399 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 22 ఓవర్లలో 170 పరుగులకే కుప్పకూలింది.

- వివరాలు స్పోర్ట్స్‌లో



గగన్‌యాన్ క్రూ ఎస్కేప్ టెస్ట్ సక్సెస్

మానవసహిత అంతరిక్ష ప్రయోగాల దిశగా అడుగులు వేస్తున్న ఇస్రో తొలి విజయం సాధించింది. గగన్‌యాన్ ప్రాజెక్టు సన్నాహకాల్లో భాగంగా చేపట్టిన మానవ రహిత క్రూ ఎస్కేప్ సిస్టమ్ పరీక్ష విజయవంతమైంది.

- వివరాలు 6లో



గాజాకు సాయం షురూ

అంతర్జాతీయ సంస్థల సహాయ సామగ్రి గాజాకు వెళ్లేందుకు ఇజ్రాయెల్ అంగీకరించడంతో ఈజిప్టు రఫా క్రాసింగ్‌ను తెరిచింది.


వివరాలు 6లో ▸



దుబాయ్‌లో మొయిత్రా ఐడీ లాగిన్

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంట్ ఐడీని దుబాయ్‌లో కొందరు ఉపయోగించారని బీజేపీ ఎంపీ నిశికాంత్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



నాలుగేళ్ల తర్వాత పాక్‌కు షరీఫ్

పాకిస్థాన్ ముస్లిం లీగ్–నవాజ్ అధినేత, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నాలుగేళ్ల స్వీయ ప్రవాసం అనంతరం పాక్‌కు తిరిగొచ్చారు.

వివరాలు 6లో ▸



ఢిల్లీలో వాయు కాలుష్యం పైపైకి..

దేశ రాజధాని కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. శనివారం ఢిల్లీలో 24 గంటల సగటు వాయు నాణ్యత 248గా నమోదైంది.

వివరాలు 6లో ▸

పదోన్నతుల పరంపర

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కొనసాగుతున్న పదోన్నతులు

గతంలో హార్టికల్చర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు.. తాజాగా వెటర్నరీ అసిస్టెంట్లకు పదోన్నతులు

5లో



12లో

'ఐదు' ఎవరి ఖాతాలో..?

నేడు ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ పోరు

అసాంఘిక శక్తులను ఉపేక్షించొద్దు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, పత్రికా స్వేచ్ఛ ఓ వర్గానికే పరిమితం కాదు.. అంగళ్లులో సాక్షాత్తు ప్రతిపక్ష నేతే పోలీసులపై దాడులను ప్రేరేపించి చేయించారు
- ప్రజలకు రక్షణ కల్పించే విషయంలో అస్సలు రాజీపడొద్దు
- 1.25 కోట్ల మంది అక్కచెల్లెమ్మల ఫోన్లలో దిశ యాప్
- పోలీసులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- వారి సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తాం
- ఫ్రెండ్లీ పోలీసింగ్ మన విధానం..
- పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సీఎం జగన్

> సిటిజెన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ మన విధానం. శాంతిభద్రతల పరిరక్షణే ఈ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవు. అసాంఘిక శక్తులను ఏమాత్రం ఉపేక్షించవద్దు.
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2లో


పోలీస్ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో హోం మంత్రి తానేటి వనిత తదితరులు

కిరణ్మయితో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో సీఎం వైఎస్ జగన్





అదనపు జడ్జీలుగా ప్రమాణం చేస్తున్న సుమతి, హరినాథ్, విజయ్

నలుగురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణం

- హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌లతో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

2లో

నాడు ఒప్పు..నేడు తప్పా..!

- విదేశీ బొగ్గు వినియోగంపై 'ఈనాడు' ద్వంద్వ వైఖరి
- చంద్రబాబు హయాంలోనూ విదేశీ బొగ్గు కొనుగోలు.. అప్పుడు తప్పనిపించలేదు
- ఇప్పుడు తక్కువ ధరకు కొంటున్నా తప్పేనట



3లో

ఫ్యాక్ట్ చెక్ పేదల ఇళ్లపై ఇవేం రాతలు!?

- జగనన్న కాలనీలపై ఈనాడు ఎడతెగని ఏడుపు
- మౌలిక సదుపాయాలు లేవంటూ రోత రాతలు
- లేఔట్లలో ఇళ్లన్నీ పూర్తయితేనే శాశ్వతంగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తారు



3లో

నేడు బంగాళాఖాతంలో వాయుగుండం!

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఆదివారానికి వాయుగుండంగా మారనుంది. ఇది తుపానుగా బలపడే అవకాశముందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకటి, రెండు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉంది.



3లో

పంచతంత్రం

మధ్యప్రదేశ్‌లో 92 మందితో బీజేపీ అయిదో జాబితా

సిట్టింగ్ ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్ వర్గీయకు దక్కని చోటు


ఆకాశ్

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు గాను శనివారం బీజేపీ 12 మంది మహిళలు సహా 92 మంది అభ్యర్థులతో కూడిన అయిదో జాబితా ప్రకటించింది. ఇందులో బీజేపీ కీలక నేత కైలాస్ విజయ్ వర్గీయ తనయుడు ఇండోర్–3 ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్‌వర్గీయకు చోటుదక్కలేదు. ఇండోర్–3 టికెట్‌ను రాకేశ్ గోలు శుక్లాకు కేటాయించింది. తన తండ్రి కైలాస్ విజయ్ వర్గీయను బరిలో నిలిపినందున తనకు టికెట్ కేటాయించవద్దంటూ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కోరినట్లు ఆకాశ్ ఇటీవల ప్రకటించడం గమనార్హం. అలాగే, గ్వాలియర్ సౌత్ టికెట్ ఆశిస్తున్న మాజీ ప్రధాని వాజ్‌పేయి బంధువు అనూప్ మిశ్రా పేరు కూడా తాజా జాబితాలో లేదు. తాజా లిస్టులో కొందరు మంత్రులు సహా 29 మంది సిట్టింగ్‌లకు పార్టీ మొండిచేయి చూపింది. టిక్కెట్లు లభించని మంత్రుల్లో ఓపీఎస్ భదోరియా, యశోధరా సింధియా, గౌరీ శంకర్ బైసెన్ ఉన్నారు. సిట్టింగ్‌ల్లో 37 మంది మాత్రమే అవకాశం కల్పించింది. తాజాగా, టికెట్లు లభించిన 12 మంది మహిళల్లో.. మాజీ మంత్రులు మాయా సింగ్, అర్చనా చిట్నిస్ వరుసగా గ్వాలియర్(తూర్పు), బుర్హాన్‌పూర్ స్థానాల్లో బరిలోకి దిగనున్నారు. మాహౌ స్థానం నుంచి ప్రస్తుత కేబినెట్ మంత్రి ఉషా ఠాకూర్ పోటీ చేయనున్నారు. ఈ జాబితాలో చోటు సంపాదించుకున్న ప్రముఖుల్లో మాజీ మంత్రి జయంత్ మాలవీయ(75) నర్మదాపురం స్థానం నుంచి తన సోదరుడు, కాంగ్రెస్ అభ్యర్థి గిరిజా శంకర్ శర్మపై పోటీ చేయనున్నారు. మరో మాజీ మంత్రి సురేంద్ర పట్వా రైసెన్ జిల్లా భోజ్‌పూర్ నుంచి బరిలోకి దిగనున్నారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అనుచరుడైన మంత్రి మహేంద్ర సింగ్ సోసోడియాకు గుణ జిల్లా బమోరీ టికెట్ లభించింది. 230 స్థానాలకు గాను బీజేపీ ఇప్పటి వరకు గుణ, విదిశా స్థానాలు మినహా 228 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది.

గెహ్లోత్‌కు సర్దార్‌పుర.. పైలట్‌కు టోంక్

రాజస్తాన్‌లో 33 మందితో కాంగ్రెస్ మొదటి జాబితా విడుదల


అశోక్ గెహ్లోత్


సచిన్ పైలట్

న్యూఢిల్లీ/జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ శనివారం 33 మంది అభ్యర్థుల పేర్లతో మొదటి జాబితాను విడుదల చేసింది. జాబితా ప్రకారం ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ సర్దార్‌పుర నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ టోంక్ స్థానం నుంచి పోటీచేస్తారు. 2020 ఏడాదిలో గెహ్లోత్‌పై తిరుగుబాటు చేసిన సచిన్ పైలట్ వర్గీయులైన ఇంద్రజ్ సింగ్ గుర్జార్, ముకేశ్ భఖర్, రామ్‌నివాస్ గవారియాలకు కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపింది. మొదటి జాబితాలో ఐదుగురు మంత్రులు, 28 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, 2018 ఎన్నికల్లో గెలిచిన ఒక స్వతంత్ర అభ్యర్థికి చోటు కల్పించింది. ఈసారి గత ఎన్నికల్లో ఓటమి పాలైన అర్చనా శర్మకు మాలవీయ నగర్, పుష్పేంద్ర భరద్వాజ్‌కు సంగనేర్ నుంచి బరిలో నిలుపుతోంది. గత ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన లలిత్‌కుమార్ యాదవ్‌కు ముందావర్ నుంచి, గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసి పరాజయం పాలైన వివేక్ ధాఖర్‌కు మంగళ్‌గఢ్ నియోజకవర్గం నుంచి బరిలో నిలుపుతోంది. గత ఎన్నికల్లో కుశాల్‌గఢ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించిన స్వతంత్ర అభ్యర్థి రమీలా ఖదియాకు ఈసారి అదే స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చింది. అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషీకి నాథ్‌ద్వారాను, పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోస్తారాకు లక్ష్మణ్ గఢ్, మాజీ మంత్రి హరీశ్ చౌధరికి బేతూ, మంత్రి మమతా భూపేశ్‌కు సిక్రాయ్ సీటును కేటాయించింది. టికెట్లు లభించిన ఇతర మంత్రుల్లో కోలాయత్ నుంచి భన్వర్ సింగ్ భాటి, అల్వార్ రూరల్ నుంచి టికారామ్ జూలీ, బాగిడొర నుంచి మహేంద్రజీత్ సింగ్ మాలవీయ, హిందోలి నుంచి అశోక్ చంద్నా ఉన్నారు. మూడు ఎస్సీ, నాలుగు ఎస్టీ రిజర్వుడ్ సీట్లకు కలిపి తాజా జాబితాలో మొత్తం 9 మంది మహిళలకు చోటు దక్కింది. మిగతా సీట్లకు అభ్యర్థుల ఖరారుపై ఆదివారం జరిగే సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. 200 సీట్లున్న రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

రాజస్తాన్‌లో 83 మందితో బీజేపీ రెండో జాబితా

- మాజీ సీఎం వసుంధరా రాజేకు ఝల్రాపటన్ సీటు
- ఇప్పటి వరకు 124 స్థానాలకు పార్టీ అభ్యర్థులు ఖరారు


వసుంధరా రాజే

న్యూఢిల్లీ/జైపూర్: రాజస్తాన్‌లో వచ్చే నెల 25న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు గాను బీజేపీ శనివారం 83 మంది అభ్యర్థుల పేర్లతో మరో జాబితా శనివారం విడుదల చేసింది. ఇందులో మాజీ మహిళా ముఖ్యమంత్రి వసుంధరా రాజేకు గతంలో మాదిరి ఝల్రాపటన్ స్థానాన్ని కేటాయించింది. తాజా జాబితాలో 50 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు టికెట్లు సంపాదించారు. తొమ్మిది మంది సిట్టింగ్‌లకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. బీజేపీ ఈ స్థానాలను ఎంపీలకు కేటాయించలేదు. రెండో జాబితాలోని 83 మందిలో 10 మంది మహిళలకు అవకాశమిచ్చారు. అసెంబ్లీలోని 200 స్థానాలకుగాను తాజా జాబితాతో కలిపి బీజేపీ ఇప్పటివరకు 124 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించినట్లయింది. మొత్తమ్మీద మాజీ సీఎం వసుంధరా రాజే మద్దతుదారులైన ఇద్దరు రాష్ట్ర మాజీ మంత్రులతో పాటు మరికొందరికి పార్టీ టికెట్లిచ్చింది. ఐదుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన నరపత్ సింగ్ రాజ్వీని ఛిత్తోర్‌గఢ్ బరిలోకి దించాలని తాజాగా కాషాయ పార్టీ నిర్ణయించింది. బీజేపీ ముఖ్యనేత భైరాన్ సింగ్ షెకావత్ అల్లుడే నరపత్ సింగ్. ఇటీవలే బీజేపీ కండువా కప్పుకున్న మహారాజా ప్రతాప్ సింగ్ వారసుడు విశ్వరాజ్ సింగ్ మేవార్‌కు నాథ్‌ద్వారా స్థానాన్ని కేటాయించింది. గత ఎన్నికల్లో ఈ సీటును కాంగ్రెస్ సీనియర్ నేత సీపీ జోషి దక్కించుకున్నారు. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సతీశ్ పునియా సిట్టింగ్ స్థానం అంబర్ నుంచే పోటీ చేయనున్నారు. అసెంబ్లీలో బీజేపీ నేత రాజేంద్ర రాథోడ్ స్థానాన్ని చురు నుంచి తారానగర్‌కు మార్చింది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాథోడ్ గతంలో 2008–13 సంవత్సరాల్లో తారానగర్ నుంచే ప్రాతినిధ్యం వహించారు. గత నెలలో పార్టీ బీజేపీ తీర్థం పుచ్చుకున్న నగౌర్ మాజీ ఎంపీ జ్యోతి మిర్ధా నగౌర్ స్థానం నుంచి బరిలోకి దిగనున్నారు. సూరజ్‌గఢ్ సీటును మాజీ ఎంపీ సంతోష్ అహ్లావత్‌కు కేటాయించింది. గత ఏడాది రాజ్యసభ ఎన్నికల సందర్భంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలున్న ధోల్‌పూర్ ఎమ్మెల్యే శోభారాణి కుష్వాహకు నిరాశే మిగిలింది.

- చకచకా కొనసాగుతున్న ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు
- అంతర్జాతీయ విమానాశ్రయ భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం
- జాతీయ రహదారిపై ట్రంపెట్ నిర్మాణానికి సన్నాహాలు
- విద్యుత్తు సబ్‌స్టేషన్, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి భూమి కేటాయింపు


చురుగ్గా జరుగుతున్న భోగాపురం విమానాశ్రయ ప్రహరీ నిర్మాణ పనులు

భోగాపురం పనులు టేకాఫ్..

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్ర అభివృద్ధికి చుక్కాని అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ ఏడాది మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేసి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాదాపు రూ. 5,000 కోట్లతో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. 2025 నాటికల్లా ఏటా 60 లక్షల మంది ప్రయాణించే సామర్థ్యంతో తొలిదశ పూర్తి చేయాలనేది లక్ష్యం. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో ఈ విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 2,203 ఎకరాలను కేటాయించింది. నిర్వాసితుల పునరావాసం, పరిహారం సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించింది. దీంతో నిర్మాణ సంస్థ పూర్తిస్థాయిలో పనులు మొదలుపెట్టింది. తొలుత విమానాశ్రయ భూమి చుట్టూ భారీ ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టింది. పటిష్టమైన స్తంభాలను నిర్మించి దానిపై పలకలతో దాదాపు పది అడుగుల ఎత్తున ఈ ప్రహరీ ఉంది. దానిపై ఇనుప ముళ్లతో కూడిన కంచెను ఏర్పాటు చేయనున్నారు.

పటిష్టంగా పొడవైన రన్‌వే..


కీలకమైన రన్‌వే నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించడానికి నిర్మాణ సంస్థ సన్నాహాలు చేస్తోంది. భారీ విమానాలు దిగడానికి వీలుగా 3.8 కిలోమీటర్ల పొడవున పటిష్టంగా దీన్ని నిర్మించాల్సి ఉంది. భూమి అంతా ఒక క్రమంలో లేకపోవడంతో తొలుత సగటున 10 అడుగుల ఎత్తున మట్టితో చదును చేయడానికి సిద్ధం అవుతున్నారు.

నేరుగా రోడ్డు అనుసంధానం...

చెన్నై– కోల్‌కతా జాతీయ రహదారిపై ఇటు విశాఖపట్నం నుంచి, అటు శ్రీకాకుళం, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు నేరుగా విమానాశ్రయంలోకి వెళ్లేలా అనుసంధాన రహదారిని నిర్మించనున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బంది లేకుండా అనుసంధాన రహదారిని కలిపేందుకు ఎనిమిది సంఖ్య ఆకారంలో ట్రంపెట్ నిర్మాణం చేపడుతున్నారు. దీనికోసం 25 ఎకరాల భూసేకరణను ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది. సంబంధిత రైతులకు సుమారు రూ. 18 కోట్లు పరిహారం చెల్లించింది. ఇక విమానాశ్రయానికి ప్రత్యేకంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి భోగాపురం మండలంలోని ముక్కాం పంచాయతీలో 5.47 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది.

సమీపంలోనే స్టాఫ్ క్వార్టర్లు...

విమానాశ్రయంలో వివిధ హోదాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా స్టాఫ్ క్వార్టర్లను జీఎంఆర్ సంస్థ నిర్మించనుంది. ఆ సంస్థ వినతి మేరకు ప్రభుత్వం 25 ఎకరాల భూమి కేటాయించింది. ఇందులో 20 ఎకరాల వరకూ ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి జాతీయ రహదారి నుంచి 8.5 కిలోమీటర్ల దూరంలో ఉంది.



అన్ని అడ్డంకులను అధిగమించి...

విమానాశ్రయం నిర్మాణానికి అవసరమైన భూమి అంతా నిర్మాణ సంస్థకు అప్పగించాం. సుప్రీంకోర్టు, హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులన్నింటిలో ప్రభుత్వం విజయం సాధించింది. కొంతమంది రైతులకు సంబంధించిన పరిహారం కోర్టులో జమచేసింది. నాలుగు గ్రామాల నిర్వాసితులకు దాదాపు రూ. 80 కోట్ల వ్యయంతో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో పునరావాస కాలనీలను నిర్మించింది. అక్కడ అన్ని మౌలిక వసతులు కల్పించాం. విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తయ్యేలా ప్రభుత్వం నుంచి సహకారం అందుతోంది.

– చింతా బంగార్రాజు, భోగాపురం తహసీల్దార్


విమానాశ్రయ నమూనా

అసాంఘిక శక్తులను ఏమాత్రం ఉపేక్షించొద్దు

పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'ప్రశాంతంగా సాగిపోతున్న ప్రజా జీవితాన్ని తమ స్వార్థం కోసం దెబ్బతీసే శక్తులన్నీ కూడా అసాంఘిక శక్తులే. ప్రభుత్వం, సమాజం మీద దాడిచేసి మనుగడ సాగించే శక్తులన్నీ అడవుల్లోనో అజ్ఞాతంలోనో కాకుండా ఇప్పుడు ప్రజా జీవితంలో ఉండటాన్ని మనం చూస్తున్నాం. ప్రజల మధ్యే ఉంటూ ప్రజల మీదే దాడిచేస్తున్నాయి. అటువంటి అసాంఘిక శక్తులను ఏమాత్రం ఉపేక్షించవద్దు. అసాంఘిక శక్తులు అనే పదాన్ని పునర్నిర్వచించాల్సిన అవసరం ఏర్పడింది'.. అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధించారు. ప్రజాస్వామ్యం, పౌర హక్కులు, పత్రికా స్వేచ్ఛ వంటి పదాలకు అర్థం.. ఒక ముఠా, ఒక వర్గం పోలీసుల నుంచి, న్యాయస్థానాల నుంచి చట్టాన్ని లాక్కోవడం కాదని ఆయన తేల్చిచెప్పారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 1959 అక్టోబరు 21న చైనా సైనికులను ఎదిరించి పోరాడిన ఎస్సై కరణ్‌సింగ్ ఆయన సహచరుల ధైర్యాన్ని, త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ ఆ రోజును అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా దేశం గత 64 ఏళ్లుగా జరుపుకుంటూ వారిని గుర్తు చేసుకుంటోందన్నారు. రాష్ట్రంలో విధినిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు కుటుంబాలకు మనందరి ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా, తోడుగా ఉంటుందని పునరుద్ఘాటిస్తూ గత ఏడాది కాలంలో దేశ వ్యాప్తంగా అమరులైన 188 పోలీసులకు శ్రద్ధాంజలి అర్పించారు. సీఎం ఏమన్నారంటే..

ఖాకీ డ్రెస్ అంటేనే త్యాగనిరతి..

సమాజం కోసం తన ప్రాణాన్ని బలిపెట్టడానికి సిద్ధపడిన యోధుడు పోలీసు. ఖాకీ డ్రెస్ అంటే త్యాగనిరతి. ఆ డ్రెస్ మీద కనిపించే మూడు సింహాలు మన దేశ సార్వభౌమాధికారానికి చిహ్నం. పోలీస్ అంటే అధికారం మాత్రమే కాదు.. అంతకుమించి. పోలీస్ అంటే ఒక బాధ్యత కూడా. ఈ ఉద్యోగం ఒక సవాల్. మరీ ముఖ్యంగా నేరం వేగంగా తన రూపాన్ని మార్చుకుంటున్న ఈ యుగంలో అంతకుమించిన వేగాన్ని అందుకుంటేనే పోలీసింగ్‌కు విలువ ఉంటుంది.



పోలీసు అమరవీరులకు నివాళిగా ప్రచురించిన 'అమరులు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం జగన్

'అమరులు' పుస్తకావిష్కరణ

ఇక పోలీసు అమరవీరులకు నివాళిగా ప్రచురించిన 'అమరులు' పుస్తకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. గత ఏడాది కాలంలో దేశంలో అమరులైన 188 మంది పోలీసుల వివరాలతో ఈ పుస్తకాన్ని ప్రచురించారు. అలాగే, ఇటీవల ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో గణేశ్ నిమజ్జనం రోజున అల్లరిమూకల దాడిలో గాయపడి మరణించిన కానిస్టేబుల్ జి. నరేందర్ భార్యకు సీఎం రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలి..

కొత్త టెక్నాలజీవల్ల సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా నేర పరిశోధనలో పోలీసులు అప్‌డేట్ కావాలి. సైబర్ సెక్యూరిటీ నుంచి డేటా థెఫ్ట్ వరకు, డేటా థెఫ్ట్ నుంచి సైబర్ హెరాస్‌మెంట్ వరకు నేరాలను నిరోధించడానికి, వాటి మీద దర్యాప్తు చేసి దోషులను శిక్షించేందుకు పోలీసులు ఎంతగానో అప్‌డేట్ కావాల్సిన యుగంలో మనమంతా ఉన్నాం. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వాడకం వల్ల సైబర్ ప్రపంచంలో మరో చీకటి ప్రపంచం సృష్టించుకుని నేరాలు చేస్తున్న వాళ్లను ఎదుర్కొవాల్సిన బృహత్తర బాధ్యత పోలీసుల భుజస్కంధాల మీద ఉంది. కొత్త టెక్నాలజీని వాడుకుంటూ విజృంభించే అసాంఘిక శక్తుల సవాళ్లకు ఎప్పటికప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. మారుతున్న ఈ సమాజం విసురుతున్న కొత్త సవాళ్లకు సమాధానం చెప్పడానికి హోంగార్డులు, కానిస్టేబుళ్ల నుంచి ఎస్పీలు, డీజీపీ వరకు ప్రతి ఒక్కరూ సిద్ధంకావాలి. నేర నిరోధం, నేర దర్యాప్తు ఈ రెండింటిలోనూ మన పోలీసులు అత్యాధునిక సైబర్ టెక్నాలజీ ఉపయోగిస్తూ దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు. ఈ డివిజన్‌లో 130 మంది సాంకేతిక పోలీసింగ్ నిపుణులు పనిచేస్తుండటం ప్రజలకు ఎంతో ధైర్యానిస్తోంది.

అసాంఘిక శక్తులతో ప్రజాస్వామ్యానికి ముప్పు

నిజానికి ఇప్పుడు అసాంఘిక శక్తుల పదాన్ని పునర్నిర్వచించాల్సిన అవసరమేర్పడింది. నూజివీడులో విధి నిర్వహణలో ఉన్న ఒక పోలీసు కానిస్టేబుల్‌ను చంపారు.. అంగళ్లలో సాక్షాత్తూ ప్రతిపక్ష నాయకుడు తన పార్టీ వాళ్లను రెచ్చగొట్టి పోలీసుల మీద దాడి చేయించారు.. అలాగే, పుంగనూరులో 40 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి.. చివరకి ఒక పోలీసు సోదరుడి కన్ను పోయేలా శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. వారి అవినీతి, నేరాలు, వాటి ఆధారాలను బట్టి న్యాయస్థానాల్లో తీర్పులు వీరికి అనుకూలంగా రాకపోయేసరికి.. చివరకి ఆ న్యాయమూర్తుల మీద ట్రోలింగ్ చేస్తున్నారు. వారికి సంబంధించిన టీవీ ఛానెళ్లలో చర్చలు నిర్వహిస్తున్నారు. తమను ఎవరూ కూడా ఏం చేయలేరన్న అహంకారంతో ఇవన్నీ చేస్తుంటారు. ఇటువంటివన్నీ అసాంఘిక శక్తుల పనులే. ప్రజాస్వామ్యం, రూల్ ఆఫ్ లా మీద నమ్మకం ఉన్నవారు చేసే పనులు కావివి.

దుర్మార్గుల పని పట్టండి..

తమ స్వార్థం కోసం ప్రజల జీవితాలతో ఆడుకుంటూ అలజడులు సృష్టించే ఇలాంటి దుర్మార్గులను ఉపేక్షించవద్దు. ఎలాంటి మొహమాటం లేకుండా చట్టానికి పనిపెట్టండి. ప్రజలకు రక్షణ కల్పించే విషయంలో అస్సలు రాజీపడొద్దు. ముఖ్యంగా ఆడపిల్లలు, మహిళలు, మరీ ముఖ్యంగా పిల్లలు, అణగారిన సామాజికవర్గాలకు భద్రత కల్పించే విషయంలో ఏమాత్రం రాజీపడొద్దు. పోలీసుల మీద దాడిచేసే దుష్టశక్తులకు గుణపాఠం నేర్పాలి. లేకపోతే సమాజంలో ఎవరికీ రక్షణ ఉండదు.

దిశ యాప్‌తో అక్కచెల్లెమ్మలకు భద్రత

రాష్ట్రంలో 16వేల మంది మహిళా పోలీసులను గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో నియమించాం. దేశంలో ఎక్కడాలేని విధంగా దిశ యాప్ తీసుకొచ్చాం. దిశ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటుచేయడంతో పాటు ప్రతి జిల్లాలో దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాం. అక్కచెల్లెమ్మల భద్రత మీద ఇంతగా శ్రద్ధ పెట్టాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో పోలీసులు మహిళలకు భద్రత కల్పిస్తున్నారు. ఒక్క దిశ యాప్ రాష్ట్రంలో 1.25 కోట్ల మంది అక్కచెల్లెమ్మల ఫోన్‌లలో రిజిస్టర్ అయింది. ఆపదలో ఉన్న దాదాపు 31,200 మంది అక్కచెల్లెమ్మలు ఈ యాప్‌లో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కడంవల్లో, ఫోన్ గట్టిగా షేక్ చేయడంవల్లో పోలీసులు అక్కడికి చేరుకుని భద్రత కల్పించారు.

రూ.30లక్షల నుంచి రూ.75లక్షలు బీమా రక్షణ..

గతంలో పోలీసులు ఎవరైనా చనిపోతే బీమా వచ్చేది కాదు. పోలీసులకు జీతాలిచ్చే కార్యక్రమం ఎస్‌బీఐ ద్వారా చేస్తున్నాం. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా యాజమాన్యాన్ని పిలిచి పోలీసుల బీమా సౌకర్యం గురించి చర్చించాం. ఆ చర్చలు పూర్తయ్యాయని చెప్పడానికి ఈ రోజు సంతోషిస్తున్నాను. ప్రతి పోలీసు సోదరుడికి బీమా కింద రూ.30 లక్షల నుంచి రూ.75 లక్షలు బీమా కవరేజ్ ఇచ్చేందుకు ఎస్‌బీఐ ముందుకొచ్చింది. ఇవేకాక.. పోలీసులకు చేయగలిగిన ప్రతి మేలూ కచ్చితంగా చేస్తాం.

పోలీసుల త్యాగనిరతి నిరుపమానం: తానేటి వనిత

సమాజానికి పోలీసులు అందిస్తున్న సేవలు నిరుపమానమని హోంమంత్రి తానేటి వనిత కొనియాడారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పోలీసుల త్యాగనిరతి, ధైర్య సాహసాలు సమాజానికి సదా స్ఫూర్తిదాయకమన్నారు. పోలీసుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. సోషల్ మీడియా వేధింపులను తీవ్రంగా పరిగణిస్తున్నామని.. అందుకోసం 130 మందితో ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటుచేసి మరో ఐదుగురితో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 30 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. మరోవైపు.. రాష్ట్రంలో గంజాయి సాగును నిర్మూలించడంతోపాటు అక్రమ సారా తయారీకి అడ్డుకట్ట వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డితో పాటు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోలీసు సంక్షేమానికి పెద్దపీట..

మనందరి ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. పోలీసులకు ఇంకా మంచి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. దేశంలో ఎక్కడా జరగని విధంగా వీక్లీఆఫ్ విధానాన్ని తీసుకొచ్చాం. పోలీసుల మీద ఒత్తిడి తగ్గించేందుకు అదనంగా పోలీసులను నియమించాల్సిన అవసరం ఉందని గుర్తించాం. గ్రామస్థాయిలో 16వేల మహిళా పోలీసులను నియమించాం. దాదాపు మరో 6,550 పోస్టులను భర్తీ చేసేందుకు (6,100 కానిస్టేబుల్ పోస్టులు, 450 ఎస్సై పోస్టులు) వేగంగా చర్యలు చేపట్టాం. కొందరు కోర్టుల వరకు వెళ్లడంతో కాస్త జాప్యం జరుగుతోంది. కోర్టుల్లో త్వరగా ఒక పరిష్కారం వచ్చేలా చేసి పోలీసు ఉద్యోగాల నియామక ప్రక్రియను ఎంత త్వరగా వీలైతే అంత వేగంగా పూర్తిచేయాలని డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. రాష్ట్రంలో ఇప్పటికే నాలుగు ఐఆర్ బెటాలియన్లను తీసుకొచ్చాం. కరోనాతో ప్రాణాలు కోల్పోయిన 201 మంది పోలీసుల కుటుంబాలను ఆదుకున్నాం. ఎస్‌బీఐ వంటి సీఎస్ఆర్ ఫండ్స్ కూడా ఏకంచేసి ఒక్కో కుటుంబానికి రూ.17 లక్షల ఆర్థిక సాయం అందించి తోడుగా నిలబడ్డాం. మనందరి ప్రభుత్వం రాకముందు వరకు హోంగార్డులకు నెలకు రూ.12వేలు మాత్రమే జీతం ఇచ్చేవారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి జీతం రూ.21,300కు పెంచాం. ప్రతి కానిస్టేబుల్, హోంగార్డుకు మంచి చేయాలన్న తపనతో అడుగులు వేస్తున్నాం. కానిస్టేబుళ్ల నియామకాలలో హోంగార్డులకు గతంలో ఉన్న రిజర్వేషన్లు 8 శాతం ఉంటే వాటిని 15 శాతానికి పెంచాం. ఏపీఎస్పీలో గతంలో 10శాతం రిజర్వేషన్లు ఉంటే.. మన ప్రభుత్వం ఆ రిజర్వేషన్లను 25 శాతానికి పెంచింది.

క్లుప్తంగా...

ఇస్రోకు గవర్నర్ అభినందనలు

సాక్షి, అమరావతి: గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ డీ1 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అభినందించారు. గగన్‌యాన్ ప్రయోగానికి ముందు కీలకమైన టెస్ట్ వెహికల్‌ను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. అతి తక్కువ వ్యయంతో అంతరిక్షంలోని 400 కి.మీ కక్ష్యలోకి మానవులను పంపి తిరిగి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన గగన్‌యాన్ విజయవంతం కావాలని గవర్నర్ ఆకాంక్షించినట్లు రాజ్‌భవన్ వర్గాలు శనివారం తెలిపాయి.

మరింత ఎత్తైన కక్ష్యలోకి ఇస్రో దూసుకెళ్తోంది

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: ఇస్రో బృందానికి సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ డీ1 మిషన్ విజయవంతం అవడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో మరింత ఎత్తైన కక్ష్యలోకి ఇస్రో దూసుకెళ్తోందని ఆయన కొనియాడారు.

పోరాట యోధుడు పోలీసు

- ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కుటుంబానికి అండగా ఉంటా
- 'ఎక్స్' (ట్విట్టర్)లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని మన ప్రభుత్వం తరఫున ఈరోజు నిర్వహించాం. ఈ ఏడాది మన రాష్ట్రంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సోదరుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నా. సమాజ భద్రత కోసం తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడే పోరాట యోధుడే పోలీస్. అధునాతన వ్యవస్థలను ఉపయోగించుకుని నేరాలకు పాల్పడుతున్న వారిని ఎదుర్కోవలసిన బాధ్యత నేటి పోలీసులపై ఉంది. నేర నిరోధం, నేర దర్యాప్తులో మన రాష్ట్ర పోలీసులు అత్యాధునిక సైబర్ టెక్నాలజీని ఉపయోగిస్తూ దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు. ఈ విభాగంలో నియమించిన 130 మంది సాంకేతిక పోలీసింగ్ నిపుణుల పనితీరు మన ప్రజలకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోంది'.. అంటూ శనివారం సీఎం జగన్ 'ఎక్స్' (ట్విట్టర్)లో పేర్కొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష.. ప్రజలకు దసరా శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పండుగలను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ సీఎం వైఎస్ జగన్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మలగన్నయమ్మ..ముగ్గురమ్మల మూలపుటమ్మ అనుగ్రహం కోసం.. నవరాత్రుల్లో 9 రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో దుర్గామాతను పూజిస్తారని సీఎం పేర్కొన్నారు. చెడుపై.. మంచి, దుష్ట శక్తులపై.. దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే విజయదశమి అని తెలిపారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ఆ కనకదుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

బీజేపీ నేతను హతమార్చిన మావోయిస్టులు

- ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

చర్ల: అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో దారుణానికి ఒడిగట్టారు. బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శిని కాల్చిచంపి భయోత్పాతం సృష్టించారు. జిల్లాలోని మొహ్లా–మాన్‌పూర్ మార్గంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సర్కెడా గ్రామంలో నివాసముంటున్న బిర్జు తారమ్ ఇంటికి శుక్రవారంరాత్రి పదిమంది సాయుధులైన మావోయిస్టులు వచ్చారు. వీరిలో ముగ్గురు తారమ్‌పైకి మూడురౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడే కుప్పకూలారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



నూతన అదనపు జడ్జిలతో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం జగన్, హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్

నలుగురు అదనపు జడ్జిల ప్రమాణం

- హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌తో ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- హాజరైన సీఎం వైఎస్ జగన్, సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

సాక్షి, అమరావతి: హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నూనేపల్లి హరినాథ్, మండవ కిరణ్మయి, జగడం సుమతి, న్యాపతి విజయ్ శనివారం ప్రమాణం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ నలుగురితో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణస్వీకారం చేయించారు. మొదట హరినాథ్, ఆ తర్వాత కిరణ్మయి, సుమతి, విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అదనపు జడ్జీలులుగా ప్రమాణస్వీకారం చేసిన నలుగురికి గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ప్రమాణస్వీకారం పూర్తయిన తర్వాత నలుగురు కూడా గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అంతకుముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రొసీడింగ్స్ నిర్వహించారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు ప్రమాణం చేసిన నలుగురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీ చేసిన ఉత్తర్వులను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన అదనపు న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తేనీటి విందులో అందరూ పాల్గొన్నారు. కాగా, హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌లను హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరిలో హరినాథ్ 2034 వరకు, కిరణ్మయి 2032 వరకు, సుమతి 2033 వరకు, విజయ్ 2036 వరకు హైకోర్టు న్యాయమూర్తులుగా కొనసాగుతారు.



హాజరైన న్యాయమూర్తులు, జ్యుడిషియల్ సిబ్బంది



కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, గవర్నర్, హైకోర్టు సీజే



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని రాజ్‌భవన్‌లో శనివారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తేనేటి విందులో పాల్గొని గవర్నర్‌తో కాసేపు ముచ్చటించారు.

గ్రామ స్వరాజ్యం దిశగా పథకాలు

- కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

తిరుపతి కల్చరల్: గ్రామ స్వరాజ్యం దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చెప్పారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో తన శాఖలకు సంబంధించిన కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు జరుగుతున్న తీరుపై రాష్ట్ర అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అన్ని రాష్ట్రాలు వాటిని ప్రజలకు చేర్చడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నాయని చెప్పారు. సర్వే లాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్ మాట్లాడుతూ.. స్వామిత్వా కింద రాష్ట్రంలో గ్రామకంఠాలు, వ్యవసాయ భూముల రీ సర్వే సమాంతరంగా చేపడుతున్నామని వివరించారు. 17,000 గ్రామాల్లో రీసర్వే చేపట్టామని తెలిపారు. సుమారు 13 వేల గ్రామాల్లో డిసెంబర్ నాటికి డ్రోన్ ఫ్లై, ఇమేజింగ్ వంటివి పూర్తవుతాయని వివరించారు. దీనిపై కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. స్వామిత్వా ముఖ్య ఉద్దేశం తగాదాలు లేని కచ్చితత్వం గల యూనిక్ ఐడి నంబర్, ఎల్‌పీ నంబర్‌తో భూ ఆధార్ ద్వారా సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ కార్యాలయాలకు, బ్యాంకు, కోర్టుకు అనుసంధానం చేయనున్నామన్నారు. కాగా, గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి కావాలని కేంద్ర మంత్రి అధికారులకు సూచించారు. సమీక్షలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి, పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి, పంచాయతీ స్పెషల్ కమిషనర్ సిరి, నరేగా డైరెక్టర్ చిన్న తాతయ్య పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్

తెలంగాణ

రహదారులు కిటకిట

దసరా, బతుకమ్మల ప్రభావం



బీబీనగర్/చౌటుప్పల్: విజయదశమి, బతుకమ్మల పండుగల ప్రభావం జాతీయ రహదారులపై పడింది. హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారులపై శనివారం వాహనాలు భారీగా బారులు తీరాయి. పండుగలకు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు వెళ్తున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రద్దీ కొనసాగింది. జాతీయ రహదారిపై మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల కూడళ్ల వద్ద రోడ్డు దాటేందుకు ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

- విమ్స్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక
- రూ.16 వేల కోట్లతో నాడు–నేడు కింద ఆస్పత్రుల అభివృద్ధి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వెల్లడి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని ధ్వజమెత్తారు. విశాఖ కేజీహెచ్ ఆవరణలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. టీడీపీ పాలనలో ఒక్క ఆస్పత్రి అయినా నిర్మించారా, వైద్యులు, ఇతర సిబ్బంది నియామకం చేపట్టారా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైద్య, ఆరోగ్య రంగాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఒక వైపు ఆస్పత్రులను పునర్నిర్మిస్తూ, మరో వైపు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో రూ.16 వేల కోట్లతో నాడు–నేడు కింద ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క కేజీహెచ్‌లోనే నాడు–నేడు కింద రూ.600 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆరోగ్యశ్రీలో 1054 ఉండే వ్యాధులను నేడు 3,257 వ్యాధులకు చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. ఏపీలో మొత్తం 18 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదు మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభించామని, వచ్చే విద్యా సంవత్సరంలో మరో ఐదు మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు మొదలవుతాయని వెల్లడించారు. విమ్స్ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించామని మంత్రి రజిని వివరించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రజిని

బాధితులకు బాసటగా సీఎం జగన్

కర్నూలు(సెంట్రల్): అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సాయం కోసం వచ్చిన బాధితులకు సీఎం వైఎస్ జగన్ బాసటగా నిలిచారు. ఈనెల 19న ఎమ్మిగనూరుకు వచ్చిన సీఎంను హెలిప్యాడ్‌లో పలువురు బాధితులు కలిసి వైద్య, ఆర్థిక సహాయం చేయాలని విన్నవించారు. వారి కష్టాలను చూసి చలించిన ఆయన తక్షణమే ఆదుకోవాలని కలెక్టర్ సృజనను ఆదేశించారు. అందులో భాగంగా కలెక్టర్ 12మందికి ఆర్థిక సాయం అందించారు. ఇందులో 11మందికి లక్ష చొప్పున ఇవ్వగా, ఒక్కరికి రూ.50 వేల చెక్కు అందజేశారు. 12 మందిలో శుక్రవారం ఆరుగురికి, శనివారం మరో ఆరుగురికి కలెక్టర్ తన చాంబర్‌లో చెక్కులను అందజేశారు.

- ■ గడివేముల మండలంలోని కొర్రపోలేరుకు చెందిన జీహెచ్ మద్దిలేటి బోన్ కేన్సర్‌తో బాధపడుతుండగా తక్షణ సాయంగా రూ.50వేల చెక్కు అందజేశారు.
- ■ ఆదోని మండలం కల్లుబావికి చెందిన పీఎస్ ఓబులేసు కాలు ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చు కాగా..ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండటంతో రూ.లక్ష చెక్కు అందించారు.
- ■ కర్నూలులోని గురుబ్రహ్మనగర్‌కు చెందిన యుగంధర్ అంగవైకల్యంతో బాధపడుతుండటంతో రూ.లక్ష చెక్కు పంపిణీ చేశారు.
- ■ మండల కేంద్రం నందవరానికి చెందిన ఎస్.సియోని ఆపరేషన్ ఖర్చులకు రూ.లక్ష చెక్కు అందించారు.
- ■ భర్త చనిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నానని, వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోడుమూరుకు చెందిన భాగ్యమ్మ వేడుకోగా రూ.లక్ష తక్షణ సాయం పంపిణీ చేశారు.
- ■ ఆదోని మండలం కల్లుబావికి చెందిన పీఎస్ శాంతి ప్రమాదంలో చేయి కోల్పోగా మానవతా దృక్పథంతో రూ.లక్ష చెక్కు అందించారు.





సాయం చేయాలని సీఎంను అభ్యర్థిస్తున్న సియోని.. చెక్కును అందజేస్తున్న కలెక్టర్

క్లుప్తంగా...

నేడు బంగాళాఖాతంలో వాయుగుండం!

తుపానుగా బలపడే అవకాశం?

సాక్షి, విశాఖపట్నం: మధ్య బంగాళాఖాతంలో ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది వాయవ్య దిశగా పయనిస్తూ ఆదివారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారనుంది. అనంతరం ఈ వాయుగుండం ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరాల వైపు పయనించనుంది. ఆ తర్వాత మూడు రోజుల్లో మరింతగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం నివేదికలో వెల్లడించింది. ఈ వాయుగుండం తుపానుగా బలపడవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి సూచికగా తమిళనాడులో శనివారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయని ఐఎండీ తెలిపింది. నేడో, రేపో మన రాష్ట్రంలోనూ ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. రానున్న రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

వ్యక్తిగత దూషణలు వద్దు: పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: 'రాజకీయాల్లో ఎప్పుడు, ఎవరిని కలవాల్సి వస్తుందో చెప్పలేం. ప్రత్యర్థి పార్టీల నాయకులతోనూ మంచిగా ఉండండి. వ్యక్తిగత దూషణలు వద్దు. సోషల్ మీడియాలోనూ వ్యక్తిగత పోస్టులు పెట్టవద్దు. పార్టీ విధానాలకు కట్టుబడి మాత్రమే మాట్లాడండి' అని జనసేన నేతలకు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సూచించారు. శనివారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ అధికార ప్రతినిధులతో పవన్ మాట్లాడారు. 'విలేకరుల సమావేశాలు, టీవీ చర్చల్లో పాల్గొనే నేతలు అనవసర విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లొద్దు. రాజకీయాల్లో ఎప్పుడూ శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. రాష్ట్రం కోసమే టీడీపీ కలిశామని గట్టిగా చెప్పాలి. ఎన్నికలు సమీపిస్తున్నందున అధికార ప్రతినిధుల పాత్ర ఎక్కువగా ఉంటుంది. వారికి వచ్చే నెలలో వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తాం' అని పవన్ చెప్పారు.

పవన్..ఆత్మపరిశీలన చేసుకో: మంత్రి చెల్లుబోయిన



సాక్షి, రాజమహేంద్రవరం: రాజకీయ విలువలకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇస్తున్నారో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని మంత్రి చెల్లుబోయిన వేణు హితవు పలికారు. తెలంగాణలో బీజేపీతో జనసేన పొత్తు పెట్టుకుని, ఏపీలో టీడీపీతో జట్టు కట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. శనివారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపు సామాజికవర్గాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారన్నారు. పవన్‌ను ఒక టూల్‌గా వాడుకుని కాపులను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. చట్టాలకు చంద్రబాబు అతీతుడు కాదని, చట్టాలు తనకు వర్తించవనే భ్రమ నుంచి ఆయన బయటకు రావాలన్నారు.

బాబుతో కుటుంబ సభ్యుల ములాఖత్

సాక్షి, రాజమహేంద్రవరం : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబుతో శనివారం కుటుంబ సభ్యులు ములాఖత్ అయ్యారు. భువనేశ్వరి, బ్రాహ్మణి, రామకృష్ణ కలిశారు. సుమారు 40 నిమిషాలు బాబుతో మాట్లాడారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్టు సమాచారం.

చంద్రబాబుకు 8 రకాల వైద్య పరీక్షలు

రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబు హెల్త్ బులెటిన్‌ను జైలు సూపరింటెండెంట్ రాహుల్ విడుదల చేశారు. ఆయనకు 8 రకాల వైద్య పరీక్షలు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. బీపీ 130/80, పల్స్ 70/మినిట్, రెస్పిరేటరీ రేట్ 13/మినిట్.. ఉన్నట్లు వెల్లడించారు.

భయం నా బయోడేటాలో లేదు: నారా లోకేశ్

సాక్షి, అమరావతి : వ్యవస్థల్ని మేనేజ్ చేస్తూ చంద్రబాబును 43 రోజులుగా జైల్లో నిర్బంధించారని టీడీపీ నేత నారా లోకేశ్ ఆరోపించారు. స్కిల్ కేసులో ఉన్నవారందరికీ బెయిల్ వచ్చిందని, చంద్రబాబుకు మాత్రం బెయిల్ రాకుండా వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు.. కుటుంబాన్ని వదిలేసి 45 ఏళ్ల ప్రజల కోసమే పని చేశారని చెప్పారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని కాపాడటం కోసమే పవన్‌తో పొత్తు పెట్టుకున్నట్టు తెలిపారు. చంద్రబాబు ప్రారంభించిన బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని నవంబర్ ఒకటి నుంచి మళ్లీ ప్రారంభిస్తామని, చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన కుటుంబాలను తన తల్లి భువనేశ్వరి త్వరలో పరామర్శిస్తారని, యువగళం పాదయాత్ర కూడా త్వరలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. చంద్రబాబును అరెస్టు చేస్తే టీడీపీ పని అయిపోతుందనుకున్నారని, కానీ భయం తన బయోడేటాలో లేదని లోకేశ్ అన్నారు.

పేదల ఇళ్లపై ఇవేం రాతలు!?

జగనన్న కాలనీలపై ఈనాడు ఎడతెగని ఏడుపు

- మౌలిక సదుపాయాలు లేవంటూ రోత రాతలు
- లేఔట్లలో ఇళ్లన్నీ పూర్తయితేనే శాశ్వతంగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తారు.. ఏ ప్రైవేటు వెంచర్‌లోనైనా ఇదే పద్ధతి
- ముందుగానే వాటిని నిర్మిస్తే లారీలు, ట్రాక్టర్ల రాకపోకలతో ధ్వంసమవుతాయి కాబట్టి..
- కనీస ఇంగిత జ్ఞానం లేకుండా రామోజీ అడ్డగోలు రాతలు
- ఒక్కో ఇంటి పట్టా విలువ సగటున రూ.2.50 లక్షలు..
- కొన్నిచోట్ల రూ.12లక్షలు నుంచి రూ.15లక్షలు పైగానే కూడా..
- ఇలా పేదలకు రూ.75వేల కోట్ల నుంచి రూ.1.5లక్షల కోట్ల ఆస్తిని సమకూర్చిన సీఎం జగన్ సర్కార్..
- కానీ, పేదల ఇళ్లపై తొలి నుంచి విషం కక్కుతున్న టీడీపీ, దుష్టచతుష్టం
- కోర్టుల్లో వెయ్యికి పైగా కేసులు.. అమరావతిలో అయితే సామాజిక సమతుల్యం దెబ్బతింటుందని పెత్తందారీ వాదన
- క్రమంగా ఈ సమస్యలన్నింటినీ అధిగమిస్తూ 31లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలిచ్చిన సీఎం జగన్
- కాలనీల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కోసం రూ.32,909 కోట్లు
- వెచ్చించనున్న సర్కార్ ఇందులో ఇప్పటికే రూ.4,800 కోట్ల ఖర్చు

ఫ్యాక్ట్ చెక్



సామర్లకోటలోని జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు, రోడ్లు, పార్కులు

సాక్షి, అమరావతి: రామోజీరావుకు కథలంటే భలే ఇష్టం.. కట్టుకథలు, కాకమ్మ కథలంటే ఇంకా ఇష్టం .. ప్రభుత్వంపై బురద జల్లేవి అయితే లొట్టలు వేసుకునేంతగా మరీ ఇష్టం. ఎందుకంటే.. ఆయనకో రోగం ఉంది. దాని పేరు కడుపుమంట. ఇలాంటి కట్టుకథలు, కాకమ్మ కథలు, రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే స్టోరీలే ఆ బాధ నుంచి ఆయనకు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తాయి. అది తగ్గిపోగానే మళ్లీ కడుపు రగులుతూ ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ షరా మామూలే.. మరో కల్పిత కథనం. ఇది రామోజీకి నిత్యకృత్యం. కానీ, ఈ మధ్య ఈ రోగం ముదురుతోంది. తన పార్ట్‌నర్ జైలు నుంచి వచ్చే అవకాశాలు కనుచూపు మేరలో కనిపించకపోవడంతో ఆయన వెర్రెక్కిపోతున్నారు. ఫలితంగా ఆయన కట్టుకథల శృతి మించుతోంది. ఎంతలా అంటే.. 'నవరత్నాలు పేదలందరీ ఇళ్లు' పథకంలో శరవేగంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తుంటే వాటిని చూసి ఓర్వలేనంత. పైగా.. పేదలు సంతోషంగా సొంతిళ్లలోకి వెళ్తుంటే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు. సాధారణంగా.. ఎక్కడైనా లేఔట్లలో పూర్తిస్థాయి నిర్మాణాలు చేసిన తర్వాతే శాశ్వత డ్రెయిన్లు, రోడ్లు వేస్తారు. ఎందుకంటే.. వాటిని ముందే నిర్మిస్తే ఇళ్ల నిర్మాణంలో భాగంగా లేఔట్లలో లారీలు, ట్రాక్టర్లు తిరిగేటప్పుడు ధ్వంసమవుతాయి కాబట్టి. ఇది ఒక్క జగనన్న కాలనీల్లోనే కాదు.. ఏ ప్రైవేటు వెంచర్‌లోనైనా ఇలానే చేస్తారు. కానీ, ఈ చిన్న లాజిక్‌ను రామోజీ మిస్ అయ్యారు. ఈ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా లేకుండా ఈనాడు శనివారం 'జగనన్నా.. ఇవేం కాలనీలు' అంటూ పెడబొబ్బలు పెట్టింది. పేదల ఇళ్లతో ఏర్పడ్డ కాలనీల స్థితిగతులపై లేనిపోని అపోహలు సృష్టించేందుకు ఆపసోపాలు పడింది.

పెత్తందారీ ముసుగులో కలియుగ రాక్షసులు..

టీడీపీ, రామోజీరావు పెత్తందారుల ముసుగులో చెలామణీ అవుతున్న కలియుగ రాక్షసులు. అందుకే నిత్యం పేదలకు ఇళ్ల స్థలాల మహాయజ్ఞాన్ని భగ్నం చేసే కుట్ర చేస్తూనే ఉన్నారు. కోర్టుల్లో దాదాపు వెయ్యికి పైగా కేసులు వేయించి విశాఖతో పాటు ఎక్కడా కూడా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకుండా చాలాకాలం అడ్డుకున్నారు. అమరావతిలో అయితే మరింత పేట్రేగిపోయి.. పేదలకు ఇళ్ల పట్టాలిస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని నీచంగా రాతలు రాశారు. వీటన్నింటినీ ఛేదించుకుంటూ జగన్ సర్కార్ పేదల సొంతింటి కలలో భాగంగా ఇళ్ల పట్టాలను అందించింది. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేలా ఆర్థిక చేయూతనిస్తోంది. మూడు ఆప్షన్ల ద్వారా అక్కచెల్లెమ్మలను సొంతింటి యజమానులను చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అత్యంత పారదర్శకంగా, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. కులమతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేసింది. పైగా ఇళ్ల పట్టాల పంపిణీతో ప్రభుత్వం సామాజిక న్యాయానికి బాటలు వేసింది. పట్టాలు అందుకున్న వారిలో 20 శాతం ఎస్సీలు, ఆరు శాతం ఎస్టీలు, 54 శాతం బీసీలు, 21 శాతం ఇతరులున్నారు. గతంలో ఇళ్ల పట్టాలు ఇవ్వకున్నా జన్మభూమి కమిటీలు పేదలకు ఆశ చూపించి వారి రెక్కల కష్టాన్ని దోచుకున్నాయి. కానీ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ప్రతి అక్కచెల్లెమ్మను లేఅవుట్ దగ్గరకు తీసుకెళ్లి, అక్కడ స్వయంగా వారికి కేటాయించిన పట్టాభూమిని చూపించి, వారికి పట్టా పత్రాలు అందించడం జగన్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.

మార్కెట్ ధరలకన్నా తక్కువకు నిర్మాణ సామాగ్రి

ఇక ప్రతి లబ్ధిదారుడికి 4.5 మెట్రిక్ టన్నుల సిమెంట్, 0.48 మెట్రిక్ టన్నుల స్టీలు మార్కెట్ ధరల కంటే తక్కువకే అందిస్తోంది. తలుపులు, కిటికీ ఫ్రేములు, షట్టర్లు, ఎలక్ట్రిక్, శానిటరీ సామాన్లు కింద 12 రకాల గృహ వస్తువులను కూడా తక్కువ రేటుకే ఇస్తోంది. కాలనీల్లోనే తాత్కాలిక గోడౌన్లను ఏర్పాటుచేసి మరీ లబ్ధిదారులకు పంపిణీ చేస్తోంది. వీటన్నింటి కోసం ఒక్కో ఇంటికి రూ.40వేల వరకు అదనపు సాయంతో పాటు, మహిళలకు పావలా వడ్డీకే రూ.35వేల రుణాన్ని అందించి, మిగిలిగిన వడ్డీని ప్రభుత్వమే భరిస్తూ ఇంటి నిర్మాణానికి చేదోడుగా నిలుస్తోంది. అలాగే, 20 టన్నుల చొప్పున ఉచితంగా ఇసుకను సమకూరుస్తోంది. దీనివిలువ రూ.15వేల వరకు ఉంటుంది. మధ్యవర్తులకు ప్రమేయం లేకుండా డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బును జమచేస్తూ పారదర్శకతను పాటిస్తోంది. ఇలా.. మొత్తం మీద యూనిట్‌కు రూ.1.80 లక్షలు కట్టుకోడానికి.. పావలా వడ్డీ కింద రూ.35వేలు.. మార్కెట్ ధరల కన్నా నిర్మాణ సామగ్రిని తక్కువకు సరఫరా చేయడం ద్వారా మరో రూ.55వేలు చొప్పున వెరసి ప్రతీ లబ్ధిదారునికి రూ.2.70లక్షల చొప్పున ప్రభుత్వం లబ్ధిచేకూరుస్తోంది.

నిన్నటి వరకు అలా..

రామోజీరావు 'అసత్యాల బకాసురుడు'. ఈనాడులో ఎన్ని అసత్యాలు రాస్తే ఆయన కడుపు అంతగా నిండుతుంది. నిన్నమొన్నటి వరకు అసలు ఇళ్ల స్థలాలు ఎక్కడున్నాయో లబ్ధిదారులకు తెలియడం లేదన్నారు. ఇళ్ల నిర్మాణం ముందుకు సాగట్లేదన్నా రు.కాలనీలన్నీమునిగిపోతున్నాయన్నారు. అసలు ఇళ్లు కడతారా? అని చెవికోసిన మేకలా అరిచారు.

నేడు ఇలా..

ఇప్పుడేమో కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవంటూ పెడబొబ్బలు పెడుతున్నారు. అంటే.. ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు కట్టిందని, తద్వారా కాలనీలు ఏర్పడ్డాయని, అందులో లబ్ధిదారులు ఉంటున్నారని ఈనాడు ద్వారా పరోక్షంగా అంగీకరించారు. ఈనెల 12న నిర్మాణాలు పూర్తి చేసుకున్న 7,43,396 ఇళ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి ప్రారంభించారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం. మరో 14,42,425 ఇళ్ల పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. తొందర్లోనే వీటిని కూడా ప్రారంభిస్తారు. ఇన్ని లక్షల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాన్ని సహించలేని టీడీపీ, దుష్టచతుష్టయం కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవంటూ రోత రాతలు ప్రారంభించాయి. వాస్తవానికి జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అంటే.. తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుదీకరణ, ఇంటర్నెట్, ఆర్చ్‌లు, సోక్‌పిట్స్ ఏర్పాటు కోసం రూ.35,859 కోట్లతో కార్యాచరణను రూపొందించింది. ఇందులో శాశ్వత మౌలిక సదుపాయాల కోసం రూ.32,909 కోట్లు ఖర్చుచేస్తోంది. లేఔట్లలో ముందుగా కనీస అవసరాల కింద.. కరెంటు, తాగునీరు, సోక్‌పిట్స్, రోడ్ల కోసం కనీసంగా రూ.4,800 కోట్లు ఖర్చుచేసింది.

జగనన్న కాలనీల్లో శాశ్వత సదుపాయాల కల్పన వ్యయం.. (రూ.కోట్లలో..)

నీటి సరఫరా	3,847.18
విద్యుత్	4,431.26
ఇంటర్నెట్	707.48
రోడ్లు	10,408
డ్రెయిన్లు	5,927.78
ఆర్చ్‌లు	347.34
ఇంకుడు గుంతలు	(సోక్ పిట్స్) 108
ఫేజ్–2	7,131.96
మొత్తం	32,909

పేదలకు రూ.1.5 లక్షల కోట్ల ఆస్తి..

రాష్ట్రంలో సొంతిళ్లు లేని కుటుంబం ఉండకూడదన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం. అందుకే దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఒకేసారి 31లక్షల ఇళ్ల పట్టాలను పేదలకు ఇచ్చారు. మహిళా సాధికారతలో భాగంగా వారికి ఆర్థిక భరోసా ఉండాలనే ధ్యేయంతో అక్కచెల్లెమ్మల పేరుతోనే వాటిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం మరో విశేషం. అంతేకాదు.. వీటిల్లో సుమారు 22 లక్షల ఇళ్లను నిర్మిస్తున్నారు. తద్వారా 17వేలకు పైగా కొత్త కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పుడు ఒక్కో ఇంటి పట్టా విలువ రూ.2.5 లక్షల మొదలు రూ.12లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉండటం గమనార్హం. ఈ లెక్కన చూస్తే పేదలకు జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఆస్తి అక్షరాల రూ.1.5 లక్షల కోట్లు. రాష్ట్రంలో ఇదంతా జరుగుతుందని 14ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు, ఆయన రాజగురువు రామోజీ కలలో కూడా ఊహించి ఉండరు. ఎందుకంటే వాళ్లకు పేద లంటే గిట్టదు. ఇన్నేళ్లలో తన పార్ట్‌నర్ చంద్రబాబు పేదలకు ఒక్క సెంటు భూమి ఇవ్వకపోయినా ఈనాడులో ఏనాడు ప్రశ్నించలేదు. బడుగు జీవులు ఇళ్ల స్థలాల కోసం ధర్నాలు, ఆందోళనలు చేసినా ఈనాడులో ఒక్క అక్షరం ముక్క కూడా రాయలేదు. అలాంటిది తమ కళ్లెదుటే పేదోడు సంతోషంగా ఉండటం, వారి జీవన ప్రమాణాలు పెరగడం చూసి ఆయన వెర్రెక్కిపోతున్నారు.

నాడు ఒప్పు.. నేడు తప్పా..!

- విదేశీ బొగ్గు వినియోగంపై 'ఈనాడు' ద్వంద్వ వైఖరి
- అడ్డగోలుగా 21.03 లక్షల టన్నులు కొన్న చంద్రబాబు ప్రభుత్వం
- అప్పుడు తప్పనిపించలేదు.. ఇప్పుడు తక్కువ ధరకు కొంటున్నా తప్పేనట
- విద్యుదుత్పత్తికి విదేశీ బొగ్గు తప్పనిసరిగా వాడాలని కేంద్రం ఆదేశం

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: ఎందుకేడుస్తున్నావురా అంటే.. ఏదో ఒకటి ఏడవాలిగా.. అన్నాడటొకడు. కరెంటు కోసం కొనే విదేశీ బొగ్గుపై ఓ కథ అచ్చేసిన ఈనాడు తీరూ ఇలానే ఉంది. వాస్తవాలతో పని లేకుండా, ఏదో ఒకటి బురద జల్లడమే పనిగా ఈనాడు మరో తప్పుడు కథనం అచ్చేసింది. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా, తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ సమకూరుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేసింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనూ విదేశీ బొగ్గును అడ్డగోలుగా కొన్న విషయాన్ని మరుగున పెట్టింది. ఇప్పుడు వీలైనంత తక్కువ ధరతో అత్యంత నాణ్యమైన హైగ్రేడ్ విదేశీ బొగ్గు కొంటుంటే అదే తప్పయినట్లు ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. పైపెచ్చు 4 శాతం విదేశీ బొగ్గు తప్పనిసరిగా వాడాలని కేంద్రం కూడా నిబంధన విధించింది. చంద్రబాబు హయాంలో ఇలాంటి కేంద్ర నిబంధనలేమీ లేకపోయినా విదేశీ బొగ్గు కొన్నప్పటికీ, రామోజీ కిమ్మనలేదు. రామోజీ ఈ కుట్రపూరిత రాతలను రాష్ట్ర ఇంధన శాఖ, ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఏపీపీడీసీఎల్), ఏపీజెన్‌కో ఖండించాయి. వాస్తవాలను 'సాక్షి'కి వివరించాయి.

విదేశీ బొగ్గు తప్పనిసరి అని కేంద్రం ఆదేశాలు

దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలు అన్నీ 4 శాతం విదేశీ బొగ్గు తప్పనిసరిగా వాడాలని ఈ నెల 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అంతకు ముందు జనవరి నెలలో కూడా 6 శాతం విదేశీ బొగ్గు కొనాలంటూ కేంద్రం ఆదేశించింది. కేంద్రం ఆదేశాలను కాదని ముందుకు వెళ్లే అవకాశం రాష్ట్రాలకు లేదు. ఎందుకంటే.. స్వదేశీ బొగ్గు సరఫరా అంతా కేంద్రం చేతుల్లోనే ఉంది. స్వదేశీ బొగ్గు ఏ రాష్ట్రానికి ఎంత కేటాయించాలో కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది. కేంద్రం చెప్పిన మేరకు విదేశీ బొగ్గు కొనకపోతే స్వదేశీ బొగ్గులో కోత విధిస్తుంది. బయట కూడా కొనలేం. అదే జరిగితే రాష్ట్రానికి వచ్చే బొగ్గు తగ్గిపోయి, విద్యుత్ ఉత్పత్తి పడిపోతుంది. పైగా, దేశీయ బొగ్గుకు కూడా కొరత ఎక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో సరిపడినంత బొగ్గు దొరకకపోతే రాష్ట్రం అంధకారమే అవుతుంది. ఇలా రాష్ట్రానికి అన్ని విధాలా నష్టమే కలుగుతుంది. మన రాష్ట్రమే కాదు.. అన్ని రాష్ట్రాలు, కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ, ప్రైవేటు సంస్థలు కూడా కేంద్రం ఆదేశాలను పాటించి విదేశీ బొగ్గు కొంటున్నాయి. అయితే, ఈనాడుకు, టీడీపీకి విద్యుత్ ఉత్పత్తికంటే రాష్ట్రంలో అంధకారం నెలకొనడమే ఇష్టంలా ఉంది. అందుకే ఓ విషపు కథనాన్ని ఈనాడు అచ్చేసింది.

చంద్రబాబు ప్రభుత్వంలో అడ్డగోలుగా కొనుగోళ్లు

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇటువంటి నిబంధనలేమీ లేకుండానే భారీ మొత్తంలో విదేశీ బొగ్గు కొనుగోలు చేశారు. ఇష్టానుసారం టెండర్లు పిలిచి, సరఫరా సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. దీనివల్ల అప్పట్లో తక్కువ ధరకు బొగ్గు లభించే అవకాశాలు ఉన్నప్పటికీ, ఎక్కువ ధరకే బొగ్గు కొన్నారు. 2015–16 నుంచి 2018–19 మధ్య రివర్స్ టెండరింగ్ లేకుండానే ఏపీపీడీసీఎల్ విదేశీ బొగ్గు కొనుగోలు చేసింది. 2015–16లో 1,24,361 టన్నులు, 2016–17లో 7,67,505 టన్నులు, 2017–18లో 3,80,049 టన్నులు, 2018–19లో 8,31,632 టన్నులు.. ఇలా మొత్తంగా ఆ ఐదేళ్లలో 21.03 లక్షల టన్నుల విదేశీ బొగ్గును బాబు ప్రభుత్వం కొన్నది. ఈ కొనుగోళ్లలో ఎక్కడా పారదర్శకత అన్నది లేదు. రివర్స్ టెండరింగ్ లేదు. దొంగ లెక్కలతో ఇష్టానుసారం టెండర్లు పిలిచి, ఇష్టమొచ్చిన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టారు. తక్కువ ధరకు బొగ్గు లభించే అవకాశమున్నా, ఎక్కువ ధర చెల్లించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు పెద్ద మొత్తంలో నష్టం జరిగింది.

కృష్ణపట్నం థర్మల్ పవర్ స్టేషన్‌కు విదేశీ బొగ్గు తప్పనిసరి

రాష్ట్రంలోని కృష్ణపట్నం థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్–1 కింద నిర్మించిన రెండు యూనిట్లకు విదేశీ బొగ్గునే వాడాలి. 70:30 నిష్పత్తిలో స్వదేశీ, విదేశీ హైగ్రేడ్ బొగ్గు వాడాలి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా, ఇవ్వకపోయినా ఈ రెండు యూనిట్లకు ఇది తప్పనిసరి. అందువల్లే హైగ్రేడ్ విదేశీ బొగ్గు కోసం ఏపీపీడీసీఎల్ టెండర్లు పిలిచింది.

విదేశీ బొగ్గుతో ప్రజలకూ లాభమే

ముడి సరకుల ధరలు పెరగడంవల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం, సరఫరా ఖర్చులు పెరిగితే ఆ భారాన్ని వినియోగదారుల నుంచే వసూలు చేయాలి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సిఫార్సు ప్రకారమే ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలు వినియోగదారుల నుంచి డిస్కంలు వసూలు చేస్తున్నాయి. దేశీయ బొగ్గుతో పోల్చితే విదేశీ బొగ్గు ధర ఎక్కువ ఉండవచ్చు. కానీ దేశీయ బొగ్గుకు విదేశీ హైగ్రేడ్ బొగ్గు 70:30 నిష్పత్తిలో కలపడంవల్ల అధిక ఉత్పత్తి వస్తుంది. ఉత్పత్తి వ్యయం యూనిట్‌కు రూ. 3.14 మాత్రమే అవుతుంది. బహిరంగ మార్కెట్ ధరతో పోల్చితే ఇది సగం కూడా ఉండదు. చాలాసార్లు మూడో వంతు మాత్రమే. విదేశీ బొగ్గు వల్ల ఎక్కువగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాష్ట్ర ప్రజలకు సరఫరా చేస్తారు. ఆమేరకు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్ కొనాల్సిన భారం తగ్గి ప్రజలకు అంతిమంగా లాభమే చేకూరుతుంది.

తెలంగాణతో పోలికేమిటి?

తెలంగాణ ప్రభుత్వానికి సొంతంగా సింగరేణి బొగ్గు గనులు ఉన్నాయి. అందువల్ల ఆ రాష్ట్రానికి విదేశీ బొగ్గు అవసరం లేదు. బొగ్గు గనులు లేని ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణతో పోల్చడానికి వీలు లేదు.

ఈ తేడా చూడండి

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రివర్స్ టెండరింగ్ విధానంతో తక్కువ ధరకు విదేశీ బొగ్గు కొనుగోలు చేస్తోంది. ఇందులో రాష్ట్ర ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తోంది. చంద్రబాబు ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా సరఫరా సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదు. దొంగ రేట్లు నిర్ణయించడం లేదు. కొనుగోళ్లన్నీ పారదర్శకంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది విదేశీ బొగ్గు కోసం పిలిచిన టెండర్లను నాలుగు సార్లు రద్దు చేయడమే ఇందుకు నిదర్శనం. 7.5 లక్షల టన్నుల విదేశీ బొగ్గు కోసం ఏపీపీడీసీఎల్ ఈ ఏడాది టెండర్లు పిలిచింది. ధర ఎక్కువగా ఉండటంతో నాలుగు సార్లు వాటిని రద్దు చేసింది. అయిదోసారి తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గు లభిస్తుండటంతో ఆ టెండర్లు ఖరారు చేసింది. ఆ తర్వాత రివర్స్ టెండరింగ్ ద్వారా మరింత తక్కువ ధరతో హైగ్రేడ్ విదేశీ బొగ్గు కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. అన్నీ కలుపుకొని ప్లాంటు వరకు చేర్చేలా టన్నుకు రూ. 13,219 చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. ఇదే హైగ్రేడ్ విదేశీ బొగ్గుకు ఎన్టీపీసీ రూ.18,509కి కొనుగోలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత నాణ్యమైన బొగ్గును ఎంత తక్కువ ధరకు కొంటోందో, ఎంత ఆదా చేస్తోందో ఈ గణాంకాలే చెబుతున్నాయి. దీనిద్వారా ఉత్పత్తి వ్యయమూ తగ్గి, వినియోగదారులకు లాభమూ కలుగుతుంది.

ఎవరైనా టెండర్లు వేయొచ్చు

7.5 లక్షల టన్నుల హైగ్రేడ్ విదేశీ బొగ్గు సరఫరా చేసే సంస్థలు బిడ్లు దాఖలు చేయాలంటూ ఏపీపీడీసీఎల్ అత్యంత పారదర్శకంగా గ్లోబల్ టెండర్లు పిలిచింది. నిబంధనల ప్రకారం ఏ సంస్థ అయినా టెండర్లలో పాల్గొని బిడ్లు వేసి కాంట్రాక్టు దక్కించుకోవచ్చు. అత్యంత నాణ్యమైన హైగ్రేడ్ బొగ్గు సరఫరా చేయవచ్చు. ఇందులో ప్రత్యేకంగా అదానీ సంస్థకు ప్రయోజనం కలిగించే ప్రశ్నే ఉత్పన్నమవదు.

టెండర్లలో హడావుడి ఏముంది?

ఈ ఏడాది జనవరిలో 7.5 లక్షల టన్నుల విదేశీ బొగ్గు సరఫరాకు ఏపీపీడీసీఎల్ టెండరు ఖరారు చేసింది. అందులో ఇప్పటికే 6.30 లక్షల టన్నులు సరఫరా అయింది. రావాల్సింది 1.20 లక్షల టన్నులు మాత్రమే. ప్రస్తుత అవసరాల్లో అది స్వల్ప పరిమాణమే. అందువల్లే మళ్లీ టెండర్లు పిలిచింది. టెండరు ఖరారు అనేది సుదీర్ఘ ప్రక్రియ. నోటిఫికేషన్ జారీ నుంచి రివర్స్ టెండరింగ్, సంప్రదింపుల ద్వారా ధర తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఇదంతా సవ్యంగా పూర్తయ్యాకే ఒప్పందం చేసుకోవాలి. అందువల్ల హడావుడిగా టెండర్లు పిలిచిందనడంలో ఏమాత్రం వాస్తవంలేదు. టెండర్లలో అర్హత ఉన్న ఏ సంస్థలైనా పాల్గొనవచ్చు. ఏ సంస్థలు పాల్గొంటాయన్నది ఎవరూ ముందుగా చెప్పలేరు. ఒకవేళ ఏ సంస్థా టెండర్లలో పాల్గొనలేదంటే లాభదాయకం కాదని అర్థం. అలాంటప్పుడు ఏదో ఒక సంస్థకు ప్రయోజనమని ఎలా చెప్పగలం? టెండరు నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఏ సంస్థలైనా బిడ్లు దాఖలు చేస్తాయి.

మీ ఆస్తులపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా?

- టీడీపీ నేత లోకేశ్‌కు మంత్రి జోగి రమేశ్ సవాల్


సాక్షి, అమరావతి: 'మీరు చెబుతున్నట్లుగా చంద్రబాబు అంత నిజాయితీపరుడే అయితే.. మీ ఆస్తులపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా?' అని టీడీపీ నేత నారా లోకేశ్‌కు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ సవాల్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు మంచోడని, మహానుభావుడని, ఏ తప్పూ చేయలేదని లోకేశ్ చెబుతున్నారు. చంద్రబాబు నోట్లో వేలు పెడితే కొరకడేమో గానీ.. పిల్లనిచ్చి అక్కున చేర్చుకున్న మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని లాక్కున్న సిద్ధహస్తుడు. చంద్రబాబు, లోకేశ్‌లు గజదొంగల ముఠాకు నాయకులు. లోకేశ్ ఢిల్లీ వెళ్లి మా నాన్న స్కిల్ స్కాంలో రూ.27 కోట్లు కొట్టేశారని చెబితే ఎవరూ నమ్మడం లేదని గొప్పగా చెప్పారు. నిజమే.. చంద్రబాబు కేవలం రూ.27 కోట్లు దోచేశాడంటే ఎవరూ నమ్మరు. అందుకే ఆయన స్కిల్ స్కాంలో రూ.371 కోట్లు దోచేశారు. లోకేశ్ చెబుతున్నట్టుగా వారి హయాంలో రూ.17 లక్షల కోట్ల బడ్జెట్ పెడితే.. అందులో కనీసం 10 శాతం కొట్టేయగల సిద్ధహస్తుడు చంద్రబాబు. అవినీతి చక్రవర్తి చంద్రబాబు. టీడీపీ అనే ఒక వ్యాపార సంస్థకు చంద్రబాబు సీఈవోగా పనిచేశారు. ఏనాడూ నాయకుడిగా పనిచేయలేదు. అసలు రాజకీయ భవిష్యత్‌కు గ్యారెంటీ లేని టీడీపీ నాయకులు.. ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ ఇస్తామని చెప్పడం హాస్యాస్పదం. 2024 తర్వాత టీడీపీ, జనసేన కనుమరుగవ్వడం ఖాయం. తమ ఉజ్వల భవిష్యత్ కోసం సీఎం జగన్ మరో 20 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలే కోరుకుంటున్నారు. అవినీతి, అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న సీఎం జగన్‌ను టీడీపీ, జనసేన మాత్రమే వద్దనుకుంటున్నాయి.' ' అని జోగి రమేశ్ అన్నారు.



జీదలను బాధించు దరిద్రుడు... ఆహార వస్తువులను ఉండనియ్యక కొట్టుకొనిపోవు వానతో సమానుడు.

– క్రైస్తవ ధర్మం

ఓర్వలేని కళ్లన్నీ నీ మీదే తల్లీ!



ఎదగాలి నాన్నా... నువ్వింకా ఇంకా పైపైకి... ఈ లోకం గుర్తించేంత పైకి ఎదగాలి తల్లీ! దిగువ కులాల వృత్తి చట్రాల్లో బందీలై వెనుకబాటుతనాన్ని వారసత్వంగా మోసుకొస్తున్న మీ అమ్మానాన్నల కలలు ఫలించేలా... మీకు అండగా నిలబడిన మీ జగన్ మామ ఆశీస్సులు సాకారమయ్యేలా ఎదగాలి తల్లీ! అసూయా దృక్కులు నిన్ను వెన్నాడుతాయ్. భయపడకు! ఓర్వలేనితనం శాపనార్థాలు పెడుతుంది. చలించకు! పెత్తందార్లు పగబడతారు. ప్రతిఘటించు! నీ వెనుక మీ మేనమామ ఉన్నాడు.

తరతరాలుగా మీ తాత ముత్తాతల దగ్గర్నుంచీ మీ అమ్మానాన్నల దాకా మిమ్మల్ని తొక్కిపెట్టి ఉంచిన పెత్తందార్లు ఇప్పుడు నీ చదువు మీద యుద్ధం ప్రకటించారు. భయం లేదులే! అభయం దొరికింది కదా... ఇక దృష్టి పెట్టి చదువు! చదువే నీ తిరుమంత్రం. చదువే నీ రణతంత్రం. అంబేడ్కర్, పూలే, సావిత్రీబాయి, నారాయణ గురులు ఉపదేశించిన విముక్తి మార్గం చదువు.

నువ్వు అమెరికాకు వెళ్లి ఐక్యరాజ్యసమితి వేదికపై ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడుతుంటే మన పెత్తందార్లు కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు తెలుసా? నువ్వు అంతర్జాతీయ యూనివర్సిటీల్లో మాట్లాడుతుంటే ఈర్ష్యతో వాళ్ల కడుపులు కుతకుతలాడాయి తెలుసా? కానీలే, 'రానీ, రానీ, వస్తే రానీ! కోపాల్, తాపాల్, శాపాల్ రానీ' అన్నాడు కదా శ్రీశ్రీ. నిప్పులు పోసుకున్న వాళ్ల కళ్లు పేలిపోనీ, రగిలిన కడుపులు పగిలిపోనీ, ఇప్పుడా పెత్తందార్లు మీ అమ్మానాన్నలపైనే కాదు, అండగా నిలబడిన మీ జగన్ మామ మీద, చదువుకుంటున్న మీ మీద కూడా యుద్ధం ప్రకటించారు.

ఈ యుద్ధంలో గెలవాలంటే మీ కర్తవ్యం ఏమిటో తెలుసా? బాగా చదవాలి. పైపైకి ఎదగాలి. అడవులు కొండలు ఎడారులా మనకడ్డంకి అంటూ ముందుకు సాగాలి. సరిహద్దుల్నీ సముద్రాల్నీ దాటుకుంటూ వెళ్లాలి. ఆకాశాన్ని చీల్చుకుంటూ పైకెగరాలి. ఆరుద్ర పాట తెలుసుకదా! ''గ్రహ రాశుల నధిగమించి, ఘనతారల పథము నుంచి, గగనాంతర రోదసిలో, గంధర్వ గోళ గతులు దాటి'' అలా సాగిపోవాలి.

ఇంతకూ పెత్తందార్లంటే ఎవరో తెలుసా చిన్నా? వాళ్లూ అందరిలాగే ఉంటారు. కోరలూ కొమ్ములూ కనిపించవు. కాకపోతే డబ్బు ఉన్నదనే అహంకారంతో కనిపించని కొమ్ములు మొలుస్తాయి. ఈ సృష్టిలో ప్రతీదీ తమకే కావాలనుకుంటుంది పెత్తందార్ల వర్గం. భూమి, గాలి, నీరు, ఆకాశం మీద కూడా వాళ్లకే హక్కు ఉన్నట్టు భావిస్తారు. పొలాలు, ఫ్యాక్టరీలు, డబ్బు, అధికారం, హోదా అన్నీ వాళ్లకే ఉండాలి. మంచి చదువులు చదివితే తెలివి తేటలొస్తాయి. కనుక మంచి చదువులు తమ పిల్లలకే ఉండాలి. పేద పిల్లలు కూడా మంచి చదువులు చదివితే తమ పిల్లలతో సమానంగా ఉంటారు. మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. తమకు నౌకర్లు, చాకర్లు, డ్రైవర్లు, వంట వాళ్లు దొరకరు. సినిమా వాళ్లకు 'పవర్ స్టార్'.. 'పంచర్‌స్టార్' అని వెర్రికేకలు వేసే ఫ్యాన్స్ దొరకరు. ఈ కారణాల వల్ల ఇంగ్లీష్ మీడియంలో చదివితే చెడిపోతారని వాళ్ల ప్రచారంలో పెడుతున్నారు.

ఇంగ్లిష్ మీడియం విద్యకు వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడేందుకు చంద్రబాబు, ఆయన ముఠా వెనుకడుగు వేసినా పరోక్ష ప్రయత్నాలను మాత్రం ఆపలేదు. తెలుగు భాషా సంస్కృతుల ముసుగులో వివిధ వేదికల ద్వారా ఇంగ్లిష్ మీడియంపై విషం చల్లుతూనే వస్తున్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో పనిచేసిన పెద్దమనుషుల సేవలను కూడా ఇందుకోసం విరివిగా వినియోగించుకున్నారు. అయినా ఫలితం కలుగలేదు. ప్రజల సంపూర్ణ మద్దతుతో ఇంగ్లీషు మీడియంతో పాటు ఆనక విద్యాసంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన తర్వాత, ఐఎఫ్‌పీ స్క్రీన్లను అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఆ యా విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలు పెరిగినట్టుగా అసెస్‌మెంట్ పరీక్షల్లో ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ స్ఫూర్తితో దశలవారీగా ఐబీ సిలబస్‌ను కూడా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిశ్చయించింది.

ఇక లాభం లేదనుకున్న పెత్తందారీ ముఠా ఎన్నికలకు ఇంకో ఆరు నెలల సమయం ఉండగా ఆఖరు కృష్ణుడు పవన్ కల్యాణ్‌ని రంగంలోకి దించింది.

మాతృభాషలో విద్యాబోధన ఆవశ్యకతను గురించి సుద్దులు చెప్పడానికి కొందరు పెద్దల్ని రంగంలోకి దించుతారు. ఇప్పటికే దించారు కూడా! మాతృభాషలోనే పాఠాలు నేర్చుకుంటే జ్ఞానం పెరుగుతుందనీ, సులభంగా అర్థమవుతాయనీ చెబుతారు. అంతేగాకుండా అంతా ఆంగ్ల మీడియంలో చదివితే తెలుగు సంస్కృతి దెబ్బతింటుందని వాపోతారు. అలాంటి వాళ్లు మీకు తగిలినప్పుడు రెండు ప్రశ్నలు వేయండి. ఒకటి – ఇప్పుడు ఇంగ్లీషులో చదవకపోతే పై చదువులకు వెళ్లినకొద్దీ ఇంగ్లీషులోనే చదవాల్సిన పాఠాలకు ఎలా అలవాటు పడతామని అడగాలి. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఎలా నెగ్గుతామని అడగాలి. మీరు పై చదువులు పెద్దగా చదవొద్దని కదా వారి ఉద్దేశం. అందుకని మీరా ప్రశ్న అడగ్గానే గతుక్కుమంటారు. ఇక రెండో అంశం – 'అయ్యా! గత యాభయ్యేళ్లుగా మా అమ్మానాన్నలు, తాతముత్తాతలు తెలుగులోనే చదివి, తెలుగు భాషకు సేవలు చేసి అలసిపోయారు. ఇప్పుడు కొంతకాలం మేము ఇంగ్లీషులో చదువుకుంటాము. మీ పెత్తందార్లంతా ఇంతకాలం ఇంగ్లీషు చదువులు చదివారు కదా! ఇప్పుడు పిల్లల్ని మనవల్నీ తెలుగు మీడియంలో చదివించండి. వారు తెలుగు భాషను రక్షిస్తారు. మేం ఇంగ్లీష్ చదువుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతామ'ని చెప్పండి. ఏమంటారో చూద్దాం.

రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యాన్నిస్తూ 'నాడు – నేడు' కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి మీకు తెలుసు. ఈ కార్యక్రమం ఫలితంగా శిథిలావస్థకు చేరిన సర్కారు బళ్లు మళ్లీ చిగురించాయి. ప్రైవేట్ స్కూళ్లను మించి సకల హంగులు సంతరించుకున్నాయి. మీకిస్తున్న బూట్లు, బ్యాగ్, బెల్ట్, యూనిఫామ్ అన్నీ బెస్ట్‌గా ఉండాలని స్వయంగా సీఎం హోదాలో ఉన్న మీ మేనమామ స్వయంగా సెలెక్ట్ చేసి పంపిస్తున్నారు. 'గోరుముద్ద' మెనూ కూడా ఆయనే తయారు చేశారు. కూలినాలి చేసుకునే పేద తల్లులు వారి బిడ్డల్ని స్కూళ్లకు పంపించేలా ప్రోత్సహించడం కోసం 'అమ్మ ఒడి' పేరుతో నగదు అందజేస్తున్న సంగతి కూడా మీకు తెలిసిందే. ఈ మొత్తం కార్యక్రమాల్లో భాగంగా మూడేళ్ల కిందనే ఒకటి నుంచి ఆరో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రారంభించారు. ఏటా ఒక్కో తరగతిని పెంచుకుంటూ వచ్చారు. ఇప్పుడు తొమ్మిదో తరగతి వరకు అంతా ఇంగ్లీష్ మీడియమే.

ఇంగ్లీష్ మీడియాన్ని ప్రారంభించిన ఆదిలోనే పెత్తందారీ ప్రతిఘటన మొదలైంది. తెలుగు భాషోద్యమం పేరుతో ఓ నకిలీ ఉద్యమాన్ని ప్రారంభించడానికి యెల్లో మీడియాతో కలిసి చంద్రబాబు ప్లాన్ చేశారు. కానీ, క్షేత్రస్థాయి నుంచి వ్యతిరేకత వస్తుందన్న సమాచారంతో కాస్త వెనక్కు తగ్గారు. కొద్దిరోజుల విరామం తర్వాత మళ్లీ చంద్రబాబు మొదలుపెట్టారు. ఈసారి ప్రత్యక్షంగా పేద తల్లితండ్రుల మెదళ్లలోకి దూరాలని ప్రయత్నించారు. శ్రీకాకుళం నుంచి రోడ్డు మార్గం ద్వారా వస్తున్న చంద్రబాబుకు విశాఖ సమీపంలో ఓ పదిమంది కూలీలు రోడ్డు పక్కన కనిపించారు. వెంటనే వాహనాన్ని ఆపేసి వాళ్ల మధ్యన కూర్చున్నారు. ఆ మాట ఈ మాట మాట్లాడిన తర్వాత ''ఆయనేదో (జగన్) ఇంగ్లీష్ మీడియం అంటున్నాడు. ఏమొస్తది ఇంగ్లీష్ మీడియంతో! కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోద్ది. మన పిల్లలు మొద్దబ్బాయిలుగా తయారవుతారు...'' అంటూ ఇంకేదో చెప్పబోయారు. అక్కడున్న జనమంతా అసహనంతో 'జై జగన్' అని నినాదాలు చేయడంతో చల్లగా జారుకున్నారు.



జనతంత్రం

వర్ధెల్లి మురళి

పెత్తందార్ల కూటమికి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకుడు. ఆయన సమన్వయంలోనే యెల్లో మీడియా పనిచేస్తున్నది. ఈ మీడియా సమూహంలో అతి ముఖ్యుడు రామోజీరావు. ఆయన చంద్రబాబుకు గురుపాదుల వంటివారు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెండు వేల ఎకరాల విశాల సామ్రాజ్యాన్ని అక్రమ పద్ధతుల్లో విస్తరించారు. ఈ విస్తరణలో భాగంగా ఆయన చట్టాలను కూడా యథేచ్ఛగా ఉల్లంఘించారు. ఆయనకు 'ఈనాడు' అనే పత్రిక, 'ఈటీవీ' పేరుతో చానళ్లున్నాయి. తాను తెలుగు కోసమే పుట్టినట్టు, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ కోసమే గాలి పీల్చుకుంటున్నట్టు ఆయన డప్పు వేయించుకుంటారు. ఆయన స్థాపించిన ఫిలిం సిటీ చేరువలో కొండల మీద రమాదేవి పబ్లిక్ స్కూల్ పేరుతో ఒక పాఠశాలను స్థాపించారు. అది మాత్రం పక్కా ఇంగ్లీష్ మీడియం, సెంట్రల్ సిలబస్.

తెలుగు మీడియం పాఠశాల పెడితే భారీగా ఫీజులు కట్టి ఎవరు చదువుకుంటారు? కనక తనకు కలెక్షన్ కోసం సంపన్నులు చదువుకునే ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉండాలి. పేద బిడ్డలు మాత్రం కనీస వసతులు లేని ప్రభుత్వ బడుల్లో తెలుగు మీడియం చదవాలి. ఇదీ వారి నీతిసారం. ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఈ గురుపాదులవారు రాజ గురువుగా చక్రం తిప్పిన రోజుల్లోనే ప్రభుత్వరంగంలోని విద్యా వ్యవస్థ శిథిలమైపోయి వీధికో ప్రైవేట్ స్కూల్, ఊరికో కార్పొరేట్ కాలేజీ బ్రాంచీలు విస్తరించాయి. చదువు అంగడి సరుకుగా రూపాంతరం చెందింది. పేదలు డ్రాపౌట్లుగా మిగిలిపోయారు. ఫలితంగా రెండు తరాల పేదలు నాణ్యమైన చదువుకు నోచుకోక జీవన ప్రమాణాలను కోల్పోవలసి వచ్చింది. ఈ మానవ కల్పిత మహా సంక్షోభం మీద పరిశోధన జరగవలసిన అవసరం ఉన్నది.

ఇంగ్లీష్ మీడియం విద్యకు వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడేందుకు చంద్రబాబు, ఆయన ముఠా వెనుకడుగు వేసినా పరోక్ష ప్రయత్నాలను మాత్రం ఆపలేదు. తెలుగు భాషా సంస్కృతుల ముసుగులో వివిధ వేదికల ద్వారా ఇంగ్లీష్ మీడియంపై విషం చల్లుతూనే వస్తున్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో పనిచేసిన పెద్దమనుషుల సేవలను కూడా ఇందుకోసం విరివిగా వినియోగించుకున్నారు. అయినా ఫలితం కలుగలేదు. ప్రజల సంపూర్ణ మద్దతుతో ఇంగ్లీషు మీడియంతో పాటు ఆనక విద్యాసంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన తర్వాత, ఐఎఫ్‌పీ స్క్రీన్లను అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఆ యా విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలు పెరిగినట్టుగా అసెస్‌మెంట్ పరీక్షల్లో ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ స్ఫూర్తితో దశలవారీగా ఐబీ సిలబస్‌ను కూడా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిశ్చయించింది.

ఇక లాభం లేదనుకున్న పెత్తందారీ ముఠా ఎన్నికలకు ఇంకో ఆరు నెలల సమయం ఉండగా ఆఖరు కృష్ణుడిని రంగంలోకి దించింది. పవన్ కల్యాణ్: ది లాస్ట్ కృష్ణా తన సహచరుడు నాదెండ్ల మనోహర్‌తో కలిసి శుక్రవారం నాడు ఇంగ్లీష్ మీడియంపై, విద్యాసంస్కరణలపై విరుచుకుపడ్డారు. తాము అధికారంలోకి రాగానే ఈ విద్యావిధానంపై కేసులు పెట్టి దీంతో సంబంధం ఉన్న వారందరినీ జైలుకు పంపుతారట! తమ పిల్లల్ని ఏ స్కూల్లో, ఏ మీడియంలో, ఏ సిలబస్‌తో చదివించారో కూడా పవన్, మనోహర్‌లు ఈ సమావేశంలో చెబితే బాగుండేది. కానీ చెప్పలేదు. పవన్ హెచ్‌ఎమ్‌వి రికార్డులాంటోడు. అందులో రికార్డయిందే చెప్పగలడు. కానీ, పేద విద్యార్థుల ప్రగతికి ఉద్దేశించిన ఇంగ్లీష్ మీడియంపై యుద్ధం ప్రకటించి తాను ఏ వర్గం తరఫున పనిచేస్తున్నాడో చాటి చెప్పుకున్నాడు. లంకలో పుట్టిన ప్రతివాడూ రాక్షసుడే అన్నట్టు ఇంగ్లీష్ మీడియాన్ని వ్యతిరేకించే ప్రతివాడూ పెత్తందార్ల తాబేదారే! నీవారెవరో పరవారెవరో గుర్తించడానికి ఇది మాత్రమే లిట్మస్ టెస్ట్ తల్లీ!

గురితప్పిన రాహుల్జీ బాణాలు



కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ మూడు రోజులపాటు ఉత్తర తెలంగాణలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సభలకు జనం బాగానే వచ్చారు. స్పందన కూడా బాగుందని కాంగ్రెస్ వర్గాలు సంబరపడ్డాయి. అంతా బాగానే ఉంది గానీ, ఒక ముఖ్యమైన లోపం మాత్రం కనబడింది. మత్స్య యంత్రాన్ని కొట్టడానికి ఒక నియమం ఉన్నది. ఆ యంత్రం పైన గిరగిరా తిరుగుతుంటే కింద నీటిలో దాని నీడను చూసి పైనున్న చేపను కొట్టాలి. రాహుల్ పద్ధతి ఇందుకు విరుద్ధంగా కనిపించింది. ఆయన పైనున్న చేప వంక చూస్తూ నీటిలోని దాని నీడపైకి బాణాన్ని ఎక్కుపెట్టారు. ఆ బాణాన్ని వదిలితే ఏమవుతుంది? నీళ్లు కదులుతాయి గనుక కాసేపు నీడ కనిపించదు. చేప మాత్రం నిక్షేపంగా తిరుగుతూనే ఉంటుంది.

రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారంటీల పేరుతో ఇచ్చిన హామీలను పరిశీలిస్తే అసలు ఇవ్వాల్సిన ముఖ్యమైన గ్యారంటీని విస్మరించినట్టు బోధపడుతుంది. అట్లాగే రాష్ట్ర ప్రభుత్వం పైనా, బీఆర్ఎస్ పైనా ఆయన చేస్తున్న విమర్శలు చూస్తుంటే ఆయన పొలిటికల్ నరేటివ్ లేదా రాజకీయ భాషణ అప్‌డేట్ అయినట్టు కనిపించడం లేదు. రాజకీయాల్లో గెలవాలంటే ఈ భాషణే ముఖ్యం. ఆ భాషణ కొత్త భావాలతో కూర్చి ఉండాలి. జనాన్ని ఉత్తేజపరిచేదిగా ఉండాలి. వారికి ఊరటనిచ్చేదిగా ఉండాలి.

ఈ మూడు రోజుల రాహుల్ ప్రసంగాల్లోని భాషణ కంటే, పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతల భాషణే మెరుగ్గా కనిపిస్తున్నది. వాళ్లలో రాజకీయ స్పష్టత ఉన్నది. వారి భాషణ కూడా అందుకు అనుగుణంగా ఉన్నది. ఆర్థికాభివృద్ధిలోనూ, సంక్షేమ రంగంలోనూ ఈ తొమ్మిదిన్నరేళ్ల పాలన ఒక విజయగాథగా గణాంకాల ఆధారంతో వారు చెప్పుకొస్తున్నారు. ఈ జైత్రయాత్రను కొనసాగిద్దామని సూటిగా సుత్తి లేకుండా, వారు సందేశాన్నివ్వగలిగారు. పరిపాలనా రథం జైత్రయాత్ర సాగించాలంటే రాజకీయ సుస్థిరత అత్యంత అవసరమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

కాంగ్రెస్ పార్టీకి మైనస్ మార్కులు పడేది ఇక్కడే. వారు చెబుతున్న ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి కూడా రాజకీయ సుస్థిరత అనే ప్రధానమైన గ్యారంటీ అత్యంత అవసరం. ఈ గ్యారంటీని ఇచ్చే స్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదని దాని ట్రాక్ రిపోర్టే కుండబద్దలు కొట్టి చెబుతున్నది. 2004 ఎన్నికల నాటికే రాష్ట్ర కాంగ్రెస్‌లో తిరుగులేని నేతగా ఎదిగిన వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మాత్రమే కాంగ్రెస్ రాజకీయ సుస్థిరతను సాధించగలిగింది. ఫలితంగానే అభివృద్ధి – సంక్షేమాల్లో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించి 2009 ఎన్నికల్లో కూడా గెలవగలిగింది. ఈ ఒక్క ఛాప్టర్‌ను మూసేస్తే కాంగ్రెస్ కథలో మిగిలిన భాగాలన్నీ కుమ్ములాటల కథలే!

కాంగ్రెస్ కీచులాటల ఫలితంగానే తెలుగుదేశం పార్టీ పుట్టుకొచ్చి అధికారం చేపట్టిన ఉదంతం తెలిసిన విషయమే. 1978–83 మధ్యకాలంలో నలుగురు ముఖ్యమంత్రులు మారడం, పాలన అటకెక్కడం మూలంగా జనం మార్పు కోరుకున్నారు. 1989లో మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే కథ పునరావృతమైంది. ముగ్గురు ముఖ్యమంత్రుల్ని మార్చాల్సి వచ్చింది. ఇలా మార్చకపోయినట్లయితే సైబర్ టవర్స్ (హైటెక్ సిటీ)కి శంకుస్థాపన చేసిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే దాన్ని పూర్తిచేసి ఉండేది. చంద్రబాబు డప్పు వాయించుకోవడానికి అవకాశమే ఉండేది కాదు.

2009 ఎన్నికల తర్వాత రెండోసారి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ దురదృష్టవశాత్తు నాలుగు నెలల్లోనే చనిపోయారు. కాంగ్రెస్ అసలు కథ మళ్లీ మొదలైంది. ఏడాదిపాటు సీనియర్ నేత రోశయ్యను ముఖ్యమంత్రిగా చేశారు. ఆ తర్వాత ఆయన్ను మార్చి కిరణ్‌కుమార్ రెడ్డిని తీసుకొచ్చారు. ఆ తర్వాత ఇంకో మార్పు జరగకపోవడానికి కారణం పార్టీలో వచ్చిన ఐక్యత కాదు. అప్పటికే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్ధృతం కావడం, రాష్ట్ర విభజన అనివార్యమని తేలడంతో ఆ పదవికి ఎవరూ పోటీపడలేదు.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో రెండుసార్లు ప్రధాన ప్రతిపక్ష హోదాను ప్రజలు కాంగ్రెస్‌కు కట్టబెట్టారు. ఆ బాధ్యత నిర్వహణలో కూడా ఆ పార్టీ ఘోరంగా విఫలమైంది. మొదటిసారి 21 మందిని గెలిపిస్తే చివరకు 10 మంది మిగిలారు. రెండోసారి 19 మందిని గెలిపిస్తే ఐదుగురు మిగిలారు. అధికారం అప్పజెప్పినప్పుడు కొట్లాడుకుని పరిపాలనను పడకేయించారు. ప్రతిపక్షంలో కూర్చోబెడితే సంత బేరాలకు లొంగిపోయారు. మరి ఏ ధైర్యంతో ఇప్పుడు ప్రజలు ఓటేయాలి?

రాజకీయ సుస్థిరతను అందిస్తామనే గ్యారంటీ కదా కాంగ్రెస్ పార్టీ నుంచి జనం ఆశించేది? ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలో కనీసం డజన్ మంది ముఖ్యమంత్రి పదవి ఆశావహులున్నారు. ఓ ఆరేడు మందయితే గట్టి పట్టుదలతో పోటీలో ఉన్నట్టు సమాచారం. ఇటువంటి పరిస్థితిలో రాజకీయ సుస్థిరతను ఎలా ఆశించాలి! తెలంగాణ రాష్ట్ర పురోగతికి రాజకీయ సుస్థిరత ప్రాణాధారం. హైదరాబాద్ నగరం రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్. గడిచిన పదేళ్లలోనే ఐదు లక్షలమందికి ఐటీ రంగంలో ఉద్యోగాలిచ్చిన నగరం. ఫార్మా తదితర రంగాల్లో ఇంకో ఆరేడు లక్షలమందికి కొత్తగా ఉపాధినిచ్చింది. రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివస్తున్న లక్షలాది మంది పేద కార్మికులకు కడుపు నింపుతున్న నగరం. రాజకీయ అస్థిర పరిస్థితులు ఏర్పడితే దాని ప్రభావం ఉపాధి రంగం మీద పడుతుంది.

రాజకీయ సుస్థిరత అనే గ్యారంటీ ఇవ్వలేని పార్టీ ఇచ్చే ఆరు గ్యారంటీలకైనా... పన్నెండు గ్యారంటీలకైనా విలువ లేదు. గురితప్పిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహంలో ఇది మొదటి భాగం. ఇక రెండో భాగం దాని రాజకీయ భాషణ. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నిత్యం చేస్తున్న విమర్శలనే ఈ మూడు రోజుల్లో రాహుల్ గాంధీ వల్లెవేశారు. 'కాళేశ్వరం'లో లక్ష కోట్ల అవినీతి జరిగింది. కుటుంబ పెత్తనం నడుస్తున్నది. 'ధరణి' పేరుతో వేలాది ఎకరాలు కబ్జా పెడుతున్నారు. 'దొరల తెలంగాణ'గా మార్చారు. సామాజిక న్యాయం కరువైంది. బీఆర్ఎస్ బీ–టీమ్‌గా బీజేపీ పనిచేస్తున్నది. వగైరా వగైరా. వీటిలో కొన్ని ఆరోపణలు 2018 ఎన్నికల్లోనే కాంగ్రెస్ కూటమి ప్రజల ముందుంచింది. అయినా ఆ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేయగలిగింది. ఇప్పుడు మరోసారి చైనా యుద్ధ కాలం నాటి త్రీ నాట్ త్రీ రైఫిళ్లను, డబ్బా ట్యాంకులను తీసుకొచ్చి కాల్పులు జరుపుతున్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆయన సామాజిక వర్గానికి చెందిన కొందరు యువతీ యువకులు ఐటీ కారిడార్‌లో ప్రదర్శన చేసినప్పుడు రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ ఉలికిపడింది ఇందుకే. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్ధృతంగా జరుగుతున్న రోజుల్లో కూడా ఉపాధి రంగాన్ని ఆందోళనలకు దూరంగా ఉంచారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలంటే ఇవ్వాల్సిన అసలైన గ్యారంటీ రాజకీయ సుస్థిరత. దాని ట్రాక్ రికార్డ్ దృష్ట్యా నామ్‌కే వాస్తే హామీ ఇస్తే జనం నమ్మరు. జనాన్ని నమ్మించడానికి ఏం చేయాలో ఆ పార్టీ నిర్ణయించుకోవాలి. అప్పుడు మాత్రమే ఆరు గ్యారంటీల గురించి జనం ఆలోచిస్తారు. ఈ ఆరు గ్యారంటీల్లో కొన్ని పాత పథకాలే. వేలంపాటలో పెంచినట్టు కేటాయింపులను కొంచెం పెంచి కొత్త పథకాలుగా స్టాంప్ వేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి 'విద్యావికాసం' అనే కొత్త పేరు పెట్టారు. గృహిణులకు 2,500 రూపాయల ఆర్థిక సాయానికి సంబంధించిన విధానాలను అధికారంలోకి వస్తే అప్పుడు తయారు చేస్తారట! కర్ణాటక నుంచి దిగుమతి చేసుకున్న ఈ పథకం అక్కడే ఇంకా బాలారిష్టాలను దాటలేదు.

రాజకీయ సుస్థిరత అనే గ్యారంటీ ఇవ్వలేని పార్టీ ఇచ్చే ఆరు గ్యారంటీలకైనా... పన్నెండు గ్యారంటీలకైనా విలువ లేదు. గురితప్పిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహంలో ఇది మొదటి భాగం. ఇక రెండో భాగం దాని రాజకీయ భాషణ. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నిత్యం చేస్తున్న విమర్శలనే ఈ మూడు రోజుల్లో రాహుల్ గాంధీ వల్లెవేశారు. 'కాళేశ్వరం'లో లక్ష కోట్ల అవినీతి జరిగింది. కుటుంబ పెత్తనం నడుస్తున్నది. 'ధరణి' పేరుతో వేలాది ఎకరాలు కబ్జా పెడుతున్నారు. 'దొరల తెలంగాణ'గా మార్చారు. సామాజిక న్యాయం కరువైంది. బీఆర్ఎస్ బీ–టీమ్‌గా బీజేపీ పనిచేస్తున్నది. వగైరా వగైరా. వీటిలో కొన్ని ఆరోపణలు 2018 ఎన్నికల్లోనే కాంగ్రెస్ కూటమి ప్రజల ముందుంచింది. అయినా ఆ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేయగలిగింది. ఇప్పుడు మరోసారి చైనా యుద్ధ కాలం నాటి త్రీ నాట్ త్రీ రైఫిళ్లను, డబ్బా ట్యాంకులను తీసుకొచ్చి కాల్పులు జరుపుతున్నారు.

ఈ ప్రచారంలో రాహుల్ గాంధీకి బాగా నచ్చిన మాట... దొరల తెలంగాణకూ, ప్రజల తెలంగాణకూ మధ్య పోరాటం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర్నుంచి రాహుల్ కాపీ కొట్టినట్టున్నారు. రాష్ట్రంలో పేదలకూ, పెత్తందార్లకూ మధ్యన యుద్ధం జరుగుతున్నదని జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే ప్రజలకు గుర్తు చేస్తున్నారు. అందుకు అక్కడ సహేతుకమైన కారణం ఉన్నది. ప్రాతిపదిక ఉన్నది. పేదల సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్ని అక్కడి పెత్తందారీ శక్తులు తెలుగుదేశం రాజకీయ కూటమి రూపంలో అడ్డుకుంటున్నారు. యెల్లో మీడియా రూపంలో అడ్డుకుంటున్నారు. రకరకాల వేదికల పేర్లతో అడ్డుకుంటున్నారు. కేవలం రాజకీయ విమర్శలతోనే ఆటంకాలు సృష్టించలేదు. కోర్టు మెట్లెక్కి మరీ అడ్డుకుంటున్నారు. పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందించినా, సర్కారు బళ్ల ప్రమాణాలను పెంచినా, ప్రజల ఇంటి ముంగిటకు పరిపాలనను చేర్చినా, ధర్మాసుపత్రుల నాణ్యతను పెంచినా, ఊరూరా 'రైతు భరోసా కేంద్రాల'ను తెరిచినా, 30 లక్షలమంది మహిళలకు ఇళ్లు కట్టించే కార్యక్రమం చేపట్టినా సహించలేకపోయారు. వీటన్నింటి మీద కేసులు వేశారు. ఈ నేపథ్యంలో జనాన్ని జాగృతం చేయడం కోసం జరుగుతున్న కుట్రలను విడమర్చి చెప్పడం కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఆ నినాదాన్ని అందుకున్నారు.

ఇక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో దొరలకు మేలు చేస్తున్నవేమిటి? పేద ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటాలేమిటి? ఆ పార్టీ దగ్గర ఉన్న పీడిత ప్రజల సాధికారతా కార్యక్రమం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్లో దొరలు మాత్రమే లబ్ధి పొంది అంగరంగ వైభవంగా పెళ్లిళ్లు చేసుకుంటున్నారా? పేద కుటుంబాలకు ఈ పథకం దక్కడం లేదా? పద్దెనిమిది వందలకు పైగా ఏర్పాటైన గురుకుల పాఠశాలలు – కళాశాలల్లో ఏడున్నర లక్షలమంది దొరల బిడ్డలే నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారా? ఇటువంటి గణాంకాలేవో ఉండాలి కదా విమర్శ చేయడానికి! అందుకు తగిన ప్రాతిపదికను చూపెట్టాలి గదా. అప్పుడే ఆ నినాదాన్ని జనం అందిపుచ్చుకుంటారు. అంతే తప్ప పదాలు బలంగా ఉన్నాయి, వాక్యం బరువుగా ఉందని ముచ్చటపడి ఔత్సాహిక కవిలా ఉత్సాహపడితే రాజకీయాల్లో అభాసుపాలవుతారు సుమా!

ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక భూస్వామ్య కులంలో పుట్టాడు కనుక ఆయనది దొరల పాలన అనడం ఆమోదయోగ్యం కాదు. నిజమే, ఉత్తర తెలంగాణలోని భూస్వామ్య కులం వారు ఎక్కువమంది బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. అట్లానే దక్షిణ తెలంగాణ భూస్వామ్య కుటుంబాల వారు ఎక్కువమంది కాంగ్రెస్‌లో ఉన్నారు. నాయకుల పుట్టుక కారణంగా వారు దొరల పక్షమా, పేదల పక్షమా అని నిర్ధారించగలమా? తెలుగునాట దొరతనానికి వ్యతిరేకంగా, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించినవారెవరు? పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, చండ్ర రాజేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చెన్నమనేని రాజేశ్వరరావు... వీరంతా భూస్వాముల బిడ్డలే కదా?

గత ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ పుంజుకున్న మాట వాస్తవం. ఇందుకు కర్ణాటక ఫలితాలు కొంత దోహదపడ్డాయి. వ్యూహాలు సవరించుకొని బీజేపీ బలం పుంజుకోకపోతే అది కాంగ్రెస్‌కు మరింత మేలు చేస్తుంది. కొన్ని సీట్లు పెరగొచ్చు. కానీ పరిణామాలు కొంత భిన్నంగా మారుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికలో బీసీలకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మరోపక్క బీజేపీ బీసీలకు పెద్దపీట వేస్తున్న సూచనలు కనబడుతున్నాయి. ఇప్పుడు కనిపించిన వాపును బలుపుగా భ్రమిస్తే కాంగ్రెస్‌కు మరోసారి భంగపాటు తప్పదు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ బలంగా పోటీలో నిలబడాలంటే రెండు షరతులు – 1. రాజకీయ సుస్థిరతను ఇవ్వగలమన్న భరోసాను కల్పించాలి. 2. కాలానుగుణమైన, తెలంగాణ అభివృద్ధికి ఆలంబన కాగల రాజకీయ ఎజెండాను జనం ముందుంచాలి. కర్ణాటక మేనిఫెస్టో తారక మంత్రం కాదు!

vardhelli1959@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: శు.అష్టమి సా.5.21 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: ఉత్తరాషాఢ సా.5.13 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.8.57 నుండి 10.28 వరకు, దుర్ముహూర్తం: సా.3.58 నుండి 4.44 వరకు, అమృతఘడియలు: ఉ.11.10 నుండి 12.41 వరకు, దుర్గాష్టమి; రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు, యమగండం: ప.12.00 నుంచి 1.30 వరకు, సూర్యోదయం: 5.58, సూర్యాస్తమయం: 5.33.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

సామాజిక సాధికార యాత్రపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్)/కడప కార్పొరేషన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాధికారంలో అధిక ప్రాధాన్యత ఇచ్చి.. సామాజిక న్యాయం చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుంటే.. టీడీపీ, ఎల్లో మీడియా విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు ఈనెల 26వ తేదీ నుంచి 'సామాజిక సాధికార బస్సు యాత్ర' చేపడుతున్నట్లు వివరించారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. శనివారం కడప, నంద్యాలలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సమావేశాల్లో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు హామీలిచ్చేసి ఆ తర్వాత వదిలేసే నాయకులకు భిన్నంగా.. సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పాలన అందిస్తున్నారని వివరించారు. అన్ని వర్గాల అభివృద్ధికి చేయూతనిస్తూ.. వారంతా తలెత్తుకొని జీవించేలా పాలన సాగిస్తున్నారని చెప్పారు. పేదలకు చేసిన మేలును గర్వంగా చెప్పుకునేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర చేపడుతున్నామని.. సమిష్టి కృషితో యాత్రను అన్ని నియోజకవర్గాల్లో జయప్రదం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రణాళికాబద్ధంగా బస్సు యాత్రను విజయవంతం చేద్దామన్నారు. నంద్యాల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, టీవై రామయ్య, డాక్టర్ సుధాకర్, తొగురు ఆర్థర్, హఫీజ్‌ఖాన్, పోచా బ్రహ్మానందరెడ్డి, పాపిరెడ్డి, కడప సమావేశంలో కె.సురేశ్‌బాబు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, పి. రవీంద్రనాథ్‌రెడ్డి, డా.సుధ, డా.సుధీర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, నవాజ్ బాషా, మేడా మల్లికార్జునరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, అఫ్జల్‌ఖాన్, పులి సునీల్, ఎస్‌ఏ కరీముల్లా, సుబ్బారెడ్డి, కె.అజయ్‌రెడ్డి, పోలా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కాళరాత్రి అలంకారంలో శ్రీశైల భ్రమరాంబ



శ్రీశైల మహాక్షేత్రంలో దసరా నవరాత్రుల్లో భాగంగా శనివారం శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారు కాళరాత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి వారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజవాహనంపై వైభవంగా గ్రామోత్సవం జరిపారు.

–శ్రీశైలం టెంపుల్

సూర్య,చంద్ర ప్రభలపై తేజోమయుడు



తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై మలయప్ప ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభపై చల్లని చంద్రకాంతుల్లో భక్తులను అనుగ్రహించారు. వాహనసేవల్లో భజన బృందాల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. కాగా, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీనివాసుడు స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించనున్నారు.

మహాలక్ష్మీదేవిగా రాజశ్యామల



విశాఖ శ్రీశారదా పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాజశ్యామల అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం పీఠంలో చేపట్టిన రాజశ్యామల యాగం కొనసాగుతోంది. –పెందుర్తి

శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ

సాక్షి ప్రతినిధి, విజయవాడ/వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. శనివారం దుర్గమ్మ లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆది దంపతుల నగరోత్సవం కనులపండువగా సాగింది. కాణిపాకం స్వయంభూ వరసిద్ధి వినాయక దేవస్థానం తరఫున అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహామండపంలో 175 మంది అర్చకులను సత్కరించారు.కాగా, కనకదుర్గమ్మ మూలా నక్షత్రం సందర్భంగా గురువారం అర్ధరాత్రి 1.30 గంటల నుంచి శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకూ ఏకధాటిగా 23 గంటల పాటు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు మూడున్నర లక్షలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా, దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం దుర్గమ్మ శ్రీదుర్గాదేవీగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.



దుర్గమ్మ సేవలో జస్టిస్ హరినాథ్



లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో కొలువుదీరిన కనక దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. జస్టిస్ హరినాథ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను ఆలయ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్ అందజేశారు.

దసరా పండుగకు ప్రత్యేక రైళ్లు

రద్దయిన రైళ్ల పునరుద్ధరణ



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దసరా సీజన్‌లో రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సత్రగచ్చి–బెంగళూరు (06286) రైలు ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు సత్రగచ్చిలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు బెంగళూరు చేరుతుంది. చెన్నై సెంట్రల్–భువనేశ్వర్ (06073) రైలు ఈ నెల 23, 30, నవంబర్ 6 తేదీల్లో రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (06074) ఈ నెల 24, 31, నవంబర్ 7 తేదీల్లో రాత్రి 9 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 3 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది.

చెన్నై సెంట్రల్–సత్రగచ్చి (06071) రైలు ఈ నెల 28, నవంబర్ 4 తేదీల్లో రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 3.45 గంటలకు సత్రగచ్చి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (06072) ఈ నెల 23, 30, నవంబర్ 6 తేదీల్లో ఉదయం 5 గంటలకు సత్రగచ్చిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. భువనేశ్వర్ న్యూ–బెంగళూరు (06288) రైలు ఈ నెల 22న ఉదయం 8.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

నాందేడ్–పానిపట్ (07635) రైలు ఈ నెల 26న ఉదయం 5.40 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 1.15 గంటలకు పానిపట్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07636) ఈ నెల 27న మధ్యాహ్నం 3.15 గంటలకు పానిపట్‌లో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 7.30 గంటలకు నాందేడ్ చేరుతుంది.

పునరుద్ధరించిన రైళ్లు ఇవే...

నిర్వహణ పనుల కారణంగా రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 23–26 వరకు విజయవాడ–గుంటూరు (07783), గుంటూరు–మాచర్ల (07779), మాచర్ల–నడికుడి (07580), నడికుడి–మాచర్ల (07579), మాచర్ల–గుంటూరు (07780), గుంటూరు–విజయవాడ(07788) రైళ్లను పునరుద్ధరించినట్లు చెప్పారు.

రాష్ట్రంలో దసరా అమ్మకాల జోష్

- రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ సందడి
- కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు
- బంగారం, వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు జోరుగా కొంటున్న ప్రజలు
- బైక్‌లు, కార్లకూ పెరిగిన గిరాకీ

సాక్షి, అమరావతి: దసరా పండుగ వచ్చేసింది. రాష్ట్రవ్యాప్తంగా శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. మరో ఇరవై రోజుల్లో దీపావళి పండుగ ఉంది. దీంతో రాష్ట్రమంతా పండగ వాతావరణం నెలకొంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో అన్ని రంగాలూ అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజల్లో కొనుగోలు శక్తి కూడా పెరిగింది. ప్రజలు జోరుగా పండగ షాపింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా వస్త్రాలు, బంగారం, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ దుకాణాలు, వాహనాల షోరూమ్‌లు కిటకిటలాడుతున్నాయి. పలు వ్యాపార సంస్థలు వివిధ రకాల ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నాయి. ప్రజల్లో కొనుగోళ్ల శక్తి పెరిగిందనడానికి ఈ అమ్మకాలే నిదర్శనమని వ్యాపారులు చెబుతున్నారు. దసరాకు తోడు పెళ్లిళ్ల సీజన్ జత కావడంతో ఊహించిన దానికంటే అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయని నెల్లూరుకు చెందిన రుక్మిణి సిల్క్స్ ప్రతినిధి మురళి 'సాక్షి'కి తెలిపారు.

'బంగారం'మైనా కొనాల్సిందే..

పండుగలకు తోడు పెళ్లిళ్లు కూడా ఉండటంతో బంగారం విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. పలు జ్యూవెలరీ సంస్థలు భారీ ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నాయి. సెప్టెంబర్ నెలలో బంగారం ధరలు తగ్గిపోవడంతో ప్రజలు పండుగ, పెళ్లిళ్ల కొనుగోళ్లు ముందుగానే చేసినట్లు బంగారం వ్యాపారులు చెబుతున్నారు. సెప్టెంబర్ నెలలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.60,000 నుంచి రూ.53,000కు పడిపోయిందని, అందువల్ల అప్పుడు ఎక్కువగా నగలు కొన్నారని బంగారం వ్యాపారి మోహన్ రెడ్డి తెలిపారు. మళ్లీ ధర పెరగడంతో అమ్మకాలు కొంత తగ్గాయి. ప్రపంచ పరిణామాల నేపథ్యంలో బంగారం ధరలు ఇప్పట్లో తగ్గవన్న సంకేతాలు వెలువడుతుండటంతో తిరిగి అమ్మకాలు పెరుగుతున్నాయని మోహన్ రెడ్డి చెప్పారు.

రిటైల్ సంస్థల భారీ ఆఫర్లు

రిటైల్ సంస్థలు వినియోగదారులను ఆకర్షించడానికి పలు ఆఫర్లను ప్రకటించడమే కాకుండా భారీగా ప్రచారం చేపట్టాయి. గతేడాదికంటే ఈ ఏడాది అమ్మకాలు బాగున్నాయని ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు వంటి వస్తువులకు భారీగా డిమాండ్ ఉందని సోనోవిజన్ ప్రతినిధి తెలిపారు. సాధారణంగా ఈ సమయంలో ఏసీల అమ్మకాలు తక్కువగా ఉంటాయని, కానీ ఈ ఏడాది మారిన వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో వీటికి డిమాండ్ ఉందని తెలిపారు. ఇదే సమయంలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ రిటైల్ సంస్థలు కూడా భారీ ఆఫర్లు ప్రకటించడంతో ఆన్‌లైన్ అమ్మకాలు కూడా జోరుమీద కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే విధంగా తీసుకుంటున్న చర్యలకు తోడు ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా పలు పథకాలను ప్రవేశపెట్టడంతో అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయని, దీనికి రాష్ట్ర జీఎస్టీలో నమోదవుతున్న రెండంకెల వృద్ధి రేటే నిదర్శనమని రాష్ట్ర పన్నుల ప్రధాన అధికారి గిరిజా శంకర్ చెప్పారు.

దూసుకుపోతున్న ఆటోమొబైల్ మార్కెట్

దసరా–దీపావళి పండుగల సీజన్‌లో ఆటోమొబైల్ మార్కెట్ దూసుకుపోతోందని డీలర్లు చెబుతున్నారు. గతేడాది దసరా–దీపావళి సీజన్‌లో 73,240 ద్విచక్ర, 7,772 కార్ల అమ్మకాలు జరిగాయని, ప్రస్తుత మార్కెట్ ట్రెండ్ చూస్తుంటే ఈ సీజన్‌లో అమ్మకాలు భారీగా జరిగే అవకాశాలున్నాయని విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 33,094 బైక్‌లు, 4,212 కార్ల అమ్మకాలు జరిగాయని చెప్పారు. ఈ రెండు పండుగల సమయంలో బైక్‌ల అమ్మకాలు లక్షకు పైగా పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. కోవిడ్ తర్వాత దెబ్బతిన్న మార్కెట్ ఇప్పుడిప్పుడే పుంజుకుంటోందంటున్నారు.

పదోన్నతుల పరంపర

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కొనసాగుతున్న పదోన్నతులు



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పదోన్నతుల పరంపర కొనసాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఆయా శాఖల్లో ఖాళీలు ఏర్పడిన వెంటనే సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే ఉద్యానవన అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించగా... తాజాగా వెటర్నరీ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న 35 మంది గ్రామ పశుసంవర్ధక అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించారు. వారిని అదే జిల్లా పరిధిలోని వివిధ పశువైద్యశాలల్లో ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల్లో నియమిస్తూ ఈ నెల 19వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా ఏడీహెచ్‌వో ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వం నిర్దేశించిన మేరకు..

గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ శాఖల ఆధ్వర్యాన 19 కేటగిరీల ఉద్యోగులు పని చేస్తున్నారు. వారిలో 17 కేటగిరీల ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ 17 కేటగిరీలకు సంబంధించిన శాఖల్లో ఖాళీలు ఏర్పడిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు పశు వైద్యశాలల్లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ అయితే వాటిలో 40శాతం పోస్టులను గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే పశుసంవర్ధక అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి నియమించాలని స్పష్టంగా పేర్కొంది. దాని ప్రకారమే ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 35 మందికి ప్రమోషన్లు కల్పించి పోస్టింగ్‌లు ఇచ్చారు. మరోవైపు సచివాలయాల్లో పనిచేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లకు కూడా పదోన్నతులకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

అపోహలు.. అభూత కల్పనల నుంచి పదోన్నతుల వరకు..

గతంలో చాలామంది ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇస్తామని చెప్పడం... ఎన్నికల ముందు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం... ఆ తర్వాత పట్టించుకోకపోవడం.. కోర్టు కేసులు, ఇతర సమస్యలతో నియామక ప్రక్రియ సంవత్సరాల తరబడి సాగిన చరిత్ర నాలుగేళ్ల క్రితం వరకు ఉంది. కానీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రంలో కొత్తగా గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి ఏకంగా 1.34లక్షల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే ఆ ఉద్యోగాలను భర్తీ చేసి లక్ష మందికి పైగా నిరుద్యోగులకు ఒకేసారి ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. అయితే, ఈ ప్రక్రియ ప్రారంభించినప్పుడు ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశాయి. ఇవి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కావని, ప్రభుత్వం మారితే ఆ ఉద్యోగాలు ఉంటాయో... ఊడుతాయో.. అని భయపెట్టాయి. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రభుత్వం మాత్రం చిత్తశుద్ధితో సచివాలయ ఉద్యోగులకు మేలు చేస్తోంది. ప్రొబేషన్ ఖరారు చేసి అందరి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పే స్కేలుతో కూడిన వేతనాలు అందిస్తోంది. తాజాగా సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ఆయా శాఖల్లో పోస్టింగ్‌లు కూడా ఇస్తోంది. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.

'మణప్పురం' సొత్తు రికవరీలో పోలీసులు

కంకిపాడు(పెనమలూరు): మణప్పురం సంస్థలో చోరీకి గురైన సొత్తు రికవరీలో పోలీసులు నిమగ్నమయ్యారు. నిందితుల నుంచి సమాచారాన్ని సేకరించి సొత్తును స్వాధీనం చేసుకునే పనిలో పడ్డారు. దీంతో ఈ కేసులో విచారణ మరింత వేగం పుంజుకుంది. కృష్ణా జిల్లా, కంకిపాడు కేంద్రంగా నడుస్తున్న మణప్పురం ఫైనాన్స్ సంస్థలో 10.660 కిలోల బంగారు ఆభరణాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. చోరీకి పాల్పడ్డ ప్రధాన నిందితురాలు, బ్రాంచ్ హెడ్ రెడ్డి వెంకట పావనిని పోలీసులు షిర్డీలో అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం జిల్లాకు తరలించారు. ఈచోరీలో పావనికి సహకరించిన కృత్తివెన్నుకు చెందిన దుర్గాప్రసాద్‌ను పోలీసులు తొలుత అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీ చేసిన కొన్ని బంగారు ఆభరణాలను కృత్తివెన్ను సమీపంలోని భూమిలో పాతిపెట్టగా, పోలీసుల విచారణలో దుర్గాప్రసాద్ ఆ విషయాన్ని ఒప్పుకోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ప్రధాన నిందితురాలైన రెడ్డి వెంకట పావనిని పోలీసులు విచారించగా, పలు దఫాలుగా బంగారు ఆభరణాలను తీసుకొచ్చి వివిధ ప్రాంతాల్లో తనఖా పెట్టి డబ్బు తీసుకున్నట్లు ఒప్పుకున్నదని సమాచారం. దీంతో తనఖా పెట్టిన బంగారు ఆభరణాలను రికవరీ చేసే పనిలో పోలీసులు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. చోరీ అయిన సొత్తును పూర్తి స్థాయిలో రికవరీ చేసి ఖాతాదారులు నష్టపోకుండా ఉండేలా విచారణ వేగవంతం చేశారు.

ఎస్సీలకు సాయంలో రాష్ట్రం మేటి

ఎస్సీ ఉప ప్రణాళిక అమల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ

- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక

సాక్షి, అమరావతి: మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి అయితే అట్టడుగు వర్గాలకు ఎంత మేలు జరుగుతుందో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన నిరూపిస్తోంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల ఉన్నతికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. ఈ వర్గాల సాధికారతకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక అమలు, దాని ద్వారా ఎస్సీ కుటుంబాలకు సహాయం అందించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి మూడు నెలల్లోనే మరే రాష్ట్రం అమలు చేయని విధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ ఉప ప్రణాళికను అమలు చేసిందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎస్సీ ఉప ప్రణాళిక అమలుతో పాటు ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరు, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో, పట్టణ గృహ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా మంచి పనితీరు కనపరిచిందని ఆ శాఖ విడుదల చేసిన నివేదికలో ప్రశంసించింది. 2023–24 తొలి త్రైమాసికం (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) వివిధ రాష్ట్రాల పథకాల లక్ష్యాలు, అమలు తీరును నివేదిక వివరించింది. లక్ష్యాల్లో 90 శాతంపైగా అమలు చేసిన రాష్ట్రాలు చాలా మంచి పనితీరు కనబరిచినట్లు, 80 నుంచి 90 శాతం అమలు చేసిన రాష్ట్రాలు మంచి పనితీరు కనపరిచినట్లు, 80 శాతం లోపు అమలు చేసిన రాష్ట్రాల పనితీరు బాగోలేదని నివేదిక వర్గీకరించింది.

ఈ ఏడాది తొలి త్రైమాసికంలో ఏపీతో సహా 16 రాష్ట్రాల్లో ఎస్సీ ఉప ప్రణాళిక కింద 14,54,481 ఎస్సీ కుటుంబాలకు సహాయం అందగా, వీటిలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 14,43,619 కుటుంబాలకు సహాయం అందినట్లు నివేదిక స్పష్టం చేసింది. మిగతా ఏ రాష్ట్రంలోనూ కనీసం 10 వేల మందికి కూడా ఎస్సీ కుటుంబాలకు సాయం అందించలేదని ఆ నివేదికను పరిశీలిస్తే అర్థమవుతుంది. దేశంలోని రాష్ట్రాలన్నీ కలిపి 14,39,152 మంది ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందించగా అందులో సగం విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నారు. తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 7,15,872 మంది ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల ద్వారా సాయం అందించినట్లు నివేదిక వెల్లడించింది.

గృహ నిర్మాణంలో, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలోనూ ప్రథమ స్థానం

పేదల గృహాల నిర్మాణంలో, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలోనూ రాష్ట్రమే ముందుందని ఆ నివేదిక పేర్కొంది. ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ కింద పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో దేశవ్యాప్తంగా మొత్తం 1.01 లక్షల గృహాల నిర్మాణం జరగ్గా, వాటిలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 66,206 గృహాల నిర్మాణం చేసి రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో లక్ష్యానికి మించి రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు చెప్పింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 24,852 విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నది లక్ష్యం. తొలి త్రైమాసికంలో 6,213 కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా, 19,085 కనెక్షన్లు ఇచ్చినట్లు నివేదిక వెల్లడించింది. అంటే లక్ష్యానికి మించి 307 శాతం అధికంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు వివరించింది. అలాగే రాష్ట్రంలో ఐసీడీఎస్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు నూటికి నూరు శాతం పూర్తి స్థాయిలో పనిచేస్తున్నట్లు నివేదిక ప్రశంసించింది.

తొలి త్రైమాసికంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు పొందిన ఎస్సీ విద్యార్థులు

రాష్ట్రం	సాయం పొందిన ఎస్సీ విద్యార్థుల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	7,15,872
తమిళనాడు	1,58,403
మధ్యప్రదేశ్	1,08,120
కర్ణాటక	85,093
రాజస్థాన్	64,631
కేరళ	61,630
పశ్చిమ బెంగాల్	58,014
గుజరాత్	51,817

ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా వివిధ రాష్ట్రాల్లో సాయం పొందిన ఎస్సీ కుటుంబాలు

రాష్ట్రం	సాయం పొందిన ఎస్సీ కుటుంబాల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	14,43,619
తమిళనాడు	6,058
బిహార్	1,925
హరియాణ	1,362
ఛత్తీస్‌గఢ్	974

దక్షిణాది రాష్ట్రాల్లో నీటికి కటకట

- జలాశయాల్లో 48 శాతమే నీటి నిల్వలు
- గతేడాది ఇదే సమయానికి 92 శాతం నీటి నిల్వ
- తెలుగు రాష్ట్రాల్లోని జలాశయాల్లో కేవలం 25 శాతమే నీటి నిల్వ
- కేంద్ర జలసంఘం నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: దక్షిణాది రాష్ట్రాల్లో సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) వెల్లడించింది. నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల కృష్ణా, కావేరి, పెన్నా పరీవాహక ప్రాంతాల్లో సరైన వర్షాలు కురవకపోవడం వల్ల జలాశయాల్లోకి నీటి నిల్వలు చేరలేదని పేర్కొంది. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లోని జలాశయాల పూర్తి నిల్వ సామర్థ్యం 53.334 బీసీఎం (బిలియన్ క్యూబిక్ మీటర్లు) కాగా.. 25.361 బీసీఎం (48 శాతం) నిల్వలే ఉన్నాయని తెలిపింది. గతేడాది ఇదే రోజు నాటికి ఈ జలాశయాల్లో 92 శాతం నీరు నిల్వ ఉండేదని.. గత పదేళ్లలో సగటున ఆ ప్రాజెక్టుల్లో 74 శాతం నిల్వ ఉండేవని వెల్లడించింది. గత పదేళ్లలో ఈ ఏడాదే జలాశయాల్లో కనిష్ఠ స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయని పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో జలాశయాల పూర్తి నిల్వ సామర్థ్యం 11.121 బీసీఎంలు కాగా.. ప్రస్తుతం కేవలం 2.815 బీసీఎంలు (25 శాతం) మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి ఆ ప్రాజెక్టుల్లో 98 శాతం నీరు నిల్వ ఉండేదని.. గత పదేళ్లలో ఇదే రోజు నాటికి సగటున 76 శాతం నీరు నిల్వ ఉండేదని సీడబ్ల్యూసీ వెల్లడించింది. నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో సాగునీటికి దక్షిణాదిలో ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా, పెన్నా బేసిన్‌లో తీవ్ర ఇబ్బందులు ఉంటాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా 150 భారీ ప్రాజెక్టుల్లోకి వచ్చే వరద ప్రవాహం, నీటి నిల్వలను సీడబ్ల్యూసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటుంది. ఆ 150 ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై శుక్రవారం సీడబ్ల్యూసీ కేంద్రానికి నివేదిక ఇచ్చింది.

నివేదికలోని ప్రధానాంశాలివీ

సీడబ్ల్యూసీ పర్యవేక్షించే 150 జలాశయాల్లో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 257.812 బీసీఎంలు. ఆ ప్రాజెక్టుల లైవ్ స్టోరేజ్ కెపాసిటీ 178.784 బీసీఎంలు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టుల్లో 129.636 బీసీఎంలు(73 శాతం) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ఆ ప్రాజెక్టుల్లో 140.280 బీసీఎంలు (81 శాతం) నీరు నిల్వ ఉండేది. గత పదేళ్లలో ఇదే సమయానికి సగటున 160.40 బీసీఎంలు (92 శాతం) నీరు నిల్వ ఉండేది. దేశవ్యాప్తంగా చూసినా గత పదేళ్ల కంటే ఈ ఏడాది జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నట్టు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాలతో పోల్చితే మిగతా ప్రాంతాల్లో ప్రస్తుతం నీటి లభ్యత మెరుగ్గానే ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లోని జలాశయాల్లో 89 శాతం, తూర్పు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల్లో 77 శాతం, పశ్చిమ రాష్ట్రాల్లోని జలాశయాల్లో 88 శాతం, మధ్య భారత రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల్లో 83 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయి.

హతవిధీ'.. ఆనందాన్ని చిదిమేసింది

- పుట్టిన బిడ్డను చూడకుండానే తిరిగిరాని లోకాలకు చేరిన తండ్రి
- ఆస్పత్రి ఖర్చుల కోసం డబ్బు తీసుకెళ్తుండగా ప్రమాదం
- భార్య ప్రసవించిన ఆస్పత్రిలోనే చేర్చగా దుర్మరణం



ఆనంద్ (ఫైల్)

కారంపూడి: ప్రసవ వేదన పడుతున్న భార్యను ఆస్పత్రిలో చేర్చి.. ఆస్పత్రి ఖర్చులకోసం డబ్బు తీసుకుని బైక్‌పై వెళ్తున్న భర్త ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. భార్యను తరలించిన అంబులెన్స్‌లోనే అతడిని కూడా అదే ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రాణాలు విడిచాడు. అప్పటికే భార్య ప్రసవించగా.. పుట్టిన పాపను కూడా చూసుకోకుండా ఆ తండ్రి కన్ను మూయడంతో అక్కడి వారి హృదయాలు బరువెక్కాయి. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా కారంపూడి ఇందిరా నగర్ కాలనీ గనిగుంతలుకు చెందిన బత్తిన ఆనంద్ (33) భార్య రామాంజనికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో శుక్రవారం 108లో గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెకు రక్తం తక్కువగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె వెంట వాళ్ల అమ్మ, చిన్నమ్మ, ఆశా వర్కర్ ఏసమ్మ వెళ్లారు. భర్తను కూడా అంబులెన్స్ ఎక్కమంటే ఆస్పత్రి ఖర్చులకు డబ్బు తీసుకు వస్తానని ఆగిపోయాడు. శనివారం వేకువజామున డబ్బు తీసుకుని బైక్‌పై నర్సరావుపేట బయలుదేరాడు. మార్గమధ్యంలో జూలకల్లు అడ్డరోడ్డు వద్ద రోడ్డు పక్కన కంకర చిప్స్ ఉండటంతో బైక్ అదుపు తప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయం కాగా.. కొంతసేపటి వరకు ఎవరూ చూడకపోవడంతో చాలా రక్తం పోయింది. ఆ తరువాత ఓ వ్యక్తి గమనించి 108కు ఫోన్ చేయడంతో భార్యను ఆస్పత్రి తీసుకెళ్లిన అంబులెన్సే వచ్చి అతన్ని కూడా నర్సరావుపేటలో భార్య ఉన్న ఆస్పత్రికే తీసుకెళ్లింది. అప్పటికే రక్తం ఎక్కువగా పోవడంతో ఆస్పత్రికి వెళ్లిన కొద్దిసేపటికే ఆనంద్ మృతి చెందాడు. అదే ఆస్పత్రిలో ఉన్న భార్యకు సకాలంలో సరైన వైద్యం అందడంతో ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డను కూడా చూసుకునే భాగ్యానికి నోచుకోని ఆనంద్ మృతి ఘటన బంధుమిత్రులను కలచి వేస్తోంది. ఇదిలా ఉంటే రామాంజనికి ఇది నాలుగో కాన్పు. ఇంతకుముందు ఇద్దరు అమ్మాయిలు.. ఒక అబ్బాయి ఉన్నారు.

క్లుప్తంగా...

హెచ్-1బీ ప్రోగ్రాంలో మార్పులు

బైడెన్ సర్కారు ప్రతిపాదనలు

వాషింగ్టన్: ఐటీ తదితర కీలక రంగాలకు చెందిన విదేశీ వృత్తి నిపుణులకు అమెరికాలో పని చేసెందుకు వీలు కల్పించే కీలకమైన హెచ్-1బీ వీసా ప్రోగ్రాంలో మార్పుచేర్పులను బైడెన్ సర్కారు ప్రతిపాదించింది. అర్హత ప్రమాణాలు తదితరాలను మరింత క్రమబద్ధం చేయడం, తద్వారా వీసా ప్రక్రియ సామర్థ్యాన్ని పెంచడం , ఎఫ్-1 స్టూడెంట్లకు, పారిశ్రామికవేత్తలకు, నాన్ ఇమ్మిగ్రెంట్ వర్కర్లకు మెరుగైన పరిస్థితులు కల్పించేందుకు ఈ మార్పులు దోహద పడతాయని చెబుతోంది. సదరు నిబంధనలను సోమవారం విడుదల చేయనున్నారు...

- ప్రస్తుత ప్రక్రియలో ఒక దరఖాస్తుదారు తరఫున ఎన్ని ఎక్కువ రిజిస్ట్రేషన్లు నమోదయితే లాటరీలో ఎంపికయ్యే అవకాశాలు అంత పెరుగుతాయి.
- ప్రతిపాదిత విధానంలో ఒకరి తరఫున ఎన్ని రిజిస్ట్రేషన్లు నమోదైనా ఎంపిక ప్రక్రియలో ఒక ఎంట్రీగానే పరిగణిస్తారు.
- తద్వారా కొందరికే ఎక్కువ అడ్వాంటేజీకి బదులు అర్హులందరికీ సమానావకాశం దక్కుతుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ పేర్కొంది.
- ఈ ప్రతిపాదనలపై అందరూ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు వెల్లడించవచ్చని డీహెచ్ఎస్ పేర్కొంది.
- అమెరికా ఏటా విడుదల చేసే 60 వేల హెచ్-1బీ వీసా కోటాలో మార్పుండదు.

దౌత్యాధికారుల తగ్గింపు వ్యవహారం.. కెనడాకు అమెరికా, యూకేల మద్దతు

లండన్/వాషింగ్టన్: కెనడాకు చెందిన 41 మంది దౌత్యాధికారుల హోదాను రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంతో తాము విభేదిస్తున్నట్లు అమెరికా, యూకేలు ప్రకటించాయి. సిక్కు వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య అనంతరం రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని భారత్ తీసుకున్నట్లు భావిస్తున్నామని తెలిపాయి. వియన్నా ఒప్పంద సూత్రాలకు భారత్ ప్రభుత్వ నిర్ణయం వ్యతిరేకమని యూకే పేర్కొనగా, విభేదాల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో దౌత్యాధికారుల అవసరం ఉంటుందని అమెరికా విదేశాంగ శాఖ నొక్కి చెప్పింది. 'దౌత్య సంబంధాలపై 1961 వియన్నా ఒప్పందం ప్రకారం అన్ని దేశాలు తమ బాధ్యతలను గుర్తిస్తాయని మేం ఆశిస్తున్నాం. దౌత్యవేత్తల భద్రత కోసం కల్పించాల్సిన అధికారాలు, ఇతర హక్కులను ఏకపక్షంగా తొలగించడం వియన్నా సూత్రాల విరుద్ధం. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై స్వతంత్ర దర్యాప్తులో కెనడాతో పాలుపంచుకోవాలని భారత్‌ను కోరుతూనే ఉన్నాం'అని యూకే విదేశాంగశాఖ పేర్కొంది.'భారత్‌లో దౌత్యాధికారులను గణనీయంగా తగ్గించాలని భారత ప్రభుత్వం డిమాండ్ చేయడం, కెనడా తన దౌత్యవేత్తలను వెనక్కి తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. విభేదాలను పరిష్కరించడానికి క్షేత్ర స్థాయిలో దౌత్యవేత్తలు అవసరం. దౌత్యాధికారులను తగ్గించాలంటూ కెనడాపై ఒత్తిడి తేవద్దని, నిజ్జర్ హత్యపై కెనడా ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తులో సహకరించాలని భారత ప్రభుత్వాన్ని కోరాం'అని అమెరికా విదేశాంగ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తెలిపారు.

ఆరు నెలల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దీపావళి తర్వాత 2.7 లక్షల పంచాయతీల్లో మెగా డ్రైవ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ పూర్తి స్థాయిలో వేగంగా అందించేందుకు ప్రధాని మోదీ ఆరు నెలలు గడువు విధించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో మెగా డ్రైవ్ చేపట్టనుంది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా రూపకల్పన చేసిన 'రథా'ల్లో దేశంలోని మొత్తం 2.7 లక్షల పంచాయతీల్లోని అర్హులైన లబ్ధిదారులను కలుసుకుని, వారి పేర్లను నమోదు చేయనుంది. ఈ బృహత్తర కార్యక్రమం వచ్చే నెలలో దీపావళి తర్వాత ప్రారంభమై కొన్ని వారాలపాటు కొనసాగుతుందని శనివారం అధికారవర్గాలు తెలిపాయి.

గాంధీ శాంతి పురస్కార గ్రహీత ఎంపిక కమిటీ

సభ్యుడిగా వెంకయ్య

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక గాంధీ శాంతి పురస్కార గ్రహీత ఎంపిక కమిటీ సభ్యుడిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకం పట్ల ప్రధాని మోదీకి వెంకయ్య కృతజ్ఞతలు తెలిపారు. 1995లో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ సభాపతి, లోక్‌సభలో విపక్షనేత, ఇద్దరు ప్రముఖ వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. అహింసాయుత పద్ధతుల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తన తీసుకురావడంలో కీలక పాత్ర పోషించే వ్యక్తులు, సంస్థలకు ఏటా గాంధీ శాంతి పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. గ్రహీతలకు రూ. కోటి నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు.

పాకిస్తాన్‌కు షరీఫ్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్ అధినేత, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ (73) నాలుగేళ్ల స్వీయ ప్రవాసం అనంతరం స్వదేశానికి తిరిగొచ్చారు. జనవరిలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శనివారం ప్రత్యేక విమానంలో ఇంగ్లండ్ నుంచి బయల్దేరి ఇస్లామాబాద్ చేరుకున్నారు. కోర్టుకు సమర్పించాల్సిన బెయిల్ పత్రాలపై సంతకం తదితరాల అనంతరం అదే విమానంలో లాహోర్ వెళ్లి భారీ ర్యాలీలో పాల్గొన్నారు. తన తల్లి, భార్య రాజకీయాలకు బలయ్యారని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. వారి చివరిచూపుకూ నోచుకోలేదంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

'గగన' విజయం

- మానవ సహిత ప్రయోగాలకు ఈ ప్రయోగం తొలి మెట్టు
- కొంత మేర ఇబ్బందులు పడినా ప్రయోగాన్ని సక్సెస్ చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు
- అభినందించిన ప్రధాని మోదీ



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): మానవసహిత అంతరిక్ష ప్రయోగాల దిశగా అడుగులు వేస్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆ ప్రయత్నంలో తొలి విజయం సాధించింది. విజయసోపానాల్లో తొలిమెట్టుగా భావిస్తున్న గగన్‌యాన్ ప్రాజెక్టు సన్నాహకాల్లో భాగంగా ఇస్రో చేపట్టిన మానవరహిత క్రూ ఎస్కేప్ సిస్టమ్(సీఈఎస్) పరీక్ష విజయవంతమైంది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక ఇందుకు వేదికై ంది. ప్రయోగ వేదిక నుంచి శనివారం ఉదయం 10 గంటలకు గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ (టీవీ-డీ1) వాహకనౌకను విజయవంతంగా పరీక్షించారు. దాదాపు 16.9 కి.మీ.ల ఎత్తులో అందులోంచి క్రూ ఎస్కేప్ మాడ్యూల్, ఎస్కేప్ మాడ్యూల్‌లు విడిపోయి వేర్వేరు పథాల్లో ప్రయాణించి బంగాళాఖాతంలో సురక్షితంగా పడ్డాయి. క్రూ ఎస్కేప్ మాడ్యూల్‌ను డ్రోగ్ పారాచూట్‌లు సురక్షితంగా సముద్రజలాలపై ల్యాండ్ అయ్యేలా చేశాయి. మానవసహిత ప్రయోగాలు చేపట్టినపుడు అందులోని వ్యోమగాములను క్రూ మాడ్యూల్ ఎలా సురక్షితంగా బయటపడేయగలదన్న అంశాన్ని పరీక్షించేందుకే ఈ ఎస్కేప్ మాడ్యూల్ పరీక్ష చేశారు.

17 కిలోమీటర్ల ఎత్తుకెళ్లి తిరిగి సముద్రంలోకి ..

టెస్టు వెహికల్ (టీవీ-డీ1) ప్రయోగాన్ని 10.10 నిమిషాల వ్యవధిలో పూర్తి చేశారు. ఇందులో భాగంగా సింగిల్ స్టేజీ ద్రవ ఇంధర రాకెట్(టీవీ-డీ1)పై క్రూ ఎస్కేప్ మాడ్యూల్, ఎస్కేప్ మాడ్యూల్‌లను అమర్చారు. రాకెట్‌ను ప్రయోగించాక అత్యవసర స్థితి(అబార్ట్)ను సిములేట్ చేశారు. దీంతో రాకెట్ 11.7 కిలోమీటర్ల దూరం ప్రయాణించాక క్రూ ఎస్కేప్ మాడ్యూల్, ఎస్కేప్ మాడ్యూల్‌లు వేరువడటం ప్రారంభమైంది. రాకెట్ 16.6 కిలోమీటర్ల ఎత్తులోకి చేరుకున్నాక క్రూ ఎస్కేప్ మాడ్యూల్, ఎస్కేప్ మాడ్యూల్‌లు రాకెట్ నుంచి విడివడి వేర్వేరు మార్గాల్లో ప్రయాణిస్తూ బంగాళాఖాతంలో పడ్డాయి. అయితే క్రూ ఎస్కేప్ మాడ్యూల్‌ను సేకరించే ఉద్దేశంతో అది సురక్షితంగా సముద్రంలో పడేలా తొలుత రెండు డ్రోగ్ పారాచూట్లు విచ్చుకుని నెమ్మదిగా కిందకు దిగేందుకు సాయపడ్డాయి. తర్వాత మరో పెద్ద పారాచూట్ విచ్చుకుని ల్యాండింగ్‌ను దిగ్విజయం చేసింది. సమీప సముద్ర జలాల్లో ప్రత్యేక లాంచీలో వేచి ఉన్న కోస్టల్ నేవీ బలగాలు ఆ మాడ్యూల్‌ను సురక్షితంగా శ్రీహరికోటకు చేర్చారు. అయితే మానవ సహిత గగన్‌యాన్ ప్రయోగాలు భవిష్యత్తులో చేయడానికి ఇలాంటి ప్రయోగాలు మరో మూడు చేయాలని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. నాలుగోసారి క్రూ మాడ్యూల్‌లో వ్యోమగాములను పోలిన బొమ్మలను అమర్చి క్రూ ఎస్కేప్ మాడ్యూల్‌ను పరీక్షిస్తారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత 2024 చివర్లో లేదా 2025 ప్రథమార్ధంలో మానవ సహిత ప్రయోగాలు చేయనున్నారు. గగన్‌యాన్ టీవీ-డీ1 ప్రయోగం విజయవంతం కావడంపై ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మిషన్ డైరెక్టర్ శివకుమార్, డైరెక్టర్ సునీల్, వీఎస్ఎస్‌సి డైరెక్టర్ ఉన్ని కృష్ణన్‌నాయక్, డైరెక్టర్ నారాయణ పాల్గొన్నారు.

గగన్‌యాన్ సాకారం దిశగా మరింత చేరువకు: ప్రధాని మోదీ

'టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్ (టీవీ-డీ1)' పరీక్షను ఇస్రో విజయవంతంగా నిర్వహించడంతో ప్రధాని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. ' ప్రతిష్టాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టు సాకారం దిశగా ఈ ప్రయోగం మనల్ని మరింత చేరువ చేసింది. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు' అంటూ వారిని అభినందిస్తూ ప్రధాని మోదీ శనివారం ట్వీట్లు చేశారు.

మొదట తడబడినా..

మొదట శుక్రవారం రాత్రి ఏడింటికి మొదలైన 13 గంటల కౌంట్‌డౌన్ శనివారం ఉదయం 8 గంటలకు ముగిశాక ప్రయోగం చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో శనివారం తెల్లవారుజామున వర్షం పడడంతో వాతావరణం అనుకూలించని కారణంగా కౌంట్‌డౌన్ సమయాన్ని మరో 30 నిమిషాలు పెంచారు. తర్వాత 15 నిమిషాల వ్యవధిలోనే అంటే 8.15 గంటలకు రాకెట్ ప్రయోగాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేసి 8.45గంటలకు కౌంట్‌డౌన్ మొదలు పెట్టారు. హఠాత్తుగా ఇంజన్‌ను మండించే ప్రక్రియలో లోపం తలెత్తింది. దీంతో రాకెట్ ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లకుండా ఆగిపోయింది. దీంతో ప్రయోగాన్ని ఆటో మేటిక్ లాంచ్ సీక్వెన్స్‌లోని ఆన్ బోర్డు కంప్యూటర్ ఆపేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి ప్రయోగం వాయిదా వేసినట్లు ఇస్రో అధికారికంగా ప్రకటించింది. అయితే దీన్ని సవాల్‌గా తీసుకున్న ఇస్రో శాస్త్రవేత్తల టైగర్ సేఫ్టీ బృందం వెంటనే లాంచ్ ప్యాడ్ వద్దకు వెళ్లి సాంకేతిక లోపాన్ని సరిచేసింది. దీంతో మళ్లీ 9.33 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. ఎట్టకేలకు 10.03 గంటలకు గగన్‌యాన్ టీవీ-డీ1 విజయవంతంగా ప్రయోగించారు. 10 నిమిషాల 10 సెకన్లలో మొత్తం ప్రయోగం విజయవంతంగా పూర్తయింది.

సముద్ర జలాల నుంచి ఐఎన్ఎస్ శక్తి ఓడలో తీసుకొస్తున్న క్రూ ఎస్కేప్ మాడ్యూల్





పారాచూట్‌తో కిందికి దిగుతున్న క్రూ ఎస్కేప్ మాడ్యూల్



బంగాళాఖాతం జలాల్లో దిగిన క్రూ ఎస్కేప్ మాడ్యూల్



పీవీ నుంచి వాజ్‌పేయికి రహస్య చీటీ!

- ఆ చీటీలో ఏముందంటే..
- అశోక్ టాండన్ పుస్తకంలో పలు అంశాలు వెల్లడి

న్యూఢిల్లీ: దిగ్గజ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సమయంలో మాజీ ప్రధాని, కాంగ్రెస్ నేత పీవీ నరసింహా రావు ఆయనకు ఓ చీటీ అందించారని తాజాగా విడుదలైన ఒక పుస్తకం ద్వారా వెల్లడైంది. వివరాల్లోకి వెళ్తే.. వాజ్‌పేయి ప్రధానిగా కొనసాగిన కాలంలో అంటే 1998-2004 కాలంలో అశోక్ టాండన్ అనే అధికారి ప్రధానమంత్రి కార్యాలయంలో మీడియా వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన రాసిన 'ది రివర్స్ స్వింగ్: కలోనియలిజం టు కోఆపరేషన్' అనే పుస్తకంలో ఇటీవల విడుదలైంది. దానిని పెట్రోలియం, సహజవాయు, గృహ, పట్టణవ్యవహారాల కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురీ ఢిల్లీలో ఆవిష్కరించారు. ఆ పుస్తకంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి గురించి కొన్ని ఆసక్తికరమైన అంశాలను టాండన్ పంచుకున్నారు. రాష్ట్రపతిభవన్‌లో ప్రమాణస్వీకారం వేళ వాజ్‌పేయి ప్రధానమంత్రి పదవి చేపట్టినపుడు అదే సమయంలో అక్కడే ఉన్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఒక చీటీని వాజ్‌పేయికి రహస్యంగా అందించారు. 'అసంపూర్తిగా మిగిలిపోయిన ఒక పనిని మీరు పూర్తిచేయాలి' అని ఆ చీటిలో రాసి ఉందట. 1996 సంవత్సరంలో ఈ ఘటన జరిగిందని పుస్తకంలో పేర్కొన్నారు. ' పీవీ తాను ప్రధానిగా కొనసాగిన కాలంలో అమెరికా నుంచి తీవ్ర ఒత్తిళ్ల కారణంగా అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించలేకపోయారు. ఆ బాధ్యతలను పీవీనే స్వయంగా వాజ్‌పేయికి అప్పగించి ఉంటారు' అని ఆ పుస్తకంలో టాండర్ రాసుకొచ్చారు. 1996లో వాజ్‌పేయి ప్రధాని పదవి చేపట్టడం 13 రోజులకే ప్రభుత్వం కూలడం, 1998లో ప్రధాని పగ్గాలు చేపట్టి విజయవంతంగా ఐదేళ్ల పాలన వాజ్‌పేయి పూర్తిచేసుకోవడం తెల్సిందే. 1996లో అణుపరీక్షలకు ప్రయత్నించి విఫలమైన ప్రభుత్వం 1998లో పోఖ్రాన్‌లో విజయవంతంగా పూర్తిచేసి అమెరికాను సైతం విస్మయానికి గురిచేసిన సంగతి తెల్సిందే.

రాష్ట్రపతి పదవి తిరస్కరణ!

2002 సంవత్సరంలో ప్రధాన మంత్రిగా దిగిపోయి రాష్ట్రపతి పదవి చేపట్టాలని వాజ్‌పేయికి సూచనలు వచ్చాయని, కానీ వాజ్‌పేయి అందుకు ససేమిరా అన్నారని పుస్తకంలో ఉంది. ప్రధానిగా వాజ్‌పేయి దిగిపోతే ఆ బాధ్యతలు అద్వానీకి అప్పగించాలని చూశారని పేర్కొన్నారు. ' ప్రధానిగా ఉన్న వ్యక్తి వెంటనే రాష్ట్రపతి పదవి చేపడితే అది ప్రజాస్వామ్య దేశానికి ఎంతమాత్రం మంచిదికాదు. పరిణామాలు దారుణంగా ఉంటాయి' అని తన తోటి మంత్రులతో వాజ్‌పేయి అన్నారట.

1996 తర్వాత మెజారిటీ ప్రభుత్వం అమెరికాకు నచ్చలేదట

పుస్తకంలో పీవీ ఆలోచనలనూ పొందుపరిచారు. ' 1996 సార్వత్రిక ఎన్నికల తర్వాత ఇండియాలో పటిష్టమైన ప్రభుత్వం ఏర్పడటం అమెరికాకు ఇష్టంలేదట. వాజ్‌పేయి ప్రధాని కావడం అమెరికాకు ఇష్టం లేదనుకుంటా. వాజ్‌పేయి ముక్కుసూటి తనం, ఆయన వ్యవహార శైలి చూస్తుంటే ఆయన అణుపరీక్షలకు పచ్చజెండా ఊపేలా ఉన్నారని అమెరికా ప్రభుత్వానికి ఢిల్లీలోని ఆ దేశ రాయబారి సమాచారం చేరవేశారు' అని పీవీ అప్పట్లో అన్నట్లు పుస్తకంలో పేర్కొన్నారు.

మొయిత్రా ఢిల్లీలో ఉంటే.. దుబాయ్‌లో ఆమె లాగిన్ ఐడీని వాడారు

బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆరోపణలు

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే పరోక్షంగా మరికొన్ని ఆరోపణలు చేశారు. ఎంపీ మొయిత్రా ఢిల్లీలో ఉన్న సమయంలో ఆమె పార్లమెంట్ ఐడీని దుబాయ్‌లో కొందరు ఉపయోగించుకుని లాగిన్ అయిన విషయాన్ని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) దర్యాప్తు సంస్థలకు సమాచారం అందించిందని వెల్లడించారు. ఎంపీ దుబే శనివారం 'ఎక్స్'లో' ..'కొంత డబ్బు కోసం ఆమె జాతీయ భద్రతను పణంగా పెట్టారు. ఇదే ఎన్ఐసీని ప్రధానమంత్రి, ఆర్థిక శాఖ, వివిధ కేంద్ర విభాగాలు వాడుతుంటాయి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ప్రతిపక్షాలు ఇంకా దీనిపై రాజకీయాలు చేయాలా? దీనిపై ఇక ప్రజలే నిర్ణయం తీసుకుంటారు' అని దూబే పేర్కొన్నారు. కానీ, దర్యాప్తు విభాగం పేరును ఆయన పేర్కొనలేదు. అంతేకాకుండా, ఆమె ఎవరి నుంచి లంచం తీసుకున్నారు? వ్యాపారవేత్త దర్శన్ హిరా నందాని తరఫున అదానీ గ్రూప్, ప్రధాని మోదీ లక్ష్యంగా లోక్‌సభలో ఆమె ఎలాంటి ప్రశ్నలు అడిగారు? వంటి విషయాలను దుబే వివరించలేదు.

ఎంపీ దుబేకి ఎథిక్స్ కమిటీ పిలుపు


అదానీ గ్రూప్‌ను, ప్రధాని మోదీని లక్ష్యంగా లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు లంచం తీసుకున్నారంటూ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై ఎంపీ దుబే ఇటీవల లోక్‌సభ స్పీకర్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై లోక్‌సభ నైతిక వ్యవహారాల కమిటీ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా, ఈ నెల 26న తమ ముందు హాజరై మౌఖిక సాక్ష్యం ఇవ్వాలని దుబేను కోరింది. అదానీ గ్రూప్ గుజరాత్‌లోని తన కంపెనీకి బదులుగా ఒడిశాలోని ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన విభాగంలో ఎల్ఎన్‌జీ నిల్వ చేసుకునేందుకు అనుమతి పొందిన అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించేందుకు ఎంపీ మహువా పార్లమెంటరీ ఐడీని లాగిన్ చేసినట్లు వివరిస్తూ హిరా నందాని స్వయంగా సంతకం చేసిన ఒక సీల్డు కవర్‌ను ఈ కమిటీకి అందజేశారు. ఈ వివరాలు కూడా బయటకు వెల్లడి కావడం గమనార్హం. ఎంపీ మొయిత్రాపై ఆరోపణల విషయంలో సొంత పార్టీ టీఎంసీ మౌనంగా ఉంటోంది. అయినప్పటికీ మొయిత్రా ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ అదానీ గ్రూప్‌పైనా, ఎంపీ దుబేపైనా ఆరోపణలు ఎక్కుపెడుతూనే ఉన్నారు.

ఎంపీలందరి లాగిన్ వివరాలను ఎన్ఐసీ వెల్లడించాలి: మొయిత్రా

తను ఢిల్లీలో ఉండగా పార్లమెంటరీ లాగిన్ ఐడీని దుబాయ్‌లో వాడారంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే చేసిన ఆరోపణలపై ఎంపీ మహువా మొయిత్రా తీవ్రంగా స్పందించారు. ఎంపీలందరి లాగిన్ వివరాలను కూడా ఎన్ఐసీ బహిరంగ పర్చాలని, వారు ఏ సమయంలో ఏ ప్రదేశంలో ఉన్నారో కూడా పరిశీలించాలని ఆమె డిమాండ్ చేశారు. తన కంటే జాతీయ భద్రతకు అత్యంత ప్రమాదకరం అదానీ గ్రూపేనని ఆమె ఎదురుదాడికి దిగారు. అదానీ గ్రూప్ కంపెనీ బొగ్గు దిగుమతులపై సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాద ఘటనల్లో పదేళ్లలో 65% తగ్గుదల

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదం, ఈశాన్య రాష్ట్రాల్లో విద్రోహ చర్యలు గత దశాబ్ద కాలంలో 65 శాతం మేర తగ్గుముఖం పట్టాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. దేశంలోని మూడు హాట్ స్పాట్లుగా ఉన్న వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతం, జమ్మూకశ్మీర్‌ల్లో పరిస్థితులు ప్రశాంతంగా మారాయన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావడంతోపాటు ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేస్తుండడమే దీనికి కారణమన్నారు. శనివారం నేషనల్ పోలీస్ మెమోరియల్ వద్ద పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి అమిత్ షా మాట్లాడారు. పోలీస్ టెక్నాలజీ మిషన్ ఏర్పాటు చేసి పోలీసు బలగాలను తీవ్రవాదులను ఎదుర్కోవడంలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. దాదాపు 150 ఏళ్లనాటి క్రిమినల్ జస్టిస్ విధానాన్ని సమూలంగా మార్చేందుకు ప్రభుత్వం పార్లమెంట్‌లో మూడు బిల్లులను ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విధి నిర్వహణలో 36,250 మంది పోలీసులు ప్రాణాలర్పించారు. 2022 సెప్టెంబర్ నుంచి 2023 ఆగస్టు వరకు 188 మంది పోలీసులు విధుల్లో ఉండగా అమరులయ్యారు. పోలీసు స్మారకం కేవలం చిహ్నం కాదు, దేశ నిర్మాణం కోసం పోలీసు సిబ్బంది చేసిన త్యాగం, అంకితభావానికి గుర్తింపు'అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అంతర్గత రక్షణతోపాటు దేశ సరిహద్దుల భద్రతకు సైతం సమర్థమంతమైన పోలీసు విధానం అవసరం ఎంతో ఉందని చెప్పారు.

దద్దరిల్లుతున్న దక్షిణ గాజా

క్షిపణి దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్

- ఇరువైపులా ఇప్పటికే 5,500 దాటిన మరణాలు

జెరూసలేం: ఇజ్రాయెల్ దాడులతో దక్షిణ గాజా గజగజలాడుతోంది. ఉత్తర గాజాను ఖాళీ చేసి తక్షణం దక్షిణాదికి వెళ్లాల్సిందిగా 11 లక్షల మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ హెచ్చరించడం తెలిసిందే. దాంతో అంత మందీ నానా పాట్లు పడి అతి ప్రమాదకరమైన 20 కిలోమీటర్లకుపైగా ప్రయాణించి దక్షిణ గాజాకు చేరుకున్నారు. ఇంతా చేసినా రోజుల వ్యవధిలోనే దక్షిణ గాజాపైనా ఇజ్రాయెల్ తీవ్ర దాడులకు తెగబడటంతో పాలస్తీనియన్ల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. అక్కడి ఖాన్ యూనిస్ నగరంతో పాటు పలు ప్రాంతాలపై ఎడతెరిపి లేకుండా ఇజ్రాయెల్ క్షిపణులు వచ్చి పడుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. దాడుల్లో ఇప్పటికే కనీసం 4,200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య శాఖ తాజాగా ప్రకటించింది. 13 వేల మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు వివరించింది. ఇజ్రాయెల్‌లో ఇప్పటిదాకా 1,500 మంది మరణించినట్లు వార్తలొచ్చాయి. మరోవైపు గాజాపై భూతల దాడికి అన్ని విధాలా ఇజ్రాయెల్ సిద్ధమవుతోంది. లెబనాన్ వైపు సరిహద్దుల్లో ఉన్న పెద్ద పట్టణాలను ఆగమేఘాల మీద ఖాళీ చేయిస్తోంది. ఈ నేపథ్యంలో లెబనాన్ ముందుజాగ్రత్త చర్యగా సరిహద్దుల వెంబడి తన నగరాలు, ఆవాసాలను ఖాళీ చేయిస్తోంది. హమాస్‌కు నేరుగా దన్నుగా బరిలో దిగాలని లెబనీస్ ఉగ్ర సంస్థ హెజ్బొల్లా నిర్ణయం తీసుకుందని ఇజ్రాయెల్ తాజాగా ఆరోపించింది. ఇందుకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది. హెజ్బొల్లా ఇప్పటికే దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌పై ఎడతెరిపి లేకుండా క్షిపణి దాడులకు దిగుతోంది. ఇజ్రాయెల్‌పై అక్టోబర్ ఏడో తేదీన మెరుపుదాడికి దిగిన సందర్భంగా బందీలుగా పట్టుకున్న వందలాది మందిలో ఇద్దరు అమెరికన్లను హమాస్ తాజాగా విడుదల చేసింది. జుడిత్ రానన్, ఆమె 17 ఏళ్ల కూతురు నటాలీ హమాస్ చెర నుంచి బయటపడ్డట్టు ఇజ్రాయెల్ పేర్కొంది.

కీలక భేటీ

యుద్ధాన్ని ఆపే మార్గాంతరాలపై డజనుకు పైగా ప్రాంతీయ, పాశ్చాత్య దేశాలకు అధినేతలు, నేతలు, ఉన్నతాధికారులతో ఈజిప్ట్ శనివారం సమావేశం నిర్వహించింది. యుద్ధానికి తెర వేయడం, వీలుకాని పక్షంలో కనీసం కాల్పుల విరమణకైనా ఇరు వర్గాలను ఒప్పించే మార్గాంతరాలపై నేతలు చర్చించారు. ఇందులో ఇటలీ, స్పెయిన్, గ్రీస్, కెనడా ప్రధాన మంత్రులతో పాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు పాల్గొన్నట్టు ఈజిప్ట్ ప్రభుత్వం పేర్కొంది. ఖతర్, యూఏఈ తదితర దేశాల ఉన్నత స్థాయి నేతలు కూడా పాల్గొన్నారు. మరోవైపు, ఇరాక్ నుంచి తక్షణం అమెరికా బలగాలు పూర్తిగా వైదొలగాలని ఇరాన్ దన్నున్న స్థానిక మిలిటెంట్ సంస్థలు హెచ్చరించాయి.

థన్‌బర్గ్ ట్వీట్‌కు దీటుగా బదులిచ్చిన ఇజ్రాయెల్

పర్యావరణ ఉద్యమకారిణి గ్రేటా థన్‌బర్గ్ చేసిన ట్వీట్‌కు ఇజ్రాయెల్ గట్టి సమాధానం ఇచ్చింది. యుద్ధంపై పర్యావరణ ఉద్యమకారిణి గ్రేటా థన్‌బర్గ్ చేసిన ట్వీట్‌కు ఇజ్రాయెల్ దీటుగా బదులిచ్చింది. గాజాకు మద్దతుగా కొందరు వ్యక్తులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తోన్న చిత్రాన్ని థన్‌బర్గ్ ట్వీట్‌చేశారు. 'పాలస్తీనా, గాజాకు మద్దతిస్తున్నాం. పోరుపై ప్రపంచం స్పందించాలి. పాలస్తీనా ప్రజలు, ఇతర బాధితుల కోసం కాల్పుల విరమణ ప్రకటించాలి. న్యాయం, స్వేచ్ఛ కోసం పిలుపు ఇవ్వాలి' అని గ్రేటా ట్వీట్‌చేశారు. దీనిపై ఇజ్రాయెల్ స్పందించింది. 'హమాస్ దాడుల వల్ల ఎంతోమంది అమాయకులైన ఇజ్రాయెల్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆ నరమేధ బాధితుల్లో మీ స్నేహితులూ ఉండొచ్చు. వారి కోసం పోరాడండి' అని వ్యాఖ్యానించింది.



హమాస్ చెర నుంచి విడుదలై ఇజ్రాయెల్ చేరుకున్న నటాలీ, జూడిత్‌లు శుక్రవారం అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యం

ఎట్టకేలకు గాజాకు సాయం షురూ

ఐరాస, అంతర్జాతీయ సంస్థల వారం రోజుల పై చిలుకు ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. గాజాకు సహాయ సామగ్రి అందించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. దాంతో వాటిని చేరవేసేందుకు వీలుగా సరిహద్దులను తెరిచేందుకు ఈజిప్ట్ రఫా క్రాసింగ్‌ను హుటాహుటిన తెరిచింది. కానీ 20 ట్రక్కులను మాత్రమే అనుమతించారు. గాజాలో రోడ్డు మార్గాలు పూర్తిగా ధ్వంసం కావడంతో వాటికి మరమ్మతులు కొనసాగుతున్నాయి. ట్రక్కుల్లోని సామగ్రిని చిన్న చిన్న మోటార్లపై తరలిస్తున్నారు. వందలాది ట్రక్కులు సహాయ సామగ్రితో వారం రోజులకుపైగా ఈజిప్ట్ సరిహద్దుల వద్ద వేచి చూస్తున్నాయి. తినేందుకు, తాగేందుకు దిక్కులేక 23 లక్షల మంది గాజావాసులు అల్లాడుతున్నారు. ఉప్పు నీరు తాగి ప్రాణాలు నిలబెట్టుకుంటున్నారు! గాజాలో పరిస్థితి ఘోర మానవీయ విపత్తు దిశగా సాగుతోందని ఐరాస ఆహార పథకం ఆందోళన వెలిబుచ్చింది.

- సహాయ సామగ్రితో 200కు పైగా ట్రక్కులు ఈజిప్టు సరిహద్దు వద్ద వేచి చూస్తున్నాయి.
- వాటిల్లో 3,000 టన్నులకు పైగా అత్యవసరాలు, ఔషధాలు తదితరాలున్నాయి.
- గాజాలోకి వెళ్లిన 20 ట్రక్కుల్లో 44 వేల తాగు నీటి బాటిళ్లున్నాయి. కానీ అవి 22 వేల మందికి ఒక్క రోజు కంటే చాలవు!



గాజా సిటీలో ఇజ్రాయెల్ దాడుల్లో నామరూపాల్లేకుండా ధ్వంసమైన ఇల్లు



ఈజిప్టు నుంచి రఫా వద్ద గాజాలోకి ప్రవేశిస్తున్న నిత్యావసరాల ట్రక్కులు

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
ఆదివారం । 22 । అక్టోబర్ । 2023

పళని మురుగన్ హుండీ ఆదాయం రెండున్నర కోట్లు

అన్నానగర్: పళని మురుగన్ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ. రెండున్నర కోట్ల ఆదాయం వచ్చింది. ఈమేరకు శనివారం ఆలయ జాయింట్ కమిషనర్ మారిముత్తు అధ్యక్షత హుండీ కానుకలను సిబ్బంది లెక్కించారు. ఆలయ అధికారులు, పళని ఏరియా బ్యాంకు అధికారులు, పళని ఆండవర్ ఆర్ట్స్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో రూ.2.57 కోట్ల నగదు లభించింది. అలాగే బంగారం 815 గ్రాములు, 28 కిలోల వెండి, విదేశీ కరెన్సీ నోట్లు 489 లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు నగదును సంబంధిత బ్యాంక్‌ల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.

వీరుల త్యాగం చిరస్మరణీయం

పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం డీజీపీ కార్యాలయం ఆవరణలో శనివారం ఉదయం నిర్వహించారు. ఈ మేరకు స్మారక స్తూపం వద్ద డీజీపీ శంకర్‌జివ్వాల్, కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్ తదితర పోలీసులు అధికారులు ఘన నివాళులర్పించారు. వీరులకు వందనాలు సమర్పించారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ.. విధి నిర్వహణలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

- రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం
- డీజీపీ కార్యాలయ ఆవరణలో ఘన నివాళులు
- స్మారక స్తూపం వద్ద అంజలి ఘటించిన డీజీపీ, కమిషనర్
- అన్ని జిల్లాలోనూ భారీఎత్తున కార్యక్రమాలు




పుష్పగుచ్ఛం ఉంచి గౌరవ వందనం సమర్పిస్తున్న డీజీపీ శంకర్‌జివ్వాల్, అమరవీరులకు నివాళులర్పిస్తున్న కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్

సాక్షి, చెన్నై: ఏటా అక్టోబరు 21వ తేదీని పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విధి నిర్వహణలో అమరులైన వారికి నివాళులు అర్పించే విధంగా, వారి సేవల్ని స్మరించుకునే రీతిలో అన్ని జిల్లా కేంద్రాలు, రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సంస్మరణ దినోత్సవ సభలను శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఆయా నగరాలు, జిల్లా కేంద్రాల్లోని ప్రధాన కార్యాలయ ఆవరణలోని అమర వీరులను స్మరించుకుంటూ పెద్దఎత్తున కార్యక్రమాలు జరిగాయి. చెన్నైలోని మెరీనా తీరంలోని డీజీపీ కార్యాలయం ఆవరణలో.. డీజీపీ శంకర్ జివ్వాల్, చెన్నై పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్‌తో పాటు వివిధ విభాగాల్లోని డీజీపీ, అదనపు డీజీపీ స్థాయిలోని అధికారులు నివాళులర్పించారు. అక్కడి అమర వీరు సంస్మరణ స్తూపం వద్ద డీజీపీ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. గౌరవ వందనం సమర్పించారు. ఈ సమయంలో గాల్లో కాల్పులు జరిపి వీర వందనం సమర్పించారు. అలాగే ఈ ఏడాది కాలంలో విధి నిర్వహణలో, సేవల్లో నిమగ్నమై అమరులైన వారి పేర్లను ప్రస్తావిస్తూ నివాళులర్పించారు. కడలూరులో ఎస్పీ రాజారాం నేతృబృందం, ధర్మపురిలో ఎస్పీ స్టీఫన్ జేసుపాదం నేతృత్వంలో నివాళులర్పించే కార్యక్రమాలు జరిగాయి. నాగపట్నం సముద్రతీరంలోని అమర వీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ జాన్ టాం వర్గీస్, ఎస్పీ హర్షిద్, కోస్టుగార్డు అధికారి లలిత సింగ్ పుష్పగుచ్చాలు ఉంచి వీర వందనం సమర్పించారు. గాల్లో తుపాకులు పేల్చుతూ అమరులైన వీరికి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పోలీసు అధికారులు చేతికి నల్లటి వస్త్రం ధరించి వచ్చారు. కన్యాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలి, మదురై, కోయంబత్తూరు, తిరుచ్చి కమిషనరేట్‌లోనూ కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా సీఎం స్టాలిన్ ఓ ప్రకటన ద్వారా అమరులైన వారికి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

వేలూరులో..

వేలూరు: అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని డీఐజీ ముత్తుస్వామి అన్నారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసులకు శనివారం వేలూరు పోలీస్ మైదానంలో డీఐజీ ముత్తుస్వామి, ఎస్పీ మణివన్నన్ పుష్పాంజలి ఘటించారు. వారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణివన్నన్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దేశ రక్షణ కోసం పాటుపడాలన్నారు.



వేలూరు: నివాళులర్పిస్తున్న డీఐజీ ముత్తుస్వామి

అడిషనల్ ఎస్పీ భాస్కరన్, డీఎస్పీ తిరునావకరసు, తిరుపత్తూరు, రాణిపేట జిల్లాల్లోనూ అమరవీరులకు ఘన నివాళులర్పించారు.

తిరువళ్లూరులో..



తిరువళ్లూరు: స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీ

తిరువళ్లూరు: దేశ భద్రతలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసులకు ప్రతి పౌరుడు రుణపడి ఉండాలని అడిషనల్ ఎస్పీ కుమరన్ అన్నారు. 1959లో లడఖ్‌లో జరిగిన చైనా దాడుల్లో సుమారు 10 మంది భారత జవానులు ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేశారు. అదే విధంగా దేశవ్యాప్తంగా భద్రత విధులు నిర్వహిస్తూ మృతి చెందిన 292 మంది పోలీసులకు నివాళులర్పించడానికి ఏటా అక్టోబర్ 21న పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శనివారం ఉదయం తిరువళ్లూరు ఎస్పీ కార్యాలయం ఆవరణలో అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన జవానుల త్యాగాలు వృథా కావన్నారు. అనంతరం 21 రౌండ్‌లలో 3 సార్లు గాలిలో కాల్పులు జరిపారు. కార్యక్రమంలో డీఎస్పీ హనుమంతు, ఇన్‌స్పెక్టర్ అంథోనిస్టాలిన్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రథంపై విహరించిన వాసవీ అమ్మవారు



కొరుక్కుపేట: రథంపై ఆశీనులై శ్రీ వాసవీ అమ్మవారు భక్తులను కటాక్షించారు. చెన్నై జార్జిటౌన్లో 300 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన కన్యకాప రమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం వేదపండితులు చతుర్వేద పారాయ ణం, జప సూక్తం, మూలమంత్ర హోమం, త్రికాల అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వాసవీ అమ్మవారిని రథంపై వేంచేపు చేసి విశేషంగా అలంకరించి పూజాలు చేశారు. రథంపై నుంచి అమ్మవారు భక్తులను తన చల్లని చూపులతో కటాక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమంలో ఊరా ఆంజనేయులు, సునాధ వినోదిని, ఎస్ ప్రియ దర్శిని, గాన ప్రియ, సాయి రాగ మాలిక ట్రస్ట్ బృందాలు భక్తి పాటలతో అలరించారు.

అభయ్ సింగ్‌కు ఘనస్వాగతం



అభయ్ సింగ్‌ను సత్కరిస్తున్న అధికారులు

సాక్షి, చెన్నై: ఆసియా క్రీడలలో బంగారు, కాంస్య పతకాలను దక్కించుకున్న స్క్వాష్ క్రీడాకారుడు అభయ్ సింగ్‌కు చెన్నైలో బ్రహ్మరథం పట్టారు. వేళచ్చేరిలోని గురునానక్ ఎడ్యుకేషన్ సొసైటీ నేతృత్వంలో శనివారం ఘన స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీపులో ఊరేగిస్తూ కళాశాల వద్దకు తీసుకొచ్చారు. కళాశాల నిర్వాహకులు, కో-ఆర్డినేటర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, డీన్లు మంజిత్ సింగ్, జస్బీర్ సింగ్, సెల్వరాజ్, నమశ్శివాయం ఘన స్వాగతం పలికారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత సైరస్ పొంచా స్క్వాష్ ఫెడరేషన్ కార్యదర్శి బాలమురుగన్, కోచ్ డింపుల్ కన్నన్ తదితరులు అభయ్ సింగ్‌ను అభినందించారు. ఆయన్ని ఘనంగా సత్కరిస్తూ, క్రీడా ప్రతిభను చాటే విధంగా కొనియాడారు. అలాగే గురునానక్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా రూ. 3.5 లక్షలను అభయ్‌సింగ్‌కు అందజేశారు.

హరిత విప్లవ పితామహుడికి ఘన నివాళి



స్వామినాథన్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

సాక్షి, చెన్నై : హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు శనివారం ఘన నివాళులర్పించారు. చెన్నైలోని ఐఐటీ మద్రాసు ఆవరణలో జరిగిన ఈ సంతాప సభకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామినాథన్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ 'భారత హరిత విప్లవ పితామహుడు'గా స్వామినాథన్ కీర్తిగడించారని కొనియాడారు. స్వామినాథన్ భారతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలకు, రైతులకు మార్గదర్శక వెలుగుగా మిగిలిపోయారని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడం నేడు అవశ్యమని పేర్కొంటూ, ఇది తన అభిప్రాయంగా వ్యాఖ్యలు చేశారు. ఇదే ప్రొఫెసర్ స్వామినాథన్‌కు నిజమైన నివాళిగా తెలిపారు. ఈ సంతాపసభలో స్వామినాథన్ కుమార్తె సౌమ్య స్వామినాథన్, తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్, రైతు సంఘం నేతలు టీఆర్ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అల్ ఉమా బాషా

సాక్షి, చెన్నై: అల్ ఉమా తీవ్రవాద సంస్థ నేత భాషా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. ఆయనకు అత్యవసర చికిత్సలు అందిస్తున్నారు. కోయంబత్తూరులో గతంలో జరిగిన బాంబు పేలుళ్ల గురించి తెలిసిందే. ఈ కేసులో అల్ ఉమా తీవ్ర వాద సంస్థ నేత బాషా(74)తో పాటు అనేక మంది జీవిత ఖైదీలుగా కోయంబత్తూరు కారాగారంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం బాషా తీవ్ర అనారోగ్యం బారినపడ్డాడు. దీంతో ఆయన్ని చికిత్స నిమిత్తం కోయంబత్తూరు కేజీ ఆస్పత్రికి తరలించారు. అతడికి హృదయం, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యతో పాటు మెదడులోనూ సమస్య ఉందని ఈ మేరకు చికిత్స అందిస్తున్నామని వైద్యులు పేర్కొన్నారు.

జెండా రచ్చ!

- అన్నామలై నివాసం వద్ద ఉద్రిక్తత
- బీజేపీ కార్యకర్తల అరెస్టు
- వంద రోజుల్లో 10 వేల జెండాల ఏర్పాటుకు నిర్ణయం



అన్నామలై ఇంటి వద్ద ఉద్రిక్తత (ఇన్‌సెట్) గాయపడ్డ కార్యకర్త

సాక్షి, చెన్నై : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నివాసానికి సమీపంలో బీజేపీ జెండా స్తూపం ఏర్పాటు వివాదానికి దారి తీసింది. దీన్ని స్థానికులు వ్యతిరేకించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం అర్ధరాత్రి వేల ఆ జెండా స్తూపాన్ని తొలగించడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చెన్నై శివారులోని ఈసీఆర్ మార్గంలో ఉన్న పనయూరులో నివాసం ఉంటున్నారు. ఇక్కడ అతిపెద్ద జెండా స్తూపం, అందులో బీజేపీ జెండా ఎగుర వేయడానికి అక్కడి నేతలు ఏర్పాట్లు చేశారు. ఆరో అవెన్యూలో ఉన్న ఆయన ఇంటి ముందు శుక్రవారం రాత్రి ఈ జెండా స్తూపం ఏర్పాటుపై దృష్టి పెట్టారు. దీనిని ఆ పరిసరాల్లోని మైనారిటీలతో పాటు కొందరు వ్యతిరేకించినట్లు సమాచారం. పోలీసుల అనుమతి సైతం పొందకుండా ఈ జెండా స్తూపం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీంతో తాంబరం పోలీసు కమిషనర్ అమల్ రాజ్ ఆదేశాలతో డిప్యూటీ కమిషనర్ పవన్‌కుమార్‌రెడ్డి బృందం రంగంలోకి దిగింది. జెండాస్తూపాన్ని తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో పోలీసులు, బీజేపీ వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సమయంలో బీజేపీ కార్యకర్త భాస్కర్(44)కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఆందోళనకు దిగిన వారిని అరెస్టు చేసి ఓ కల్యాణ మండపంలో ఉంచారు. ఈ సమయంలో ట్రిప్లికేన్‌కు చెందిన మారి ముత్తు అనే కార్యకర్తకు గుండె పోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ సమయంలో జెండాస్తూపం తొలగించేందుకు వచ్చిన వాహనం అద్దాలను పగులగొట్టిన బీజేపీ కార్యకర్తలు కన్నియప్పన్, బాలకుమార్‌ను శనివారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు.

బీజేపీ నేతల ఆగ్రహం

తన ఇంటి వద్ద జెండా స్తూపం ఏర్పాటును పోలీసులు అడ్డుకోవడాన్ని అన్నామలై తీవ్రంగా ఖండించారు. తమ కార్యకర్తలను తీవ్రవాదుల తరహాలో చూస్తూ పోలీసులు దారుణంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఒక్క జెండా స్తూపాన్ని అడ్డుకున్న డీఎంకే పాలకులకు గుణపాఠం చెప్పే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 10 వేల జెండా స్తూపాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ స్పందిస్తూ, నవంబర్ ఒకటో తేదీ నుంచి రోజుకో చోట జెండా స్తూపాలను ప్రతిష్టించి, పార్టీ జెండాను ఎగుర వేస్తామని ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో- ఇన్‌చార్జ్ పొంగులేటిసుధాకర్‌రెడ్డి పేర్కొంటూ, పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించారు. అన్నామలై చేపట్టిన యాత్రకు అనూహ్య స్పందన వస్తుండడంతో డీఎంకేలో ఆందోళన మొదలైందని విమర్శించారు. అరెస్టు చేసిన తమ కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

200 సవర్ల బంగారం, రూ. 45 లక్షల నోట్లతో విశేష అలంకరణ



వేలూరు: తిరువణ్ణామలై జిల్లా ఆరణి తాలుకాలోని కోట వీధిలో పురాతన ఆరాంవలం నాయగి సమేద కైలాసనాదర్ ఆలయం ఉంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజలక్ష్మి అమ్మన్‌కు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు తీసుకొచ్చిన సుమారు రూ. 45 లక్షలు విలువ చేసే నోట్లు, 200 సవర్ల బంగారంతో సుమారు తొమ్మిది గంటల పాటు గజలక్ష్మి అలంకరణలో అమ్మవారిని ముస్తాబు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, దీపారధన పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.


రాష్ట్రంలోకి.. 'ఈశాన్యం'

- భారీ వర్షాలకు అవకాశం
- కన్యాకుమారి, నెల్లైలో అలర్ట్

సాక్షి, చెన్నై : ఈశాన్య రుతు పవనాలు ఒక రోజు ముందుగానే శనివారం రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడుతాయని వాతావరణ కేంద్రం అధికారి బాలచంద్రన్ ప్రకటించారు. ఇక తొలకరి పలకరింపుతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. వివరాలు.. రాష్ట్రంలో ఈ ఏడాది నైరుతి ప్రభావం అంతంత మాత్రంగానే ఉండడంతో ఈశాన్య రుతు పవనాలపై ఎదురు చూపులు పెరిగాయి. ఈ పవనాలు మరింత ఆశాజనకంగా ఉండవచ్చు అనే సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయి. ఆది లేదా సోమవారం ఈ పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించ వచ్చు అని తొలుత భావించారు. అయితే ఒక రోజు ముందుగానే శనివారం ఉదయం రాష్ట్రంలోకి ఈశాన్య రుతు పవనాలు ప్రవేశించినట్టుగా వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇది తమిళనాడు, కేరళ తీరాలను తాకినట్టు, విస్తరించేందుకు మరో మూడు నాలుగు రోజులు పట్టే అవకాశం ఉందని వివరించారు. ఈ పవనాలతో రానున్న మూడు రోజుల అనేక జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. అదే సమయంలో అరేబియా సముద్రంలో నెలకొన్న వాయుగుండం తేజ్ తుపాన్‌గా మారినట్టు బాలచంద్రన్ వివరించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాలకు భారీ వర్షాలు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. ఇప్పటికే కన్యాకుమారిని వర్షాలు భారీగా పడిన నేపథ్యంలో తాజా వర్షాలతో ఏదేని ముప్పు ఎదురు కాకుండా విస్తృత చర్యలు చేపట్టారు. అలాగే బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనం ఆదివారం మరింతగా బలపడుతుందని వాతావరణ కేంద్రం పేర్కొంది. జాలర్లు గురువారం వరకు అరేబియా, బంగాళాఖాతం వైపుగా వెళ్ల వద్దని, సముద్రంలో వేటకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణం కావాలనే హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా, పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో 111 అడుగులతో కూడిన వైగై జలాశయంలోకి నీటి రాక పెరిగింది. ఈ జలాశయంలో 71 అడుగుల వరకు నీటిని నిల్వ ఉంచే అవకాశం ఉంది. ఐదు రోజుల్లో ఈ జలాశయం ఐదు అడుగుల మేరకు నీటిమట్టం పెరిగి ప్రస్తుతం 59 అడుగులకు చేరింది. ప్రస్తుతం సెకనుకు 1,500 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆధ్యాత్మికానికి డీఎంకే వ్యతిరేకం కాదు

- సీఎం స్టాలిన్ స్పష్టీకరణ
- సోషల్ మీడియా ప్రతినిధులతో భేటీ
- జనగణనతో పాటు కులగణనా చేపట్టాలని ప్రధానికి లేఖ



నీట్‌కు వ్యతిరేకంగా సంతకం చేసి బాక్సులో కార్డును వేస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: ఆధ్యాత్మికానికి డీఎంకే వ్యతిరేకం కాదని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. డీఎంకే సోషల్ మీడియా ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. అలాగే జనగనణతోపాటు కులగణన దేశవ్యాప్తంగా జరిపేందుకు చర్యలు తీసుకోవాలన్ని కేంద్రాన్ని సీఎం కోరారు. వివరాలు.. డీఎంకే యువజన విద్యార్థి విభాగం నేతృత్వంలో నీట్‌కు వ్యతిరేకంగా భారీఎత్తున సంతకాల సేకరణకు శనివారం శ్రీకారం చుట్టారు. డీఎంకే కార్యాలయంలో సీఎం, ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ నీట్‌కు వ్యతిరేకంగా సంతకం చేసిన కార్డును బాక్సులో వేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ తదుపరి సంతకాల సేకరణ విస్తృతంగా జరిగింది. అలాగే షెనాయ్ నగర్‌లో సోసల్‌మీడియా ప్రతినిధులతో సమావేశాన్ని స్టాలిన్ ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా ప్రతినిధుల పాత్రను గుర్తు చేస్తూ, మరింతగా రాణించాలని పిలుపునిచ్చారు. డీఎంకే ఆధ్యాత్మికానికి వ్యతిరేకం కాదని ఈసందర్భంగా స్టాలిన్ స్పష్టం చేశారు. ఆర్య ఆధిక్యానికి మాత్రమే తాము వ్యతిరేకమే గానీ, ఆధ్యాత్మికానికి మాత్రం కాదన్నది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. రంగుల గీర అంచు పంచె కట్టే వాళ్లు పార్టీకి నిరంతర సైనికులని, తెల్ల పంచ కట్టే వారు ఎన్నికల వేళ ప్రత్యక్షమై దూకుడు ప్రదర్శిస్తుంటారని ఈ సందర్భంగా దివంగత నేత కరుణానిధి చెప్పిన కథను గుర్తు చేశారు. పార్టీకి సైనికులు ముఖ్యమని వ్యాఖ్యానించారు. డీఎంకేను నిర్వీర్యం చేయడం కలలో కూడా ఎవరితరం కాదన్నారు. అన్నాడీఎంకే - బీజేపీ రెండూ నాణెంలో ఇరు వైపులా ఎలాంటి చిహ్నం లేని పార్టీలని, వీరు ఆడే నాటకాలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు.

కుల గణనకు విజ్ఞప్తి

"భారతదేశంలో సామాజిక న్యాయం, సమానత్వాన్ని స్థాపించడానికి జాతీయ జనాభా గణనతో పాటుగా కులగణనకు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం లేఖ రాశారు. 2021 జనాభా లెక్కలు జరగని దృష్ట్యా, ప్రస్తుతం ఆ దిశగా ప్రయత్నాల నేపథ్యంలో కుల గణనపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అనేక రాష్ట్రాలు కులగణనకు విజ్ఞప్తి చేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ, జాతీయ జనాభా లెక్కింపుతో పాటు కుల గణన జరిగితే సమగ్ర సమాచారం రాబట్టేందుకు వీలువుతుందన్నారు. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం తదితర వాటికి బలం చేకూరాలంటే కులగణన జరిగి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు.



సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఆమ్నీలపై అధికారుల కొరడా



ఆమ్నీ బస్సు

- చార్జీల రెట్టింపుపై సీరియస్
- 1,545 బస్సులకు జరిమానా
- 102 బస్సుల సీజ్

సాక్షి, చెన్నై: ఆమ్నీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల చార్జీలు భారీస్థాయిలో పెంచడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఈ క్రమంలో ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా దోచుకున్న 1,545 బస్సులకు జరిమానా విధించారు. 102 బస్సులను సీజ్ చేశారు. వివరాలు.. రాష్ట్ర రవాణా వ్యవస్థలో ప్రభుత్వ బస్సులతో పాటు ప్రైవేటు ఆమ్నీ బస్సులు కీలకంగా ఉంటూ వస్తున్న విషయం తెలిసిందే. ఇక సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు లగ్జరీ సౌకర్యాలతో కూడిన ఆమ్నీ బస్సులనే ఆశ్రయించడం జరుగుతోంది. ఈ ఏడాది ఆయుధ పూజకు నాలుగు రోజులు సెలవులు రావడంతో స్వస్థలాలకు చెన్నై నుంచి 5 లక్షల మంది బయలుదేరి వెళ్లారు. శుక్ర, శని వారాల్లో ప్రత్యేక బస్సులను నడిపినా, ఆమ్నీ బస్సులు కిక్కిరిశాయి. ఈ క్రమంలో అన్ని బస్సులూ రెట్టింపు చార్జీలు వసూలు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రవాణా అధికారులు అలర్ట్ అయ్యారు. చెన్నై నుంచి తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, కన్యాకుమారి, దిండుగల్ - తేని వైపుగా వెళ్లే ఆమ్నీ బస్సులు, సేలం, ఈరోడ్, కోయంబత్తూరు వైపుగా సాగే బస్సులు, కడలూరు, నాగపట్నం - తంజావూరు వైపుగా వెళ్లే బస్సులను గురి పెట్టి టోల్‌గేట్లలో రవాణా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో 8,635 ఆమ్నీ బస్సుల్లో సోదాలు చేసి అధిక చార్జీలను వసూలు చేసిన 1,545 బస్సులకు రూ. 27.67 లక్షల జరిమానా విధించారు. ఇక 102 బస్సులు ఎలాంటి పర్మిట్, రోడ్డు పన్ను చెల్లించకుండా తిరుగుతుండడంతో వాటిని సీజ్ చేశారు.

క్లుప్తంగా

రైల్వే ట్రాక్‌పై రాళ్లు


తిరుత్తణి రైల్వే ట్రాక్ వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

తిరుత్తణి: తిరుత్తణి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై రాళ్లు ఉంచిన ఘటనకు సంబంధించి రైల్వే అధికారులు దర్యాప్తు చేపట్టారు. పొన్‌పాడి రైల్వేస్టేషన్ వద్ద బిహార్ బహల్‌పూర్ నుంచి బెంగళూరుకు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం అర్ధరాత్రి తిరుత్తణి సమీపంలోని పొన్‌పాడి ట్రాక్ క్రాస్ చేస్తుండగా ట్రాక్ మధ్యలో రెండు రాళ్లు ఉంచడాన్ని లోకోపైలెట్ గుర్తించి రైలు వేగాన్ని తగ్గించారు. ఇంతలో రైల్వేట్రాక్ క్రాస్ చేయగా భారీ శబ్దంతో రాళ్లు విరిగాయి. ఈ సంఘటనకు సంబంధించి అరక్కోణం రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

రూ.100 కోట్ల ఆలయ భూమి స్వాధీనం


అక్రమంగా నిర్మించిన భవనానికి సీలు వేస్తున్న అధికారులు

కొరుక్కుపేట: పూందమల్లి సమీపంలోని వరదరాజపురం పంచాయతీలో సిద్ధి బుద్ధి సమేత వినాయస్వామి దేవాలయం ఉంది. ఈ ఆలయానికి చెందిన 101 ఎకరాల భూమి పూందమల్లి పరిధిలోని బెంగళూరు జాతీయ రహదారిలో ఉంది. ఆలయ భూమిని చాలా ఏళ్ల క్రితం పలువురు వ్యక్తులు ఆక్రమించుకుని అక్కడ వాణిజ్య సముదాయ భవనాలు నిర్మించారు. సమాచారం అందుకున్న హిందూ ధార్మిక సంక్షేమశాఖ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆక్రమించిన వ్యక్తులను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. అయితే వారు ఖాళీ చేయకపోవడంతో భవనాలను కూల్చివేయాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు హిందూ ధర్మాదాయశాఖ చర్యలు తీసుకుంది. దీంతో ఆలయానికి రూ.100 కోట్ల ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆ భవనాలకు తాళం వేసి సీల్ వేశారు.

అరుణగిరినాథర్ మణిమండపం ప్రారంభం


మణిమండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఏవా వేలు

వేలూరు: తిరువణ్ణామలైలో భక్తుల సౌకర్యార్థం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాష్ట్ర మంత్రి ఏవా వేలు తెలిపారు. గిరివలయం రోడ్డులో అరులాలర్ అరుణగిరి నాధర్ మణి మండపాన్ని కలెక్టర్ మురుగేష్ అధ్యక్షతన మంత్రి ప్రారంభించి అరుణగిరి నాధర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరివలయం రోడ్డులో రూ. 125 కోట్ల వ్యయంతో అరుణగిరి మండపాన్ని నిర్మించినట్లు చెప్పారు. గిరివలయం రోడ్డును అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ చేపట్టామన్నారు. మురుగన్ అంటే తమిళ దేవుడని ప్రతి ఒక్కరికీ చాటి చెప్పిన మహా వ్యక్తి అరుణ గిరి నాధర్ అని కొనియాడారు. తిరువణ్ణామలై మట్టికి ప్రాధాన్యత కల్పించిన అరుణగిరి నాధర్ 16 వేల పాటలు రాసినప్పటికీ అందదులో మనకు 1,307 పాటల మాత్రమే దొరికాయన్నారు. మహా భారతాన్ని తమిళంలో అనువదించి తమిళ ప్రజలకు తెలియజేసిన మహా మనిషి అరుణగిరి నాధర్ పేరుపై ప్రస్తుతం తిరువణ్ణామలైలో మణి మండపం నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. తిరువణ్ణామలైకి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి వెలుతుంటారని వారికి ఈ మణి మండపం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం మణి మండపాన్ని ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, పార్లమెంట్ సభ్యులు అన్నాదురై, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షులు ఏవా కంభన్, మాజీ ఎంపీ వేణుగోపాల్, ఎమ్మెల్యేలు గిరి, శరవణన్, దేవరాజ్, విశ్వనాధన్, డీఎంకే పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీధరన్, దేవదాయ శాఖ చైర్మన్ జీవానందం, అరుణాచలేశ్వరాలయ జాయింట్ కమిషనర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే బలోపేతానికి సమష్టిగా పనిచేద్దాం


బూత్ కమిటీ స్లిప్పులను అందజేస్తున్న మాజీ మంత్రి సుబ్రమణియన్

వేలూరు: లోక్‌సభ ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, అన్నాడీఎంకే వేలూరు జిల్లా ఇన్‌చార్జ్ ముక్కూరు సుబ్రమణీయన్ అన్నారు. వేలూరు జిల్లా తిరువలం పరిధిలో పోలింగ్ ఏజెంట్‌లు, మహిళా సంఘాల వద్ద బూత్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌ఆర్‌కే అప్పు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో పదవుల కోసం పోటీపడకుండా పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త శ్రమించాలని హితవుపలికారు. ఈ బూత్ స్లిప్పులను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందజేయడంతో పాటు పోలింగ్ ఏజెంట్‌లతో సమీక్షిస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం ఎవరిని నిర్ణయించినా సమష్టిగా పనిచేయాలని సూచించారు. డీఎంకే ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందనే విషయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో పార్టీ ఐటీ విభాగం రీజినల్ కార్యదర్శి జననీసతీష్‌కుమార్, తిరువలం డివిజన్ కార్యదర్శి జయరామన్, మూర్తి, సుగణ్య, దాస్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై నిరసన

- ప్రసవం కోసం రెండు గంటల నిరీక్షణ
- పట్టించుకోని ఆస్పత్రి సిబ్బంది
- చివరకు ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లిన గర్భిణి


ప్రసవం కోసం నిరీక్షిస్తున్న గర్భిణి


నిరసన వ్యక్తం చేస్తున్న దంపతులు

తిరువళ్లూరు: ప్రసవనొప్పులు రావడంతో చికిత్స కోసం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన గర్భిణిపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వైద్యం కోసం సుమారు రెండు గంటల పాటు ఎదురుచూసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో దంపతులు అర్ధరాత్రి వేళ ఆందోళనకు దిగారు. తిరువళ్లూరు జిల్లా మహ్మద్ అలీ వీధికి చెందిన మణిగండన్(35). ఇతని భార్య భారతి(32). ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భారతి మూడోసారి గర్భం దాల్చింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రసవ నొప్పులు రావడంతో బంధువులు ప్రసవం కోసం తిరువళ్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే వైద్యశాలకు వచ్చి రెండు గంటలు దాటినా కనీసం నర్సులు కూడా పట్టించుకోలేదని బంధువులు ఆరోపించారు. ఆమెకు ప్రసవనొప్పులు అధికం కావడంతో పాటు చలి జ్వరం రావడంతో విషయాన్ని ఆమెక భర్త వైద్యుల దృష్టికి తీసుకెళ్లాడు. అయినా వైద్యులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన మణిగండన్ భార్యతో కలిసి అక్కడే నిరసనకు దిగాడు. వైద్యులు, నర్సులకు వ్యతిరేకంగా ఆందోళన చేయడంతో శుక్రవారం అర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ప్రభుత్వ వైద్యశాల నుంచి బయటకు వెళ్లి సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

రూ.55 లక్షల విలువైన బంగారం స్వాధీనం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో శనివారం సింగపూర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.55 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తిరుచ్చి విమానాశ్రయానికి శనివారం వేకువజామున సింగపూర్ నుంచి స్కూట్ విమానం చేరుకుంది. కస్టమ్స్ అధికారులు విమానంలోని ప్రయాణికులను తనిఖీ చేశారు. ఆ సమయంలో విమానంలో వచ్చిన ఓ మహిళా ప్రయాణికురాలి చర్యలపై అనుమానం వచ్చింది. అనంతరం ఆమెని ఒంటరిగా తీసుకెళ్లి పరీక్షించగా.. లోదుస్తుల్లో 909 గ్రాముల బంగారాన్ని పేస్టు రూపంలో దాచినట్లు తేలింది. ఆమె పుదుచ్చేరికి చెందిన ప్రయాణికురాలిగా తేలింది. అనంతరం కస్టమ్స్ అధికారులు ఆమెని అరెస్ట్ చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ రూ.55 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు.

నవంబర్ 1న గ్రామ సభలు నిర్వహించండి

- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం

కొరుక్కుపేట: స్తానిక సంస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 1వ తేదీ తమిళనాడు వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 12,525 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. గ్రామాల్లో అమలు చేయాల్సిన పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

పూందమల్లిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు


పూందమల్లిలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: పూందమల్లి మున్సిపాలిటీలోని వేర్వేరు ప్రాంతాల్లో కలెక్టర్ ప్రభుశంకర్ నేతృత్వంలోని అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పలు అభివృద్ధి పనులపై ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ చెంగల్‌పట్టులో సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం జిల్లా కలెక్టర్‌లకు దిశానిర్దేశం చేశారు. ఫీల్డ్‌లోకి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు సాధ్యమైనంత మేరకు సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే కలెక్టర్ ప్రభుశంకర్ జిల్లాలోని ఊత్తుకోట, పూందమల్లి, తిరుమళిసైతో పాటు పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనీఖీలు నిర్వహించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయడంతో పాటు పనులు నాణ్యతగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం పూందమల్లిలోని 5వ వార్డులో తరచూ ఏర్పడుతున్న తాగు నీటి సమస్యపై అధికారుల నుంచి వివరాలను సేకరించి తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాబు గొంతులో బాటిల్ మూత

- తొలగించిన వైద్యులు

అన్నానగర్: తంజావూరు ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు శుక్రవారం 10 నెలల బాబు గొంతులో చిక్కుకున్న మందు బాటిల్ మూతను తొలగించారు. వివరాలు.. తంజావూరు పిల్లియార్‌పట్టికి చెందిన అలెక్స్–అదృష్టలక్ష్మి దంపతులకు కుమారుడు ధరణేష్ (10 నెలలు) ఉన్నాడు. శుక్రవారం బాబు ఇంట్లో ఆడుకుంటూ మందు డబ్బా మూతను మింగేశాడు. దీంతో ఊపిరాడక ప్రాణాపాయ స్థితిలో రాసమీరసుదర్ ఆసుపత్రిలోని పిల్లల అత్యవసర విభాగంలో చేర్పించారు. ఈఎన్‌టీ సర్జన్లు గొంతులో ఇరుక్కున్న మందు బాటిల్ విజయవంతంగా బయటకు తీశారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. తంజావూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ బాలాజీనాథన్ వైద్యులను ప్రశంసించారు.

బంగారం స్వాధీనం

అన్నానగర్: లోదుస్తుల్లో తరలిస్తున్న రూ.1.57 కోట్ల విలువైన బంగారాన్ని శనివారం కోయంబత్తూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కడలూరుకు చెందిన యువకుడితో సహా ఇద్దరిని అరెస్టు చేశారు. యీ విమానాశ్రయానికి షార్జా నుంచి ఎయిర్ అరేబియా విమానం వచ్చింది. ప్రయాణికులను పోలీసులు తనిఖీ చేస్తుండగా ఇద్దరిపై అనుమానం రావడంతో సోదాలు చేశారు. లోదుస్తుల్లో దాచిన 2.5 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. తిరువారూరుకు చెందిన దీప, కడలూరుకు చెందిన మణికంఠన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

లైఫ్ ఈజ్ మ్యూజిక్..!



విల్లైకారన్ సాంగ్‌ను విడుదల చేస్తున్న విశాల్, ఆర్య

తమిళసినిమా: హాస్య నటుడు సతీష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం విల్లైకారన్. నటి సిమ్రాన్ గుప్తా నాయకిగా నటిస్తున్న ఇందులో ఆనంద్ రాజ్, మధుసూదన్ రావ్, దర్శకుడు సుబ్రమణి శివ, జాన్ విజయ్, ఆసీఫ్ అలీ తదితరులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. వైట్ కార్పెట్ ఫిలిమ్స్ పతాకంపై కె.విజయ్ పాండి నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా వెంకీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇది డార్క్ కామెడీ కథా చిత్రంగా ఉంటుందని దర్శకుడు చెప్పారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై పరిసర ప్రాంతాల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. విల్లైకారన్ చిత్ర కథ, కథనాలు చాలా కొత్తగా ఉంటాయన్నారు. టీజర్‌ను ఇటీవల విడుదల చేయగా మంచి స్పందన వచ్చిందన్నారు. కాగా చిత్రంలోని లైఫ్ ఈజ్ మ్యాజిక్ అనే సింగిల్ సాంగ్‌ను శనివారం నటుడు విశాల్, ఆర్యల చేతులు మీదుగా విడుదల చేసినట్లు చెప్పారు. వినగానే నచ్చేసే మంచి మెలోడీ సాంగ్ ఇదని చెప్పారు. త్వరలోనే చిత్ర ఆడియో ట్రైలర్ విడుదల గురించి ప్రకటిస్తామన్నారు. కాగా దీనికి యువ కార్తీక్ చాయాగ్రహణం, వీపీ ఆర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్

దక్షిణాఫ్రికాలో దళపతి


నటుడు విజయ్‌తో అజ్మల్

తమిళసినిమా: దళపతి విజయ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం లియో. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో 7 స్క్రీన్ స్టూడియోస్ పతాకంపై ఎస్‌ఎస్ లలిత్ కుమార్ నిర్మించిన ఈ భారీ బడ్జెట్ చిత్రం గురువారం ప్రపంచ వ్యాప్తంగా తెరపైకి వచ్చి టాక్‌తో సంబంధం లేకుండా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. దీంతో ఈ చిత్ర యూనిట్ తదుపరి చిత్రాలకు రెడీ అవుతోంది. దర్శకుడు లోకేష్ కనకరాజ్ రజనీకాంత్ హీరోగా చేసే చిత్రం ప్రీ ప్రొడక్షన్స్ కార్యక్రమాల్లో నిమగ్నం అయ్యారు. నటుడు విజయ్ తన 68వ చిత్రం షూటింగ్ మూడ్‌లోకి వెళ్లిపోయారు. ఈయన హీరోగా ఇంతకు ముందు బిగిల్ వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ చిత్రాన్ని నిర్మిస్తోంది. దీనికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. మైక్ మోహన్ ప్రతినాయకుడిగా నటిస్తున్న ఇందులో నటి స్నేహ, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తుండగా, నటుడు జయరామ్, ప్రభుదేవా, ప్రసాద్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో నటుడు అజ్మల్ వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే చెన్నైలో ప్రారంభమైంది. ఇక్కడ ఒక పాటను కూడా చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ చిత్రం యూనిట్ దక్షిణాఫ్రికాలో మకాం పెట్టింది. నటుడు విజయ్ కూడా అక్కడ షూటింగ్‌లో పాల్గొన్నారని సమాచారం. దక్షిణాఫ్రికాలో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది.

తంగలాన్ టీజర్ వచ్చేస్తోంది


తంగలాన్ చిత్రంలో విక్రమ్

తమిళసినిమా: పొన్నియిన్ సెల్వన్ వంటి చారిత్రక కథా చిత్రం తరువాత విక్రమ్ నటించిన చిత్రం తంగలాన్. నటి పార్వతి, మాళవిక మోహన్, పశుపతి తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. పా.రంజిత్ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. కర్ణాటక రాష్ట్రంలోని బంగారు గనుల నేపథ్యంలో రూపొందిస్తున్నట్లు దర్శకుడు పా.రంజిత్ ఇది వరకే తెలిపారు. చిత్ర పోస్టర్లను విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా ఈ చిత్రంలోని విక్రమ్ గెటప్ చాలా డిఫరెంట్‌గా ఉండి తంగలాన్ చిత్రంపై అంచనాలను పెంచేస్తోంది. ఇక ఈ చిత్రంపై నటి మాళవిక మోహన్ చాలా ఆశలు పెట్టుకుంది. కాగా తంగలాన్ చిత్రం అప్‌డేట్‌ను సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ వెల్లడించారు. ఆయన తన ట్విట్టర్‌లో తంగలాన్ సంభవం చిత్ర టీజర్ అతి త్వరలో అని పేర్కొన్నారు. ఇది విక్రమ్ అభిమానులకు తీపి వార్తే అవుతుంది. కాగా తంగలాన్ చిత్రాన్ని సంక్రాంతి బరిలోకి దిగడానికి నిర్మాత సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కాగా నటుడు విక్రమ్ నటించిన మరో చిత్రం ధ్రువ నక్షత్రం. గౌతమ్ మీనన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. నటి రీతూ వర్మ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రం కూడా త్వరలో విడుదలకు సిద్ధమవుతోందని తెలిసింది.

జేఎస్‌కే దర్శకత్వంలో ఫైర్


నటి సాక్షి అగర్వాల్

తమిళసినిమా: ఇప్పుడు పలు చిత్రాలను నిర్మించిన అనుభవంతో చాలా మంది నిర్మాతలు దర్శకులుగా మారుతున్నారు. ఈ కోవలోకి మరో నిర్మాత చేరారు. ఇంతకు ముందు పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన జేఎస్‌కే తాజాగా దర్శకుడిగా అవతారం ఎత్తి తన జేఎస్‌కే ఫిలిం కార్పొరేషన్ పతాకంపై రూపొందిస్తున్న చిత్రం ఫైర్. బాలాజీ మురుగదాస్ హీరోగా నటిస్తున్న ఇందులో రచ్చితా మహాలక్ష్మి, సాక్షి అగర్వాల్, గాయత్రి షాన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ ప్రారంభం అయిన ఈ చిత్రం వివరాలను దర్శక నిర్మాత జేఎస్ కే తెలుపుతూ ఇది మహిళలకు అవగాహన కలిగించే కదా చిత్రంగా ఉంటుందన్నారు. మగవాళ్లు తెలిసి తప్పులు చేసినా పట్టించుకోని ఈ సమాజం స్త్రీలు తెలియక తప్పు చేస్తే వేరేవిధంగా చూస్తారన్నారు. ఇలాంటి దృష్టికోణం మారితేనే మంచి సమాజం ఏర్పడుతుందని చెప్పే చిత్రం ఫైర్ అని చెప్పారు. ఇది ఈ తరానికే కాదు తదుపరి తరానికి మంచి సందేశాన్ని ఇచ్చే చిత్రంగా పేర్కొన్నారు. ఇది ఈ సమాజానికి అవసరమైన కథా చిత్రం అన్నారు. ఈ ఫైర్ చిత్రంలో పలు ఆసక్తికరమైన అంశాలు చోటు చేసుకుంటాయన్నారు. కాగా చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, ఈ చిత్రం ద్వారా డీకే అనే నూతన సంగీత దర్శకుడు పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. సతీష్ జీ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని విశేషాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు జేఎస్‌కే చెప్పారు.


దర్శక, నిర్మాత జేఎస్‌కే

మళ్లీ మెగాఫోన్ పట్టనున్న రోహిణి?


రోహిణి

తమిళసినిమా: నటిగా రోహిణి 1974లోనే బాలనటిగా తెరంగేట్రం చేశారు. తర్వాత కథానాయకిగా పలు చిత్రాల్లో నటించి ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తున్నారు. అంతే కాదు ఈమెలో మంచి డబ్బింగ్ కళాకారిణి, దర్శకురాలు కూడా ఉన్నారు. 2005లోనే చిన్న చిన్న ఆశై అనే చిత్రానికి దర్శకత్వం వహించారు.ఆ తరువాత ఒక డాక్యుమెంటరీ చిత్రం కూడా చేశారు. తాజాగా మరోసారి మెగా ఫోన్ పట్టడానికి సిద్ధమైనట్లు సమాచారం. యదార్థ ఘటనలతో ఇప్పటికే చాలా చిత్రాలు తెరకెక్కాయి. వాటిలో పలు చిత్రాలు విజయాన్ని సాధించాయి. జైభీమ్, సూరరై పోట్రు వంటి చిత్రాలు ఈ కోవలోకి వస్తాయి. కాగా ఆ మధ్య తమిళనాడునే ఉలిక్కిపడేలా చేసిన వాచ్చాత్తి హింసా సంఘటన ఇప్పుడు వెండితెర కెక్కనుంది. దీనికి నటి రోహిణి దర్శకత్వం వహించనున్నారని సమాచారం. కాగా దీనికి రచయిత ఆదవన్ దీక్షగా మాటలు,కథనం రాస్తున్నారు ఇందులో జై భీమ్ చిత్రం ఫేమ్ లిజోమోల్ జోస్ ప్రధాన పాత్రను పోషించనున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలువడే అవకాశం ఉంది.

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో మహిళ మృతి

తిరువొత్తియూరు: తేనెటీగలు కుట్టి మహిళ మృతి చెందిన ఘటన ఈరోడ్ జిల్లాలో జరిగింది. పెరుందురై సమీపంలోని పట్టకారన్ పాళయానికి చెందిన సరస్వతి (65) గురువారం సాయంత్రం తన పొలంలో నీరు కడుతోంది. ఆ సమయంలో పొలంలో పడి ఉన్న కొబ్బరి ఆకులను తీయడానికి ప్రయత్నించింది. ఒక్కసారిగా కొండ తేనెటీగలు ఆమెపై దాడి చేసింది. సరస్వతి కేకలు విన్న కుమారుడు కుమారేశన్ ఆమెను కాపాడేందుకు యత్నించాడు. అతన్ని కూడా తేనెటీగలు కుట్టాయి. గ్రామస్తులు కాగడాలను వెలిగించి తేనెటీగలను తరిమివేశారు. ఇద్దరిని పెరుందురై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సరస్వతి మృతి చెందింది. కుమరేశన్ చికిత్స పొందుతున్నాడు.

బస్సు నుంచి జారిపడి..

అన్నానగర్: పాఠశాలకు వెళుతుండగా బస్సు నుంచి జారిపడి విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన శుక్రవారం కారిమంగళంలో జరిగింది. ధర్మపురి జిల్లా కారిమంగళం సమీపంలోని పూనాథనల్లి చెందిన శక్తివేల్ కుమార్తె ప్రియదర్శిని (14) పెరియంబట్టి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేందుకు ప్రభుత్వ టౌన్ బస్సు ఎక్కింది. బస్సులో జనం అధికంగా ఉండడంతో విద్యార్థిని మెట్లపైనే నిలుచుంది. పెరియంబట్టి రోడ్డులోని పూనాథనల్లి వద్ద డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో విద్యార్థిని అదుపు తప్పి బస్సు నుంచి కిందపడింది. బస్సు వెనుక చక్రం బాలికపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలికను ధర్మపురి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

గాయపడ్డ కార్మికుడు చికిత్స పొందుతూ..

తిరువళ్లూరు: పనులు ముగించుకుని కిందికి దిగే క్రమంలో మెట్లపై నుంచి జారిపడి గాయపడిన కార్మికుడు చిక్సిత పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. ఉత్తరప్రదేష్ రాష్ట్రం రామ్ కోలా కుషీనగర్ ప్రాంతానికి చెందిన రాజేకిషోర్ కుమారుడు రోహిత్(26). ఇతను గుమ్మిడిపూండి సిప్‌కాట్‌లోని జైన్‌గ్రీన్ టెక్నాలజీ సంస్థలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 12న విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో మెట్లు నుంచి జారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రమైన గాయమైంది. వెంటనే సహచర కార్మికులు చెన్నై స్టాన్లీ వైద్యశాలకు తరలించగా అక్కడ చిక్సిత పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

ప్రభుత్వ వైద్యాధికారి సస్పెన్షన్

కొరుక్కుపేట: నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందిన ఎర్నాపురం ప్రభుత్వ వైద్యుడిని ఆరోగ్యశాఖ డైరెక్టర్ సస్పెండ్ చేశారు. నామక్కల్ సమీపంలోని ఎర్నాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా రాజేంద్రన్ (58) పనిచేస్తున్నారు. అయితే ఆయన నకిలీ కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగంలో చేరారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఆరోగ్య శాఖ ద్వారా 1988లో ఆయన నియమితులయ్యారు. సీబీడీ అధికారులు విచారణ చేశారు. ఈ కేసు సేలం జిల్లా ప్రత్యేక కోర్టులో నడుస్తోంది. అయితే రాజేంద్రన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. గత జనవరిలో డాక్టర్ రాజేంద్రన్‌పై చర్యలు తీసుకోవాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో డాక్టర్ రాజేంద్రన్‌ను సస్పెండ్ చేస్తూ ఆరోగ్య శాఖ డైరెక్టర్ సెల్వ వినాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

తిరువొత్తియూరు: తిరువారూరు జిల్లాలో బాలికను లైంగికంగా వేధించిన వృద్ధుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. తిరువారూరు జిల్లా మన్నారుకుడి మేల్‌నత్తం గ్రామానికి చెందిన వేలాయుధం (70) అదే ప్రాంతంలో సహోదరులతో కలిసి నూలు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇదే ప్రాంతంలో బిహార్ రాష్ట్రానికి చెందిన ఆరేళ్ల బాలిక తన అవ్వాతాతతో కలిసి ఉంటోంది. ఈ నెల 7వ తేదీ బాలికకు అనారోగ్యం ఏర్పడింది. మన్నార్‌గుడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలికపై లైంగిక దాడి జరిగినట్లు గుర్తించి తిరుమకోట్టై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేయగా బాలికపై వృద్ధుడు వేలాయుధం లైంగిక దాడి చేసినట్లు తెలిసింది. దీంతో వృద్ధుడిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

చోరీ కేసులో యువకుడి అరెస్ట్

అన్నానగర్: నెల్లైలో ఆర్మీ జవాన్ తన బైక్‌లో ఉంచిన రూ.14 లక్షలను చోరీ చేసిన యువకుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారానికి చెందిన ముత్తురాజ్ (32) ఆర్మీలో పనిచేస్తున్నారు. కోవిల్‌పట్టిలో ఇల్లు నిర్మిస్తున్నాడు. నెల్లై శ్రీపురం ప్రాంతంలోని ఓ బ్యాంకు నుంచి ముత్తురాజ్ ఈ నెల 6వ తేదీ రూ.14 లక్షలు తీసుకుని తన బైకు పెట్రోల్ ట్యాంక్ కవర్‌లో ఉంచాడు. మార్గంమధ్యలో తాళ్లయూతు బజార్‌లోని కిరాణా దుకాణం ముందు బైక్‌ను ఆపి పండ్లు కొనేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ట్యాంక్ కవర్‌లో ఉన్న డబ్బు కనిపించలేదు. ఫిర్యాదు మేరకు పోలీసులు తన ఇంట్లో పని చేస్తున్న ఏపీకి చెందిన శామ్యూల్ (19)ని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆందోళన

కొరుక్కుపేట: పాలస్తీనాపై దాడి చేస్తున్న ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా వివిధ సంస్థలు పెరంబూర్‌లో ర్యాలీ నిర్వహించాయి. సీఐటీయూ, ఇండియన్ డెమోక్రటిక్ యూత్ అసోసియేషన్, ఇండియన్ స్టూడెంట్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా డెమోక్రటిక్ మదర్స్ అసోసియేషన్ తదితర సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభల తేజం

వైకుంఠనాథుని సేవించుకుని సూర్యచంద్రులు ప్రభల తేజంతో ప్రకాశించారు. దేవదేవుని దివ్యచరణాలకు లేలేత కిరణాలతో ప్రభాత భానుడు.. వెన్నెల వెలుగులతో నెలరేడు ప్రణమిల్లారు. రామకృష్ణ గోవిందుని అవతారంలో విరాజిల్లుతున్న శ్రీహరిని దర్శించుకుని భక్తులు ఆనందపరవశులయ్యారు. సహస్ర దీప కాంతుల్లో శ్రీనివాసుని విరాట్‌స్వరూపాన్ని వీక్షించి తన్మయత్వం చెందారు. శ్వేత వర్ణ కలువల అలంకరణలో ప్రసన్న వదనంతో అనుగ్రహించిన సర్వాంతర్యామి సన్నిధిలో పునీతులయ్యారు.

- అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన దేవదేవుడు
- నేడు స్వర్ణరథం, రాత్రి అశ్వవాహనం
- రేపటి చక్రస్నానంతో ఉత్సవాలు పరిపూర్ణం


సూర్యప్రభపై విహరిస్తున్న మలయప్ప స్వామి

తిరుమల : తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగారు. ఉదయం భాస్కరునిపై వేంకటపతి రామకృష్ణ గోవిందా అలంకారంలో స్వర్ణకాంతులీనుతూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం ఆలయం వెలుపల సహస్రదీపాలంకరణ సేవలో స్వామివారు ఊయలూగుతూ కనువిందు చేశారు. రాత్రి చంద్రప్రభ వాహనసేవలో చల్లనయ్య శ్వేత వర్ణ కలువ పువ్వుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల్లో కళాకారుల అభినయం భక్తులను కట్టిపడేసింది. ఆలయంతోపాటు ఫల, పుష్ప ప్రదర్శనశాలలోని అలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాదనీరాజనం, ఆస్థాన మండపంలో భక్తి, సంగీత కార్యక్రమాలు అలరించాయి.

నేటి వాహనసేవలు

బ్రహ్మో త్సవాల్లో భాగంగా 8వ రోజు ఆదివారం ఉదయం శ్రీవారికి స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి కల్కి అవతారంలో అశ్వ వాహనంపై మలయప్ప ఊరేగనున్నారు.

రేపటి చక్రస్నానానికి సర్వం సిద్ధం

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు సోమవారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. పుష్కరిణిలో కొత్త నీటిని నింపి, వందశాతం క్లోరినేషన్ చేశారు. ప్రత్యేకంగా ఇనుప చైన్‌లింక్ కంచెలు నిర్మించారు. భక్తులను ఉదయం 4 నుంచి పుష్కరిణిలోకి అనుమతించనున్నారు.


వాహన సేవలో కళాకారుల నృత్య ప్రదర్శన


సీతారామ లక్ష్మణుల వేషధారణలో..

సేవ్ యంగ్ హార్ట్ క్యాంపెయిన్ ప్రారంభం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నటుడు విక్రమ్ ప్రభు

కొరుక్కుపేట: గుండె జబ్బులు, వాటి ఆరోగ్యంపై అవగాహన కల్పించే విధంగా ప్రశాంత్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సేవ్ యంగ్ హార్ట్స్ -2023 క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టింది. శనివారం వెళచ్చేరిలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా తమిళ నటుడు విక్రమ్ ప్రభు పాల్గొని క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండె జబ్బుల నుంచి బయటపడాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమన్నారు. యువతలో గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టాగామ్‌లో షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహించామని ఆస్పత్రి ఎండీ ప్రశాంత్ కృష్ణ తెలిపారు. ఉత్తమ వీడియోలకు మొదటి బహుమతిగా రూ.లక్ష , ద్వితీయ బహుమతిగా రూ.50 వేలను విక్రమ్ ప్రభు చేతుల మీదుగా అందించామని చెప్పారు.

రోడ్డు వసతి కల్పించాలని ఆందోళన

వేలూరు: స్థానికులకు రోడ్డు వసతి లేకుండా శ్మశానానికి ప్రహరీ గోడ నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ఆ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. వేలూరు కార్పొరేషన్ పరిధిలోని ఓటేరి గాంధీనగర్‌లో శ్మశానాన్ని ఆనుకుని ప్రభుత్వం హౌసింగ్ బోర్డు భవనం నిర్మించడంతో అందులో సుమారు 75 కుటుంబాలు ఉంటున్నాయి. వీరికి రోడ్డు వసతి లేకపోవడంతో శ్మశానం దారిలో నడిచి వెళ్లేవారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదు. తాజాగా శ్మశానం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసేందుకు జేసీబీ సాయంతో తవ్వకాలు మొదలుపెట్టారు. గమనించిన స్థానికులు అధికారులు, కాంట్రాక్టర్‌లతో వాగ్వాదానికి దిగారు. ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సెంథిల్‌కుమార్, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని.. అంతవరకు పనులను నిలిపి వేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.


శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

టపాసుల దుకాణాల్లో ఆర్‌డీవో తనిఖీ



తిరుత్తణి: దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలకు అనుమతికి సంబంధించి ఆర్‌డీవో దీప శనివారం తనిఖీలు చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి, పళ్లిపట్టు, ఆర్‌కేపేట, తిరువలాంగాడు ప్రాంతాలకు సంబంధించిన వ్యాపారులు దీపావళి సందర్భంగా టపాసుల విక్రయాలకు సంబంధించి అనుమతించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించుకున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తిరుత్తణి ఆర్‌డీఓ దీప ఆధ్వర్యంలో తహసీల్దారు మదన్, ఆర్‌కే కమల్, ఎస్ఐ రాజకుమారి, అధికారుల బృందం తిరుత్తణిలోని దుకాణాల్లో తనిఖీ చేపట్టింది. టపాసుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేసిన ప్రాంతం, భద్రతా ఏర్పాట్లు, రోడ్డు వసతి, అగ్నిప్రమాదాలు అరికట్టే ఏర్పాట్లను పరిశీలించింది.

రోగుల శ్రేయస్సే లక్ష్యంగా సేవలు


సమావేశంలో కన్నన్ తదితరులు

సాక్షి, చెన్నై : రోగుల శ్రేయస్సే లక్ష్యంగా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయనున్నామని మెహత ఆసుపత్రి గ్రూప్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కన్నన్ తెలిపారు. శనివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 5వ వార్షికోత్సవంలో భాగంగా పేదల కోసం మెగా వైద్య శిబిరం, హెల్త్ వాక్ థాన్ నిర్వహించనున్నామని వివరించారు. అలాగే, వైద్య రంగంలో విశిష్ట సేవలను అందించిన వారిని సత్కరించనున్నామన్నారు. 2023 టైమ్స్ హెల్త్ కేర్ అచీవర్స్ అవార్డు, 2022లో ఇండియా హెల్త్ కేర్ అవార్డు, 2021లో హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డు అంటూ, గత మూడేళ్లుగా తమకు అవార్డులు దక్కడం ఆనందంగా ఉందన్నారు. సమాజం, ఆరోగ్యం, రోగుల సంక్షేమార్థం తమ కార్యక్రమాలు విస్తృతం చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెహతా గ్రూప్ ప్రముఖులు దిలీప్, ప్రణవ్, డాక్టర్ శరవణ కుమార్, వసంత రమణిలు తదితరులు పాల్గొన్నారు.

• ఎయిర్ పోర్టులో ఏరో హబ్


చెన్నై విమానాశ్రయంలో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఏరో హబ్ మాల్ ఏర్పాటైంది. ఒలింపియా గ్రూప్, మెర్లిన్ గ్రూప్‌లు ఈ హబ్‌ను నిర్మించాయి. ఏరో హబ్ మాల్‌ను సినీ నటి ఆండ్రియా శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒలింపియా గ్రూప్ సీఈఓ ఏజే బాలాజీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, చెన్నై విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు. – సాక్షి, చెన్నై

సమ్మె ఉపసంహరణ

- వేటకు వెళ్లిన జాలర్లు

కొరుక్కుపేట: శ్రీలంక జైళ్లలో చిక్కుకున్న 27 మంది మత్స్యకారులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 5 రోజులుగా సమ్మె చేస్తున్న రామేశ్వరం మత్స్యకారులు సమ్మెను విరమించారు. శనివారం చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం ఫిషింగ్ పోర్టు నుంచి 14కు పైగా బోట్లలో మత్స్యకారులు పాక్ జలశాంతి సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. సముద్రంలో చేపల వేట సాగుతుండగా 4 బోట్లతో పెట్రోలింగ్ చేస్తున్న శ్రీలంక నేవీ 23 మంది మత్స్యకారులను పట్టుకుని కాంగ్ కేశంతురి నేవల్ క్యాంపుకు తీసుకెళ్లింది. అదేవిధంగా నాగై జిల్లా జగతాపట్టినం బీచ్ నుంచి చేపల వేటకు వెళ్లిన రామేశ్వరం ద్వీపం ప్రాంతానికి చెందిన మత్స్యకారుడు, ద్వీపానికి చెందిన నలుగురు మత్స్యకారుల పడవను, వలలను స్వాధీనం చేసుకున్నారు. వారిని రాత్రికి రాత్రే డిపార్ట్‌మెంట్‌లోని నౌకాదళ శిబిరానికి తీసుకెళ్లారు. అరెస్టయిన 27 మంది మత్స్యకారులను జాఫ్నా జైలులో నిర్బంధించారు. పట్టుబడిన పడవలను, 27 మంది మత్స్యకారులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రామేశ్వరం మత్స్యకారులు ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. అనంతరం సమ్మె విరమించడంతో రామేశ్వరం మత్స్యకారులు శనివారం ఉదయం సముద్రంలోకి వెళ్లారు. సామగ్రిని పడవలో ఎక్కించారు. 100కు పైగా చిన్న పడవలతో సముద్రంలోకి వెళ్లారు. నవరాత్రుల పండుగ తర్వాత పడవలన్నీ సముద్రంలోకి వెళ్తాయని మత్స్యకారులు తెలిపారు.


చేపల వేటకు వెళుతున్న జాలర్లు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి

అన్నానగర్: స్కూటర్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి పన్రూటిలో చోటుచేసుకుంది. వివరాలు.. కడలూరు జిల్లా పన్రుటి సమీపంలోని అరిసికొండన్‌పాళయానికి చెందిన కలైవానన్ భార్య జయలక్ష్మి (30), నాగరాజ్ భార్య కాత్యాయని (49) శుక్రవారం కూలి పనులకు వెళ్లి స్కూటీపై ఇంటికి తిరిగి వస్తున్నారు. కొండనపాళ్యం రోడ్డులో వెళ్తుండగా నెల్లికుప్పం చక్కెర కర్మాగారానికి చెరుకు తీసుకెళ్తున్న ట్రాక్టర్ వెనుక నుంచి స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో జయలక్ష్మి, కాత్యాయని ట్రాక్టర్ చక్రం కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పన్రుటి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పన్రుటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా మద్యం బాటిళ్లు స్వాధీనం

– ఏడుగురి అరెస్టు

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లాలో జరిపిన వాహన తనిఖీల్లో లారీలో తరలిస్తున్న 2016 మద్యం బాటిళ్లు, కారులో 384 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురుని అరెస్టు చేశారు. వివరాలు.. ఈరోడ్ జిల్లా ఎక్సైజ్ డీఎస్పీ పవిత్ర, ఇన్‌స్పెక్టర్ సెంథిల్ కుమార్, ఎస్ఐ గుగనేశ్వరన్, ఈరోడ్-కరూర్ రోడ్డులో వాహన తనిఖీ చేస్తున్నారు. ఒక కారులో తనిఖీ చేయగా 384 నకిలీ మద్యం బాటిళ్లు గుర్తించారు. అందులో ఉన్న సేలం జిల్లా వాలపాడికి చెందిన ప్రశాంత్ (22), శంకర్ (24), పుదుచ్చేరికి చెందిన ఆధవన్ (47)ను అరెస్టు చేశారు. అలాగే వెండిపాళయం వద్ద వాహన తనిఖీల్లో ఓ లారీలో రెండు అడుగుల వెడల్పు, 7 అడుగుల ఎత్తులో రహస్య క్యాబిన్ ఏర్పాటు చేసి మద్యం బాటిళ్లు తరలిస్తున్నట్లు గుర్తించారు. పుదుచ్చేరికి చెందిన ఉదయకుమార్ (42), సెల్వ (48), విక్కీ అలియాస్ విగ్నేష్ (30), సత్యరాజు (31)లను అరెస్టు చేశారు. వాహనంలోని 2016 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విల్లుపురం ప్రాంతంలో తయారు చేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రేమ పేరిట మోసం

–వ్యక్తి అరెస్టు


నిందితుడు తిరుమలై కృష్ణన్

తిరుత్తణి: ప్రేమ పేరుతో విదేశీ యువతిని మోసం చేసిన యువకుడిని తిరుత్తణి పోలీసులు అరెస్టు చేశారు. భగవతాపురం గ్రామానికి చెందిన వెంకట కుప్పరాజు కుమారుడు తిరుమలై కృష్ణన్ (28) బెంగళూరులో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి మలేషియాకు చెందిన నాగజ్యోతి అనే యువతితో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. ఇద్దరూ వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా మిత్రులయ్యారు. కొద్ది కాలానికి ప్రేమికులుగా మారారు. ఫలితంగా నాగజ్యోతి తరచూ ఇండియాకు వచ్చి చెన్నైలో తిరుమలై కృష్ణన్‌ను కలిసేది. ఈ క్రమంలో ఇద్దరూ శారీరకంగా ఒక్కటయ్యారు. తనకు వేరొక యువతితో నిశ్చితార్థం జరిగిందని ఇకపై తనతో టచ్‌లో వద్దని తిరుమలై కృష్ణన్ చెప్పడంతో నాగజ్యోతి మలేషియా నుంచి తిరుత్తణి చేరుకుంది. తనను వివాహం చేసుకోవాలని నిలదీసింది. హత్యా బెదిరింపులకు పాల్పడడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రాఖీకుమారి కేసు నమోదు చేసి తిరుమలై కృష్ణన్‌ను అరెస్టు చేశారు.

గండం తప్పినా.. ప్రాణం పోయింది

తిరువొత్తియూరు: మద్యం తాగొద్దని భార్య గొడవ పడడంతో కోపంతో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు.. కుటుంబ సభ్యులు సకాలంలో స్పందించడంతో స్వల్ప గాయాలతో బయపడ్డాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబుల్స్‌ను రప్పించగా తప్పించుకుని ఇంటి సమీపంలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తంజావూరు జిల్లా కల్వనైలో చోటుచేసుకుంది. సేయ్యమంగళానికి చెందిన మురుగానందం (40) తిరుచ్చి తువరకుడిలోని ఓ కంపెనీలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. తరచూ మద్యం తాగొచ్చి భార్య ప్రేమతో గొడవపడేవాడు. గురువారం ఎప్పటిలాగే మద్యం తాగొచ్చి గొడవ చేశాడు. భార్య మందలించడంతో ఇంట్లో ఉన్న కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. ఇంటిలో ఉన్న వారు వెంటనే నీళ్లు పోసి మంటలు ఆర్పారు. స్వల్ప గాయం ఏర్పడింది. ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు 108 వాహనం రప్పించారు. అయితే మురుగానందం అంబులెన్స్ ఎక్కకుండా పారిపోయాడు. అతని కోసం గాలించినా ఆచూకీ కనపడలేదు. ఈ క్రమంలో శనివారం ఇంటికి సమీపంలోని కొట్టంలో మురుగానందం ఉరికి వేలాడుతూ కనిపించాడు. సమాచారం మేరకు పోలీసులు అక్కడి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

భీష్మ సేవారత్న ఆర్. రాధాకృష్ణన్‌కు ఘన సత్కారం

కొరుక్కుపేట: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సస్టైయినింగ్ న్యూ రెసిలెంట్ ఇండియా అనే థీమ్‌తో బిల్డర్స్ డే సెలబ్రేషన్‌ను శుక్రవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు చెన్నై గిండిలోని మద్రాస్ రేస్ క్లబ్ వేదికైంది. వేడుకలకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ ప్రెసిడెంట్ మోహన్, బిల్డర్స్ స్టేట్ చైర్మన్ అయ్యప్పన్ హాజరై వేడుకలు ప్రారంభించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ భీష్మ సేవారత్న ఆర్ రాధాకృష్ణన్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సదరన్ సెంటర్ చైర్మన్ బాలాజీ, బిల్డర్స్ డే కమిటీ చైర్మన్ కె.కె.చౌదరి స్వాగతం పలికారు. ఈ వేడుకల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు, కళాశాలలకు మెమొంటోలు, ఆసుపత్రులు, కార్మికులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.కె చౌదరి మాట్లాడుతూ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 50 ఏళ్ల సేవలకు గుర్తింపుగా, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సదరన్ సెంటర్ కలిసి ఆర్.రాధాకృష్ణన్‌ను జ్ఞాపిక, శాలువా, గజ మాల, సెంగోల్‌తో ఘనంగా సత్కరించారు.


భీష్మ సేవారత్న ఆర్ రాధాకృష్ణన్‌ను సత్కరిస్తున్న కేకే చౌదరి తదితరులు

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ మీటర్ల మార్పు

– తమిళనాడు విద్యుత్ బోర్డు నిర్ణయం

కొరుక్కుపేట: తమిళనాడులో నాసిరకం విద్యుత్ మీటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు విద్యుత్ బోర్డు నిర్ణయం తీసుకుంది. తక్కువ విద్యుత్ వినియోగిస్తున్నప్పటికీ మీటర్ మరమ్మతుల కారణంగా అధిక ధరలు వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ మీటర్లను మార్చాలని వినియోగదారుల నుంచి విద్యుత్ బోర్డుకు పలు వినతులు వచ్చాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు వ్యాప్తంగా సుమారు 2.06 లక్షల నాసిరకం మీటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆదాయానికి గండి పడకుండా ఉండేందుకు నాసిరకం మీటర్లను గుర్తించి మరమ్మతులు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. తాజా సర్వే ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1.18 లక్షల మీటర్లు నాసిరకంగా ఉన్నాయని గుర్తించారు. ఇందులో 28,232 నాసిరకం మీటర్లతో కాంచీపురం అగ్రస్థానంలో ఉంది. విద్యుత్ బోర్డు సీనియర్ అధికారి మాట్లాడుతూ.. డిస్‌కనెక్ట్ అయిన మీటర్లను తనిఖీ చేయాలని చీఫ్ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అందు వల్ల 15 రోజుల్లో బకాయిలు చెల్లించాలని వినియోగదారులను కోరారు. ప్రస్తుతం సింగిల్ ఫేస్ మీటర్ల కొరత ఉంది. దీంతో కొత్త మీటర్ల కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈలోగా కొత్త మీటర్ల కొనుగోలుకు నిధులు సరిపోకపోవడంతో నాసిరకం మీటర్ల సమస్యను వెంటనే పరిష్కరించడం కష్టసాధ్యమని విద్యుత్ బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.

శ్రీరంగం రంగనాథ ఆలయంలో ఘనంగా తిరువడి సేవ


విశేష అలంకరణలో రంగ నాచ్చియార్

తిరువొత్తియూరు: శ్రీరంగం రంగనాథ స్వామి ఆలయంలో అమ్మవారి నిజ పాద సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. తిరుచ్చి శ్రీరంగం రంగనాథ దేవాలయం 108 వైష్ణవ క్షేత్రాలలో మొదటిది. భక్తులు దీన్ని భూలోక వైకుంఠంగా భావిస్తుంటారు. ఈ ఆలయంలో రంగ నాచ్చియార్ నవరాత్రి ఉత్సవాలు 15న ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రోజూ సాయంత్రం మూలస్థానం నుంచి అమ్మవారు బయలుదేరి కొలువు మండపంలో భక్తులను, మిగతా రోజుల్లో పాదాలను బయటికి కనిపించని విధంగా అలంకరిస్తారు. నవరాత్రి ఉత్సవాల్లో 7వ రోజు మాత్రమే అమ్మవారి పాదాలను దర్శించుకునేలా అలంకరణలు చేస్తారు. శనివారం సాయంత్రం నవరాత్రి ఉత్సవాల్లో 7వ రోజున రంగనాచ్చియార్ తిరువడి సేవ కొలువు మండపంలో జరిగింది. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు మూలస్థానంలో తాయార్ మూలస్థానం నుంచి బయలుదేరి 4.45 గంటలకు కొలువు మండపం చేరుకున్నారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు తిరువడి సేవలో రంగ నాచ్చియార్‌ను భక్తులు దర్శించుకున్నారు.

గుమ్మిడిపూండి వేణు మృతి తీరని లోటు

తిరువళ్లూరు: డీఎంకే సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే గుమ్మిడిపూండి వేణు (74) మృతి పార్టీతో పాటు వ్యక్తిగతంగా తనకు కూడా తీరని లోటని సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండికి చెందిన వేణు పార్టీలో సీనియర్ నేత. ఉమ్మడి జిల్లాకు పార్టీ కార్యదర్శిగానూ, ఎమ్మెల్యేగానూ పని చేశారు. ప్రస్తుతం డీఎంకే పార్టీ ఉన్నత స్థాయి కమిటీ సభ్యుడిగా వున్న ఆయన అనారోగ్యం కారణంగా చెన్నైలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని పార్టీ నేతలు కార్యకర్తల సందర్శనార్థం ఆయన సొంత గ్రామమైన పనపాక్కంలో ఉంచారు. గుమ్మిడిపూండి వేణు మృతి చెందిన నేపథ్యంలో సీఎం స్టాలిన్ తన సహచర మంత్రులతో కలిసి శనివారం ఉదయం ఆయన మృతదేహానికి నివాలి అర్పించారు. అనంతరం మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ వేణు మృతి పార్టీకి తీరని లోటని, తమ పార్టీ నిక్కాసైన నేతను కోల్పోయిందని వ్యాఖానించారు. అలాగే వేణు మృతదేహానికి మంత్రులు దురైమురుగన్, గాంధీ, కనిమొళి, శేఖర్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్ ప్రభుశంకర్ తదితరులు నివాలి అర్పించారు. కాగా వేణు మృతదేహానికి శనివారం సాయంత్రం సొంతగ్రామమైన పనపాక్కంలో అంత్యక్రియలు నిర్వహించారు. వేణు కుమార్తె ఉమామహేశ్వరం ప్రస్తుతం తిరువళ్లూరు జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు.


మాజీ ఎమ్మెల్యే వేణు మృతదేహానికి నివాలి అర్పిస్తున్న సీఎం, మంత్రులు

సీట్ సిక్స్టీ ..చేరుకోని కాంగ్రెస్

గెలుపు ధీమా పైకి కనిపిస్తున్నా కాంగ్రెస్ నేతలను లోలోపల భయపెడుతున్న గతం

మేకల కల్యాణ్ చక్రవర్తి

మ్యాజిక్ ఫిగర్... అధికారం దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలకు అవసరమైన కీలక సంఖ్య ఇది. మొత్తం స్థానాల్లో సగం కంటే ఒకటి ఎక్కువ స్థానాల్లో గెలుపొందిన పార్టీ మ్యాజిక్ ఫిగర్ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పుడు ఈ మ్యాజిక్ సంఖ్య విషయంలోనే కాంగ్రెస్ పార్టీ ఫికర్ అవుతోంది. తెలంగాణలో ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలుండగా, ప్రభుత్వ ఏర్పాటుకు 60 స్థానాలు అవసరమవుతాయి. ఈ 60 స్థానాల మ్యాజిక్ ఫిగర్ కాంగ్రెస్ పార్టీ గత నాలుగు ఎన్నికల్లోనూ సాధించలేదు. ఇంకో మాట చెప్పాలంటే 1985 నుంచీ ఈ 60 స్థానాలు ఆ పార్టీకి దక్కలేదు. అయితే 1985 నుంచి 2004 వరకు జరిగిన ఎన్నికల్లో తెలంగాణలోని అసెంబ్లీ సీట్లు 107 మాత్రమే. ఈ లెక్కన ఆ మధ్య కాలంలో జరిగిన ఎన్నికల్లో ఒకట్రెండు సార్లు మ్యాజిక్ ఫిగర్ వచ్చింది ఇక, తెలంగాణ ఏర్పాటయిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో అయితే ఆ పార్టీ మ్యాజిక్ ఫిగర్‌కు ఆమడదూరంలో నిలబడింది. 2014లో 21, 2018లో 19 స్థానాలకు మాత్రమే పరిమితమయింది. ఇప్పుడు ఆ సంఖ్య నుంచి ఏకంగా 60 స్థానాలకు ఎగబాకడం ఏ మేరకు సాధ్యమనే చర్చ కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



1985 నుంచి ఏ ఎన్నికల్లోనూ తెలంగాణలో 60 స్థానాలు సాధించలేని కాంగ్రెస్

1989లో అత్యధికంగా 58 సీట్లు.. ఆ తర్వాత 2009లో 50

2004 ఎన్నికల తర్వాత నాలుగు ఎన్నికల్లోనూ రాని మ్యాజిక్ ఫిగర్

తెలంగాణ ఏర్పాటయిన తర్వాత రెండుసార్లు 20కి అటూఇటూగానే..

2023 ఎన్నికల్లో రికార్డు బద్దలు కొడతామంటున్న కాంగ్రెస్ నేతలు

గతమంతా కటువుగా..

గతాన్ని పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రయాణం ఒడిదుడుకుల మధ్యనే సాగుతున్నట్టు అర్థమవుతుంది. కొన్ని ఎన్నికల్లో బాగానే సీట్లు సాధించినా, మరికొన్ని ఎన్నికల్లో చతికిలబడి పోవడం, ఆ తర్వాతి ఎన్నికల్లో కొంత పుంజుకోవడం రివాజుగా కనిపిస్తుంది. 1983లో ఎన్టీరామారావు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాక నాదెండ్ల భాస్కరరావు రూపంలో జరిగిన తిరుగుబాటు కారణంగా అసెంబ్లీ రద్దయి 1985లో మళ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని 107 స్థానాల్లో గెలిచింది కేవలం 14 మాత్రమే. అంతకుముందు 1983లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 43 చోట్ల గెలుపొందింది. రెండేళ్లలోనే 29 స్థానాలు కోల్పోయింది. ఆ ఎన్నికల్లో సీపీఐ8, సీపీఎం7, బీజేపీ 8 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందడం విశేషం. ఇక, 1989లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి తెలంగాణలో బాగా మెరుగుపడింది. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో 107 సీట్లకు గాను కాంగ్రెస్‌కు 58 సీట్లు వచ్చాయి. అప్పుడున్న మొత్తం స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్ తెలంగాణలోనూ వచ్చింది. 1985లో 14 సీట్లు గెలిచిన కాంగ్రెస్ 89లో ఏకంగా 44 సీట్లను అదనంగా సాధించింది. 1994 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభంజనం ముందు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చింది. ఈ ఎన్నికల్లో 107 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ గెలిచింది కేవలం 6 మాత్రమే. కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్న టీడీపీకి సొంతంగా 69 చోట్లా, సీపీఐకి 13, సీపీఎంకు 8 స్థానాలు వచ్చాయి. ఆ తర్వాత 1999 ఎన్నికల్లో తెలంగాణలో 42 సీట్లను సాధించింది. ఈ ఎన్నికల్లో ఆంధ్ర ప్రాంతం కంటే మెరుగైన ఫలితాలను తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సాధించింది. ఇక, 2004లో మహానేత డాక్టర్ వైఎస్సార్ పాదయాత్ర ప్రభావం తెలంగాణలోనూ స్పష్టంగా కనిపించింది. ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ 185 సీట్లు సాధిస్తే, అందులో తెలంగాణలో 48 ఉన్నాయి. అప్పుడు ఉన్న 107 స్థానాల్లో కూడా ఆ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ రాలేదు. ఆ తర్వాత జరిగిన 2009 ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పుంజుకుంది. గత ఎన్నికల కంటే రెండు ఎక్కువగా అంటే 50 చోట్ల ఆ పార్టీ విజయం సాధించింది. కానీ, అప్పుడున్న మొత్తం 119 అసెంబ్లీ స్థానాలతో పోలిస్తే మ్యాజిక్ ఫిగర్ మాత్రం రాలేదు. ఈ ఫలితాలను బట్టి ఉత్థాన పతనాల పరిణామాల అనంతరం ఈసారైనా కాంగ్రెస్ నిలదొక్కుకుంటుందా? గత రికార్డులను బద్దలు కొట్టి 119 అసెంబ్లీ స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్ అయిన 60 చోట్ల గెలుపొందుతుందా అనే ఆందోళన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. కానీ, పైకి మాత్రం ధీమాగానే కనిపిస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఏం జరుగుతుందో డిసెంబర్ 3 వరకు వేచి చూడాల్సిందే.

1985కు ముందు జరిగిన ఎన్నికల ఫలితాలిలా..

1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన సమయంలో తెలంగాణలో 107 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఆ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం హవా కనిపించింది. కానీ, తెలంగాణలో మాత్రం తెలుగుదేశంతో సమానంగా కాంగ్రెస్ పార్టీ 43 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందింది. ఆ ఎన్నికల్లో ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా దెబ్బతింది. అక్కడ మొత్తం 187 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది 17 మాత్రమే.

1978 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 175 స్థానాల్లో విజయం సాధించింది. అందులో తెలంగాణలోని 107 సీట్లలో 65 స్థానాల్లో గెలుపొందింది.

1972 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో 78 స్థానాలు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో 219 స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధించింది. కాగా ఈ ఎన్నికల్లో మొత్తం మీద ఇండిపెండెంట్లు 57 మంది గెలుపొందారు.

1967 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది కానీ, అప్పుడు ఇండిపెండెంట్లు తమ హవా చూపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 165 సీట్లు వస్తే అందులో తెలంగాణలో 64 ఉన్నాయి. 101 స్థానాలను ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కాంగ్రెస్ గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఇండిపెండెంట్ల హవా కొనసాగింది. మొత్తం 287 స్థానాలకు గాను 68 చోట్ల స్వతంత్రులే గెలుపొందారు. తెలంగాణలో వీరి సంఖ్య 26 కావడం గమనార్హం.

1962లోనూ కాంగ్రెస్ పార్టీనే గెలిచింది. తెలంగాణలోనూ 64 స్థానాల్లో విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో సీపీఐకి 18 స్థానాలు వచ్చాయి. ఇండిపెండెంట్లు 19 మంది గెలిచారు.ఈ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ 51 స్థానాల్లో గెలుపొందింది. కానీ, తర్వాతి రెండు ఎన్నికల్లోనూ సీపీఐకి గణనీయంగా సీట్లు తగ్గడంతో చాలా మంది ఇండిపెండెంట్లు గెలుపొందారు.

మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర ఏర్పాటు సందర్భం కావడంతో 1955లో ఆంధ్రప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన వారినే 1962 వరకు కొనసాగించారు. కానీ, తెలంగాణలో మాత్రం 1957లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 68 చోట్ల గెలుపొందగా, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) తరఫున పోటీ చేసిన కమ్యూనిస్టులు 22 చోట్ల గెలిచారు. ఈ ఎన్నికల్లోనూ 10 మంది ఇండిపెండెంట్లు గెలుపొందడం విశేషం.

వీళ్ల వయసు..123 సంవత్సరాలట..!





పుట్టిన సంవత్సరాన్ని 1900గా చూపుతూ అధికారులు జారీ చేసిన ఓటరు ఐడీ కార్డులు

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఒకటో వార్డుకు చెందిన కోడెపాక కోటిలింగం (44), కోడెపాక పద్మ (43) దంపతుల ఓటరు ఐడీ కార్డులు (ఈ–ఎలెక్టర్ ఫొటో గుర్తింపు కార్డు) చూస్తే వామ్మో అనాల్సిందే. వారు పుట్టిన సంవత్సరాన్ని 1900గా నమోదు చేసి.. వయసును 123 సంవత్సరాలుగా చూపారు. ఆ ఓటరు ఐడీ కార్డులను చూసిన దంపతులిద్దరూ అవాక్కయ్యారు. వెంటనే అన్ని ఆధారాలతో సహా సంబంధిత అధికారులను కలసి విషయం చెప్పడంతో సరి చేస్తామని చెప్పారని, ఇప్పటివరకు తమ పుట్టిన తేదీని సరి చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులు వారి నిర్వాకంతో తమ వయసును సుమారు మూడు రెట్లు పెంచేశారని, రానున్న ఎన్నికల్లో ఈ ఓటరు కార్డులను చూసి పోలింగ్ సిబ్బంది తమను ఓటు వేయనివ్వకపోతే పరిస్థితి ఏంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా వారినుంచి స్పందన రాలేదు.



అప్పట్లో నక్సల్స్‌కు బలైన ఎమ్మెల్యేలు

తెలంగాణలో అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు నక్సల్స్ ఘాతుకానికి బలైపోయారు. వారిలో కొందరి వివరాలు ఇవి. సిర్పూరు నుంచి 1989, 1994లలో ఇండిపెండెంట్ గా ఎన్నికైన పాల్వాయి పురుషోత్తంరావు నక్సల్స్ కాల్పులకు బలైపోయారు. ఆ తర్వాత 1999లో ఆయన సతీమణి పి.రాజ్యలక్ష్మి టీడీపీ తరఫున శాసన సభకు ఎన్నికయ్యారు. 1985లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి శాసనసభకు టీడీపీ తరఫున ఎన్నికైన దుగ్గిరాల వెంకటరావును కూడా నక్సల్స్ కాల్చి చంపారు. దేవరకొండ నుంచి 1999లో కాంగ్రెస్ తరఫున ఎన్నికైన రాగ్యా నాయక్ కూడా అదే రీతిలో నక్సల్ చేతిలో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత ఆయన సతీమణి భారతీ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1994లో జడ్చర్ల నుంచి శాసనసభకు టీడీపీ నుంచి ఎన్నికైన ఎమ్.సత్యనారాయణ ముఠా తగాదాలలో హత్యకు గురయ్యారు. తదుపరి ఉప ఎన్నికలో ఆయన సోదరుడు శేఖర్ గెలుపొందారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్ మండలాధ్యక్షుడుగా ఉన్నప్పుడు నక్సల్స్ దాడికి గురై తీవ్రంగా గాయపడ్డారు. మరో నేత ఐదుసార్లు శాసన సభకు ఎన్నికైన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు కిడ్నాప్ అయ్యారు. అప్పట్లో ఆయన టీడీపీ ఎమ్మెల్యేగా ఉండేవారు. ఆ సందర్భంలో ఆయన సతీమణి నక్సల్స్ కు వ్యతిరేకంగా దీక్ష చేశారు. తదుపరి ఆయనను నక్సల్స్ విడుదల చేశారు.

గాసిప్ టైమ్



సార్.. మమ్మల్ని మరిచిపోకండే!

నేతలతో 'టచ్'లో ఉంటున్న ఉన్నత విద్యామండలి అధికారులు



సాక్షి, హైదరాబాద్: ఇంతకాలం కోరుకున్న పోస్టు ఆశించి సాధించలేకపోయిన అధికారులు ఎన్నికల సీజన్‌లో బలమైన నాయకులకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. భవిష్యత్‌లో ఎన్నికల్లో గెలిచి ఏ మంత్రి పదవో లభిస్తే తమకంటూ ఆ నేతల వల్ల ప్రయోజనం లభించకపోతుందా అనే ఆలోచనతో సదరు అధికారులు ఆయా నేతలతో మంతనాలు సాగిస్తున్నారు. ఎక్కువగా ఇలాంటి వాళ్లు ఉన్నత విద్యామండలిలో కన్పిస్తున్నారని ఓ టాక్ నడుస్తోంది. నేరుగా కలిస్తే పార్టీ కలర్ అంటుకుంటుందని భయపడే అధికారులు ఫోన్‌లో మాత్రమే ఆయా నేతల్ని పలకరిస్తూ 'మీరు ఉన్నత స్థానంలోకి వస్తే మమ్మల్ని మరచిపోకండి'అంటూ టచ్‌లో ఉంటున్నారట.

తెలంగాణలో కేటీఆర్ రేంజే వేరు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడు కె.తారక రామారావు మంత్రిగా రాణిస్తున్నారు. తెలంగాణ నుంచి ముఖ్యమంత్రులు అయిన మరెవరి పిల్లలు కూడా ఈ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోలేదనే చెప్పాలి. భావి ముఖ్యమంత్రి అని కూడా ప్రొజెక్టవుతున్న కేటీఆర్ 2009 లో మొదటి సారి శాసనసభకు ఎన్నికై వరుసగా నాలుగు సార్లు గెలిచారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తండ్రి క్యాబినెట్‌లో మధ్యలో కొద్ది నెలలు మినహా మంత్రిగా ఉన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా కొనసాగుతున్నారు. కేసీఆర్ కుమార్తె ఒకసారి ఎంపీగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగాను ఉన్నారు. మాజీ ప్రధాని, మాజీ సీఎం పీవీ నరసింహారావు కుమారుడు పీవీ రంగారావు రెండుసార్లు శాసనసభకు ఎన్నికై.. సుమారు నాలుగేళ్లు మంత్రిగా పనిచేశారు. మరో కుమారుడు రాజేశ్వరరావు సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచారు. ఇదంతా పీవీ ప్రధానిగా ఉన్న సమయంలోనే కావడం విశేషం. జలగం వెంగళరావు కుమారుడు ప్రసాదరావు రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. 1989–94 మధ్యలో సుమారు మూడేళ్లపాటు మంత్రిగా ఉన్నారు. ఆయన సోదరుడు వెంకటరావు సత్తుపల్లి , కొత్తగూడెం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కుమారుడు శశిధర్ రెడ్డి సనత్ నగర్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండేళ్లపాటు మంత్రిగా పనిచేశారు. కేంద్ర స్థాయిలో జాతీయ విపత్తుల కేంద్రం వైస్ చైర్మన్ గా పనిచేశారు. టంగుటూరి అంజయ్య సతీమణి మణెమ్మ లోక్ సభకు, అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు.



ప్రజలకు నమ్మశక్యంగా ఉండేలా హామీలు.. అదే కేసీఆర్ ధైర్యం



కొమ్మినేని శ్రీనివాసరావు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఎన్నికల ప్రణాళికను ప్రకటించిన తీరు వినూత్నంగా ఉంది. సాధారణంగా అన్ని రంగాల ప్రస్తావనతో మేనిఫెస్టో ఉంటుంది. కానీ ఆయన తన పార్టీ పక్షాన దాదాపు పూర్తిగా సంక్షేమ కార్యక్రమాల ప్రణాళికనే ప్రకటించడం కాస్త ఆశ్చర్యంగా ఉంది. అదే సమయంలో అందులో ఆయన ధైర్యం కనిపిస్తోంది. తెలంగాణలో అభివృద్ధికి సంబంధించి ఒక నివేదికను ఇవ్వడంతో పాటు, వచ్చే ఐదేళ్లలో ఏమి చేస్తామో ఆయా పార్టీలు చెబుతుంటాయి. కానీ కేసీఆర్ అందుకు విరుద్ధంగా కేవలం ఒక రంగానికి సంబంధించి వాగ్దానాలను ప్రకటించి సరిపెట్టుకున్నారు. కాకపోతే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు వాగ్దానాలను దృష్టిలో ఉంచుకుని కొన్నిటిని ప్రకటించారు. ఇక్కడ ఒక సంగతి గమనించాలి. కేసీఆర్ స్కీములను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ ఆరు వాగ్దానాలు చేస్తే, దానిని దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ తన ఎన్నికల ప్రణాళికను రూపొందించినట్లు కనిపిస్తుంది. రెండు పార్టీలు పరస్పరం ఈ విషయంలో కాపీ కొట్టుకున్నాయనే చెప్పాలి. ఉదాహరణకు కేసీఆర్ దళిత బంధు కింద పది లక్షల సాయం ఇస్తుంటే, దానిని కాంగ్రెస్ పార్టీ పన్నెండు లక్షలు ఇస్తామని తెలిపింది. కేసీఆర్ వృద్ధాప్య పెన్షన్ రెండువేలు ఇస్తుంటే కాంగ్రెస్ నాలుగువేల వరకు హామీ ఇచ్చింది. తదుపరి కేసీఆర్ తన మేనిఫెస్టోలో వృద్ధాప్య పెన్షన్‌ను ఐదువేలు చేశారు.

కొత్తగా కేసీఆర్ బీమా– ఇంటింటికీ ధీమా

గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి, తదితర భారీ ప్రాజెక్టుల ప్రస్తావన ఉండేది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి వాటి గురించి వివరించి, ఆ తరహాలో ఇంకేమి చేస్తారో చెప్పేవారు.అలాగే పరిశ్రమల రంగం, ఉపాధి రంగం మొదలైనవాటి గురించి హామీలు ఇస్తుంటారు. ఒక వైపు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాలు గందరగోళంగా మారడం, నిరుద్యోగ యువతలో కొంత అసంతృప్తి ఉందన్న ప్రచారం సాగుతున్నప్పటికీ, కేసీఆర్ వాటిని పెద్ద సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించలేదు. తాను ఇప్పటివరకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, అలాగే వాటిని భవిష్యత్తులో ఇంకా అధికంగా ఇచ్చే తీరునే మేనిఫెస్టోలో పెట్టారు. ప్రత్యేకించి హైదరాబాద్‌కు సంబంధించి కొత్త ఆలోచనలేవీ ప్రకటించలేదు. అయితే కొత్తగా కేసీఆర్ బీమా– ఇంటింటికి ధీమా అన్న స్కీమ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని అర్హమైన 94 లక్షల కుటుంబాలకు బీమా పథకం అమలు చేస్తామని ప్రకటించారు. దీనిద్వారా ఎవరైనా మరణిస్తే ఐదు లక్షల బీమా మొత్తం అందుతుంది. ఇదే ప్రధానమైన కొత్త హామీ అని చెప్పాలి. అలాగే గ్యాస్ సిలిండర్‌ను 400 రూపాయలకే సరఫరా చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఐదువందలకే సిలిండర్ అంటే ఈయన ఇంకో వంద తక్కువకే సరఫరా చేస్తానని చెబుతున్నారు. అందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తమ హామీలను కాపీ కొట్టారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ స్కీమ్ ను పదిహేను లక్షలకు పెంచుతామని కేసీఆర్ తెలిపారు. వీటిని జర్నలిస్టులకు కూడా అమలు చేస్తామని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా, పలు కొత్త స్కీములు కూడా అమలు చేశామని, దళిత బంధు మొదలైనవాటిని ఆయన ఉదహరించారు. ఈసారి పాతవాటికే కొనసాగింపుగా హామీలు ఇస్తూ, ఉద్దీపనలు ఉంటాయని చెప్పారు. ఉదాహరణకు రైతు బంధు పథకం కింద ఇంతవరకు ఎకరాకు రెండు దఫాలుగా పదివేల రూపాయలు చొప్పున ఇస్తుండగా, ధానిని క్రమేపీ పదహారువేలకు తీసుకు వెళతామని అన్నారు. అధికారంలోకి మళ్లీ వచ్చిన వెంటనే దీనిని పన్నెండువేలు చేస్తామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ పదిహేనువేలు ఇస్తామని వాగ్దానం చేస్తే కేసీఆర్ మరో వెయ్యి అదనంగా ఇస్తానంటున్నారు.



ఏదైనా దశల వారీగా చేస్తామని ప్రకటన

ఈసారి ఆయన ఏ స్కీమ్ అయినా వెంటనే ఇంప్లిమెంట్ చేస్తామని చెప్పకుండా దశలవారీగా చేస్తామని ప్రకటించడం విశేషం. ఆర్థిక బారం రీత్యా ఇలా చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు వాగ్దానాలను కూడా దృష్టిలో పెట్టుకుని వివిధ స్కీములను కేసీఆర్ విస్తరిస్తున్నా, కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అర్హులైన పేదలకే అని షరతు చెప్పారు.

ఇక్కడ వైఎస్ జగన్ అభిమానులను ఆకట్టుకోవడానికి

ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వృద్ధాప్య పెన్షన్ స్కీమ్ ను ప్రశంసించడంలో కూడా వ్యూహం ఉన్నట్లు అనిపించింది. తెలంగాణలో ఉన్న వైఎస్ జగన్ అభిమానులను ఆకట్టుకోవడానికి ఆయన ఇలా చేసి ఉండవచ్చు. జగన్ మోహన్ రెడ్డి ఏపీలో పెన్షన్ ను రెండువేల నుంచి ప్రతి ఏటా కొంత పెంచుకుంటూ మూడువేల రూపాయలకు తీసుకువెళ్లి విజయవంతంగా అమలు చేస్తున్నారని అభినందించారు. అలాగే తెలంగాణలో పెన్షన్ ను ముందుగా మూడువేల రూపాయలు చేసి, ఆ తర్వాత ఏటా ఐదు వందల చొప్పున ఐదువేల రూపాయలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాలుగువేల రూపాయల పెన్షన్ అంటే కేసీఆర్ ఇంకో వెయ్యి పెంచారు. అర్హులైన మహిళలకు నెలకు మూడు వేల రూపాయల భృతి స్కీమ్ ను కూడా హామీ ఇచ్చారు. ఇది కూడ కాంగ్రెస్ తరహా స్కీమ్ అయినా, కొంత అదనంగా ఇస్తామని అంటున్నారు. కాకపోతే అర్హత అన్న షరతు పెట్టారు. అగ్రవర్ణ పేదలకు కూడా గురుకుల పాఠశాలలు ప్రతి నియోజకవర్గంలో పెడతామని కొత్తగా కేసీఆర్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ తాజాగా మహిళలకు స్కూటీలు ఇస్తామని ప్రకటించింది. ఇది కూడా ఖరీదైన వ్యవహారమే. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ పలు సంక్షేమ కార్యక్రమాలు మేనిఫెస్టోలో పెట్టి, అమలు చేయలేక ఇబ్బంది పడుతోంది. దానిని గమనంలోకి తీసుకుని కేసీఆర్ కొంత జాగ్రత్తపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు కర్ణాటకలో మాదిరి అన్నీ అధికారంలోకి రాగానే ఇచ్చేస్తామని ప్రకటించారు. నిజానికి అది చాలా కష్టం. అందుకే కేసీఆర్ ప్రజలకు నమ్మశక్యంగా ఉండేలా హామీలు ఇచ్చినట్లు అనిపిస్తుంది. అయినప్పటికీ కేసీఆర్ ఈ మేనిఫెస్టోకి ఎంత వ్యయం అవుతుందన్న దానిపై వివరాలు ఇవ్వగలిగితే బాగుండేది. తద్వారా ఈ వాగ్దానాల అమలు సాధ్యాసాధ్యాలు అందరికీ తెలిసేవి. రాజకీయ పార్టీలు వనరుల గురించి పట్టించుకోకుండా, హామీలు ఇచ్చేస్తూ ప్రజలను భ్రమపెట్టాలని ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ పై అదే విమర్శ రాగా, ఇప్పుడు బీఆర్ఎస్ కూడా ఆ కోవలోకే వెళ్లిందని చెప్పాలి. బీజేపీ వీటిలో ఎన్నిటిని కాపీ కొడుతుందో చూడాలి.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
ఆదివారం ॥ 22-10-2023

వైరల్

స్వాగతం.. సుస్వాగతం



రచయిత్రిగా కూడా మంచి మార్కులు కొట్టేసింది నటి ట్వింకిల్ ఖన్నా.'మిసెస్ ఫన్నీబోన్స్: 'పైజామాస్ ఆర్ ఫర్ గివింగ్' 'ది లెజెండ్ ఆఫ్ లక్ష్మీప్రసాద్' పుస్తకాలతో పాఠకులను అలరించింది. తాజాగా తన కొత్త పుస్తకం 'వెల్‌కమ్ టూ ప్యారడైజ్'ను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించింది. ట్వింకిల్ ఖన్నా లండన్‌లో ఫిక్షన్ రైటింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన తరువాత వస్తున్న పుస్తకం ఇది.

'ఈ పుస్తకంలోని క్యారెక్టర్లు గత అయిదు సంవత్సరాలుగా నా మనసులో తిరుగుతున్నాయి. నాకు మాత్రమే పరిచయమైన ఈ క్యారెక్టర్లు ఇప్పుడు మీకు కూడా పరిచయం కాబోతున్నాయి' అంటూ రాసింది ఖన్నా.

మానవ సంబంధాలు, ఎడబాట్లు, అనుబంధాలు, ఆప్యాయతలను ఆధారంగా చేసుకొని రాసిన ఈ పుస్తకం వచ్చే నెలలో విడుదల కానుంది. సామాన్య పాఠకుల నుంచి బాలీవుడ్ సెలబ్రిటీల వరకు సోషల్ మీడియాలో ఈ పుస్తకంపై కామెంట్స్ పెడుతున్నారు.

రజనీ చాయ్



సూపర్‌స్టార్ రజనీకాంత్
ఒక్కోసారి విసుగుపుట్టి
హిమాలయాలకు వెళుతుంటారు.
ఈసారి కొచ్చిన్‌లో
టీ అమ్ముకుంటున్నారా?
అవుననే కొంతమంది కంగారు పడ్డారు.
తీరా చూస్తే
'దక్కేది దక్కకుండా పోదు...
దక్కనిది ఎప్పటికీ దక్కదు'
అని డైలాగ్ కొడుతూ
తనకు దక్కిన టీ స్టాల్‌ను నడుపుకుంటున్న ఓ వ్యక్తి...
ఇంకేముంది... నెట్‌లో హల్‌చల్.

కొచ్చిన్‌లో ఏదో షూటింగ్ కోసం వెళ్లిన సినిమా యూనిట్ వారు అతణ్ణి చూసి ఆగిపోయారు. రజనీకాంత్! టీ అమ్ముతూ. రజనీకాంత్ సాధారణ జీవితాన్ని ఇష్టపడతాడని అందరికీ తెలుసు. కొంపదీసి టీ అమ్ముతున్నాడా? పరిశీలించి చూశారు. కాదు. రజనీకాంత్‌లానే ఉన్నాడు. పలకరిస్తే అచ్చు రజనీకాంత్ లానే నవ్వుతున్నాడు. పేరు సుధాకర్ ప్రభు. ఫోర్ట్ కొచ్చిన్ పట్టాలం రోడ్డులో 'వెంకటేశ్వర హోటల్' అనే ప్యూర్ వెజిటేరియన్ హోటల్ నడుపుతున్నాడు. లెమన్ టీ చేయడంలో దిట్ట. మొన్న మొన్నటి వరకూ ఎవరూ అతణ్ణి రజనీకాంత్‌తో పోల్చలేదు కాని ఈ మధ్య గెడ్డానికి రంగేయడం మాని, కళ్లద్దాలు మార్చేసరికి అచ్చు రజనీ గెటప్‌లోకి వచ్చేశాడు. నాదిర్‌షా అనే మలయాళం డైరెక్టర్ ఇతణ్ణి ఫేస్‌బుక్‌లో పెట్టేసరికి వైరల్ అయ్యాడు. అప్పటినుంచి ఇతని వీడియోలు వైరల్ అవుతున్నాయి. కేరళలో ఇతణ్ణి ఫంక్షన్స్‌కు కూడా ఆహ్వానిస్తున్నారు. 'మా పిల్లలు పెద్దగా పట్టించుకోరుగాని నేను రజనీ అన్ని సినిమాలు చూస్తుంటా' అంటాడు. ఈ పాపులారిటీ పెరిగి అతని హోటల్‌కు కస్టమర్లు పెరిగితే అదే పది వేలు.

బుల్లెట్ ఎక్కాలే తల్వార్ తిప్పాలే



నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఒక మహిళ గాల్లో తల్వార్ ఊపుతూ బుల్లెట్‌పై వీరవిహారం చేసింది. మరో మహిళ టాప్‌లెస్ జీప్‌ను ఒంటి చేత్తో డ్రైవ్ చేస్తూ మరో చేతితో తల్వార్‌ను గాలిలో ఝుళిపించింది. ఒక మహిళ స్కూటీ డ్రైవ్ చేస్తుంటే మరొక మహిళ వెనుక సీటులో నిల్చొని గాల్లో తల్వార్‌తో విన్యాసాలు చేసింది.

ఆ రాత్రి దుర్గామాత మండపం సమీపంలో మహిళలు చేసిన రకరకాల స్టంట్స్‌కు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ వీడియోలకు మిశ్రమ స్పందన లభించింది. కొందరు 'ఆహా ఓహో' అని అబ్బురపడితే మరికొందరు 'ఇలాంటి సాహసాలు తగవు' అని ఖండించారు.

ఇలా అయితే ఎలా..?



దివ్యాంగుల హక్కుల కార్యకర్త, మోడల్ విరాళీ మోదీ ఇటీవల ముంబైలో పెళ్లి చేసుకుంది. వీల్‌చైర్ యూజర్ అయిన తనకు రిజిస్ట్రార్ ఆఫీసులో ఎదురైన ఇబ్బందుల గురించి ఆమె ట్విట్టర్‌లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.

'రిజిస్ట్రార్ ఆఫీసు రెండో ఫ్లోర్‌లో ఉంది. లిఫ్ట్ సౌకర్యం లేదు. మెట్లు ఎక్కడం తప్ప మరో దారి లేదు. మరి వీల్‌చైర్ యూజర్ అయిన నా పరిస్థితి ఏమిటి? నా పరిస్థితి గురించి ఏజెంట్‌తో చెప్పి పంపాను. అధికారులు కిందికి రాలేదు. అలా అని నాకు ప్రత్యేక సౌకర్యాలేవీ కల్పించలేదు. ఇక మెట్ల మార్గం ఎలా ఉందంటే... మెట్లు పగుళ్లు బారి ఉన్నాయి. రెయిలింగ్ వదులుగా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. దివ్యాంగులకు పెళ్లి చేసుకునే హక్కు లేదా?' అని తన మనసులోని ఆవేదనను నెటిజనులతో పంచుకుంది విరాళీ.

'పబ్లిక్ స్పేస్, ప్రభుత్వ కార్యాలయాలలో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనే మాట నా చిన్నప్పటి నుంచి వింటూ ఉన్నాను. కాని అది ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు. దివ్యాంగుల కార్యకర్త పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటి?' అని ఒక యూజర్ స్పందించాడు.

సైకిల్ సవారీలో తాడాటకు సై



స్కిప్పింగ్ రోప్ (తాడాట) అనేది అసాధ్యమైనదేమీ కాదు. అందరూ చేసేదే. అయితే భోపాల్‌కు చెందిన డాన్సర్, ఆర్టిస్ట్ బుష్రా తాడాటను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఖాళీ రోడ్డు మీద సైకిలింగ్ చేస్తూనే తాడాట ఆడుతూ 'ఆహా' అనిపించింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్‌గా మారింది.

'సూపర్బ్ బ్రిలియెంట్ టాలెంట్' 'దిస్ ఈజ్ వెరీ రిస్కీ సిస్టర్. ప్లీజ్ బీ కేర్‌ఫుల్' ఇలా రకరకాల కామెంట్స్ కనిపించాయి.

ఔరా అండర్ వాటర్ గార్బా



నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గార్బా నృత్యాల సంబరం సహజమే. అయితే జయ్‌దీప్ గోహిల్ మాత్రం 'అండర్-వాటర్ గార్బా డ్యాన్స్'తో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఇంటర్‌నెట్‌లో ఈ అండర్ వాటర్ గార్బా డ్యాన్స్ వైరల్‌గా మారింది. కొన్నిరోజుల క్రితం 'నవరాత్రి ఇన్ హెవెన్' టైటిల్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో కూడా బాగా పాపులర్ అయింది. ఈ వీడియోలో 'రాధే రాధే' పాటకు అండర్ వాటర్ డ్యాన్స్ చేస్తూ కనిపించాడు జయ్‌దీప్.

అండర్-వాటర్ గార్బా డ్యాన్స్ విషయానికి వస్తే...'మాటలు చాలని అద్భుతం' అంటూ నెటిజనులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

జయ్‌దీప్ గోహిల్ పేరు వినిపించగానే 'అండర్-వాటర్ డ్యాన్సర్' అనే మాట వినిపిస్తుంది. అండర్-వాటర్ డ్యాన్సింగ్‌లో ప్రావీణ్యం సంపాదించడానికి ఎన్నో నెలల పాటు కష్టపడ్డాడు. చిన్నప్పటి నుంచి జయ్‌దీప్‌కు ఈత, నృత్యం అంటే ఇష్టం. ఇంజనీరింగ్ చేసిన జయ్‌దీప్ 9 టు 5 జాబ్ చేయాలనుకోలేదు. డ్యాన్సర్‌గా మంచి పేరు తెచ్చుకోవాలనుకున్నాడు. బ్రేక్ డ్యాన్స్ నుంచి హిప్-హాప్ వరకు రకరకాల డ్యాన్సులు నేర్చుకున్నాడు. ఇక మైకేల్ జాక్సన్ డ్యాన్స్‌లను అచ్చం అలాగే చేసేవాడు.

గిన్నిస్ బుల్లోడు

కోల్‌కతాకు చెందిన పదిహేను సంవత్సరాల అర్నవ్ దాగ ప్రపంచంలోనే పెద్దదైన ప్లేయింగ్ కార్డ్ స్ట్రక్చర్‌ను సృష్టించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. కోల్‌కత్తాలోని ప్రసిద్ధ నిర్మాణాలు రైటర్ బిల్డింగ్, షాహీద్ మినార్, సాల్ట్ లేక్ స్టేడియం, సెయింట్ పాల్స్ కేథడ్రల్ ఆధారంగా చేసుకొని ఈ నిర్మాణం చేశాడు. పని ప్రారంభించడానికి ముందు ఈ నాలుగు నిర్మాణాల దగ్గరకు వెళ్లి వాటి ఆర్కిటెక్చర్‌ను పరిశీలించాడు. ఈ స్ట్రక్చర్ కోసం 143,000 ప్లేయింగ్ కార్డ్స్‌ను ఉపయోగించాడు. టేప్, జిగురు ఉపయోగించకుండానే 40 అడుగుల ఎత్తుతో ఈ స్ట్రక్చర్‌ను సృష్టించాడు. దీనికోసం 41 రోజుల పాటు కష్టపడ్డాడు. 'పూర్తయి పోయింది అనుకున్న నిర్మాణం కొన్నిసార్లు హఠాత్తుగా కుప్పకూలిపోయేది. మళ్లీ మొదటి నుంచి పని మొదలు పెట్టాల్సి వచ్చేది. విసుగ్గా అనిపించేది. అయినా సరే కష్టపడేవాడిని' అంటున్నాడు అర్నవ్.

గతంలో బ్రియాన్ బెర్గ్ అనే వ్యక్తి 34 అడుగుల ఎత్తుతో ఉండే ప్లేకార్డ్ స్ట్రక్చర్‌ను సృష్టించాడు. బెర్గ్ రికార్డ్‌ను అర్నవ్ బ్రేక్ చేశాడు.



హెల్త్



చిన్నారుల్లో ఫిట్స్ (సీజర్స్) రావడం సాధారణంగా చూస్తుండేదే. ఇలా ఫిట్స్ రావడాన్ని వైద్యపరిభాషలో 'ఎపిలెప్సీ'గా చెబుతారు. పెద్ద వాళ్లతో పోల్చినప్పుడు పిల్లల్లో వచ్చే సీజర్స్‌కు కారణాలూ, చికిత్సకు వారు స్పందించే తీరుతెన్నులూ... ఇవన్నీ కాస్త వేరుగా ఉంటాయి. ఈ సీజర్స్‌లోనూ 'అబ్సెన్స్ సీజర్స్' అనేవి ఇంకాస్త వేరు. నాలుగేళ్ల నుంచి 14 ఏళ్ల వయసు పిల్లల్లో వచ్చే వీటి కారణంగా చిన్నారులు ఏ భంగిమలో ఉన్నా... ఉన్నవారు ఉన్నట్లుగానే వారు స్పృహ కోల్పోతారు. ఇవి పిల్లల్లో అకస్మాత్తుగా మొదలవుతాయి. హఠాత్తుగా వాళ్లను స్పృహలో లేకుండా చేస్తాయి. కనీసం 10 - 20 సెకండ్లు అలా ఉండిపోయి, మెల్లగా ఈలోకంలోకి వస్తారు. ఇలా హఠాత్తుగా కనిపించి, తల్లిదండ్రుల్ని ఆందోళనకు గురిచేసే 'అబ్సెన్స్ సీజర్స్'పై అవగాహన కోసం ఈ కథనం.

చిన్నారుల్లో వచ్చే 'అబ్సెన్స్ సీజర్స్' అంటే..?

పిల్లల్లో వచ్చే ఫిట్స్‌లో... అబ్సెన్స్ సీజర్స్ అనేవి కనీసం 20 నుంచి 25% వరకు ఉంటాయి. సాధారణంగా ఇవి జన్యుపరమైన (జెనెటిక్), జీవక్రియ పరమైన (మెటబాలిక్) సమస్యల వల్ల వస్తుంటాయి. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల్లో 'అబ్సెన్స్ సీజర్స్' కేసులు ఎక్కువగా వస్తుంటాయి. అసాధారణంగా కొందరు చిన్నారుల్లో ఏడాదిలోపు వయసున్నప్పుడు కూడా ఇవి మొదలు కావచ్చు. చాలా మంది ఆరోగ్యకరమైన పిల్లల్లో హఠాత్తుగా మొదలైనప్పటికీ... కొందరు చిన్నారుల్లో మాత్రం... వారికి జ్వరం వచ్చినప్పుడు కనిపించే ఫిట్స్‌తో ఇవి మొదలవుతాయి. అలాగే ఎదుగుదలలో లోపాలు (డెవలప్‌మెంటల్ డిలే) వంటి నాడీ సంబంధమైన సమస్యలున్న వారిలోనూ కనిపిస్తుంటాయి. ఇంక కొందరిలోనైతే... వాస్తవంగా కనుగొన్న నాటికి చాలా పూర్వం నుంచే... అంటే నెలలూ, ఏళ్ల కిందటి నుంచే ఇవి వస్తుంటాయి. కానీ తల్లిదండ్రులు (లేదా టీచర్లు) చాలా ఆలస్యంగా గుర్తిస్తారు. కానీ... వీటినంత తేలిగ్గా గుర్తించడం సాధ్యం కాకపోవడంతో పిల్లలేదో పగటి కలలు కంటున్నారనీ, ఏదో వాళ్ల లోకంలో వాళ్లు ఉన్నారంటూ తల్లిదండ్రులు, టీచర్లు, లేదా పిల్లల్ని చూసుకునే సంరక్షకులు పొరబడుతూ ఉండవచ్చు. సాధారణ సీజర్స్‌లో అవి వచ్చినట్లు తెలుస్తుంది. కానీ అబ్సెన్స్ సీజర్స్‌లో అవి వచ్చిన దాఖలా కూడా స్పష్టంగా తెలియదు. కొన్ని సందర్భాల్లో చాలాకాలం వరకూ తెలిసిరాదు.

ప్రేరేపించే అంశాలు...

ఈ 'అబ్సెన్స్ సీజర్స్'ను కొన్ని అంశాలు ప్రేరేపిస్తూ ఉంటాయి. అవి...
- తీవ్రమైన అలసట
- వేగంగా శ్వాస తీసుకోవడం
- పిల్లలు టీవీ, మొబైల్ చూస్తున్నప్పుడు తరచూ హఠాత్తుగా మారిపోతూ ఉండే కాంతిపుంజాలూ, ఫ్లాష్‌లైట్ల కారణంగా... అబ్సెన్స్ సీజర్స్ రావచ్చు.

అబ్సెన్స్ సీజర్స్ లక్షణాలు...

ఈ సందర్భాల్లో పిల్లలు...
- అకస్మాత్తుగా చేష్టలుడిగి (బిహేవియర్ అరెస్ట్‌తో) నిశ్చేష్టులై ఉండిపోవడం
- ముఖంలో ఎలాంటి కవళికలూ కనిపించకపోవడం
- కళ్లు ఆర్పుతూ ఉండటం, ఒంటి మీద బట్టలను లేదా ముఖాన్ని తడబాటుగా చేతి వేళ్లతో నలపడం, నోరు చప్పరించడం, మాటల్ని తప్పుగా, ముద్దగా ఉచ్చరిస్తూ ఉండటం (ఫంబ్లింగ్),
- చేస్తున్నపనిని అకస్మాత్తుగా నిలిపివేయడం / ఆపివేయడం
- బయటివారు పిలుస్తున్నా జవాబివ్వకపోవడం / ఎలాంటి స్పందనలూ లేకపోవడం
- పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తున్నప్పుడు వాళ్లు బయటకు పూర్తిగా నార్మల్‌గానూ కనిపించవచ్చు. మాట్లాడటం మాత్రం చాలావరకు నార్మల్‌గా ఉండిపోవచ్చు. కొందరిలో మాత్రం కొంచెం అస్పష్టత కనిపించవచ్చు.

ఈ లక్షణాలన్నీ వారు ఆటలాడుకుంటున్నప్పుడూ, టీవీ చూస్తున్నప్పుడూ లేదా కొన్నిసార్లు నిద్రలో కూడా కొనసాగుతుంటాయి. చిన్నారులు అన్యమనస్కంగా ఉండటమో లేదా ఏదో లోకంలో ఉన్నట్టు కనిపించడాన్ని తల్లిదండ్రులు గమనిస్తే వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి.

నిర్ధారణ ఇలా...

అబ్సెన్స్ సీజర్స్‌లో ఎన్నో రకాలున్నప్పటికీ... సాధారణంగా టిపికల్ (అంతగా సంక్లిష్టం కానివి), అటిపికల్ (సంక్లిష్టమైనవి) అనే రకాలు ఉంటాయి.
- ఎలక్ట్రో ఎన్‌సెఫలోగ్రామ్ (ఈఈజీ)
- ఎమ్మారై (బ్రెయిన్) వంటి మరి కొన్ని పరీక్షలతో వీటిని నిర్ధారణ చేయవచ్చు.

ఇక అటిపికల్ రకాల విషయంలో ఇతర నాడీ సంబంధమైన సమస్యలనూ, జీవక్రియలకు(మెటబాలిక్) సంబంధించిన, జన్యుసంబంధమైన మరికొన్ని పరీక్షలతో పాటు మెదడు / వెన్నుపూస చుట్టూ ఉండే ద్రవం (సెరిబ్రో స్పైనల్ ఫ్లుయిడ్ - సీఎస్‌ఎఫ్)ను పరీక్షించడం ద్వారా ఈ (అటిపికల్) రకాన్ని తెలుసుకుంటారు.

చికిత్స

సమస్య నిర్ధారణ అయిన వెంటనే చికిత్స మొదలుపెట్టాలి. ఇందుకోసం ఫిట్స్ మందులు (యాంటీ సీజర్ మెడిసిన్స్) వాడాలి. వీటిని కనీసం రెండేళ్ల పాటు వాడాల్సి ఉంటుంది. అలా వాడుతూ, బాధితుల మెరుగుదలను గమనిస్తూ, దాని ప్రకారం మోతాదును క్రమంగా తగ్గిస్తూ పోవాలి.

ఈ మందులు చిన్నారుల్లో... కేవలం ఫిట్స్ తగ్గించడం మాత్రమే కాదు, వాళ్ల జీవన నాణ్యతనూ మెరుగుపరుస్తాయి. స్కూల్లో వాళ్ల సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. సామాజికంగా ఒంటరి కాకుండా... నలుగురితో కలిసిపోయేలా చేస్తాయి. మందుల గుణం కనిపిస్తోందా లేదా అన్న విషయాన్ని నిర్ణీత వ్యవధుల్లో ఈఈజీ తీయడం ద్వారా పరిశీలిస్తూ ఉండాలి. ఇక సహాయ చికిత్సలు (సెకండ్ లైన్ ట్రీట్‌మెంట్)గా వాళ్లకు కీటోజెనిక్ డైట్ (కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారం) ఇవ్వడం, వేగస్ నర్వ్ అనే నరాన్ని ప్రేరేపించడం (వేగస్ స్టిమ్యులేషన్) జరుగుతుంది. దాదాపు 70 శాతం కేసుల్లో చిన్నారులు యుక్తవయసుకు వచ్చేనాటికి మంచి స్పందన కనిపిస్తుంది.

ఈ విషయం గుర్తుంచుకోండి...

పిల్లల్లో అబ్సెన్స్ సీజర్స్ రావడం వల్ల ఆ లక్షణాలతో వారికి ఎలాంటి ప్రమాదమూ ఉండదు. కానీ దీనికి తగిన చికిత్స తీసుకోకపోతే... భవిష్యత్తులో అది ఇతర రకాల ఫిట్స్‌కూ, ప్రవర్తనాపరమైన (బిహేవియరల్) లోపాలూ... (అంటే యాంగ్జైటీ, తరచూ మూడ్స్ మారిపోవడం, అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివ్ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) వంటి ఇతర మానసిక సమస్యలకూ దారితీయవచ్చు. కాబట్టి సమస్యను చూసిన వెంటనే పిల్లల నరాల నిపుణులను సంప్రదించడం ప్రధానం.



డా॥ శ్వేత రాంపల్లి,
కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్

ఫ్లూలాంటి జ్వరాలు... లక్షణాలూ, జాగ్రత్తలు

గత కొద్దికాలంగా జ్వరాలు, దగ్గు, జలుబుతో పాటు శ్వాస సరిగా అందకపోవడం వంటి ఫ్లూ లక్షణాలతో చాలామంది హాస్పిటళ్లకు పరుగులెత్తుతున్నారు. జ్వరం తగ్గాక కూడా పొడి దగ్గు, కొందరిలో కఫంతో కూడిన దగ్గు ఒక పట్టాన తగ్గకపోవడంతో ఆందోళన పడుతున్నారు. దాదాపు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. బాధితుల నుంచీ ఇవే కంప్లెయింట్స్‌తో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని చాలా ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి.

ఈ ఫ్లూ జ్వరాలు పెద్ద సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో ఇవి ఎందుకిలా వస్తున్నాయి, లక్షణాలేమిటి, ముందస్తు నివారణకూ లేదా ఇప్పటికే వచ్చి ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

ఇటీవల వస్తున్న ఫ్లూలాంటి జ్వరాలన్నింటికీ ఇన్‌ఫ్లుయెంజా, పారా ఇన్‌ఫ్లుయెంజా వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు ప్రధాన కారణమని వైద్య నిపుణుల భావన. రెండుమూడేళ్ల కిందట వచ్చిన కరోనా వైరస్ తాలూకు తీవ్రత బాగా తగ్గిపోయి, పెద్దగా ప్రమాదకరం కాని కోవిడ్ కూడా ఈ జ్వరాల కారణాల్లో ఒకటి కావచ్చునని కూడా వైద్య వర్గాలు భావిస్తున్నాయి. రాబోయేది చలికాలం కావడంతో ఇవే జ్వరాలు... దాదాపు వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని డాక్టర్లు అంచనా వేస్తున్నారు.

లక్షణాలు : దాదాపు ఫ్లూ జ్వరాల్లో కనిపించే అన్ని లక్షణాలూ ఈ సీజనల్ ఫీవర్స్‌లో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు...
- జ్వరం
- తలనొప్పి
- ఒళ్లునొప్పులు
- గొంతునొప్పి
- గొంతు కాస్త బొంగురుగా మారడం
- కొన్నిసార్లు (తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు) శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు. ఈ లక్షణాలు ఐదు నుంచి దాదాపు గరిష్ఠంగా పదిరోజులు ఉంటాయి.

నిర్ధారణ పరీక్షలు / చికిత్స

ముక్కు, గొంతు స్వాబ్‌తో కరోనా లేదా ఇతర ఇన్‌ఫ్లుయెంజా వైరల్ ఇన్ఫెక్షన్స్ ఉన్నాయా అని నిర్ధారణ చేయవచ్చు. తీవ్రత తక్కువగా ఉన్నవాళ్లకి (జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు లక్షణాలు గల వారికి) ఇంటివద్దనే లక్షణాలకు తగినట్లుగా పారాసిటమాల్, ఓఆర్‌ఎస్, దగ్గు సిరప్‌లతో చికిత్స అందించవచ్చు. తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి అంటే... విపరీతమైన దగ్గు, ఆయాసం, ఆక్సిజన్ తగ్గిపోవడం వంటి లక్షణాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులున్నవారిని హాస్పిటల్‌లో చేర్చి చికిత్స అందించాలి.



వీళ్లలో తీవ్రత ఎక్కువ...

ఇప్పటికే ఆస్తమా, దీర్ఘకాలిక లంగ్స్ సమస్యలు, బ్రాంకైటిస్, దీర్ఘకాలిక గుండెజబ్బులతో బాధపడేవారు, హార్ట్ ఫెయిల్యూర్, కరోనరీ ఆర్టరీ డిసీజ్ బాధితులు, దీర్ఘకాలిక కిడ్నీ/ లివర్ వ్యాధులున్నవారు, కొన్ని ఆటోఇమ్యూన్ డిసీజ్‌లతో బాధపడుతూ స్టెరాయిడ్ చికిత్స తీసుకుంటున్నవారూ, లుకేమియా, సికిల్ సెల్ ఎనీమియా ఉన్నవారు, వయోవృద్ధులూ వారితోపాటు ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు... వీళ్లందరిలోనూ లక్షణాల్లో తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, నిద్రలేమి, పల్స్ ఆక్సీమీటర్‌తో పరీక్షించినప్పుడు ఆక్సిజన్ శాచ్యురేషన్స్ తగ్గడం, ఆక్సిజన్ మోతాదుల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తుంటాయి. ఒక్కోసారి ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడి బాధితుల్ని ఆసుపత్రులకు తీసుకురావాల్సిన అవసరమూ ఏర్పడుతుంది.


నివారణ / జాగ్రత్తలు:
- దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ఎదుటివారిపై తుంపర్లు పడకుండా చేతి రుమాలు అడ్డుపెట్టుకోవాలి. చేతి రుమాలు లేనప్పుడు తమ ఫుల్ స్లీవ్స్‌లోకి తుమ్మడం మంచిది. దీని వల్ల వైరస్ లేదా వ్యాధిని సంక్రమింపజేసే సూక్ష్మజీవులు ఒకరి నుంచి ఒకరికి వ్యాపించవు. కరోనా సమయంలోలా వీలైతే జ్వరం, దగ్గు తగ్గేవరకు మాస్క్ ధరించడం మేలు.
- దగ్గు లేదా తుమ్మినపుడు చేతులను అడ్డుపెట్టుకున్నవారు, తర్వాత చేతుల్ని 20 సెకన్ల పాటు సబ్బుతో కడుక్కోవాలి లేదా శానిటైజర్ వాడాలి.
- దగ్గు/తుమ్ము సమయంలో ఒకరు వాడిన రుమాలును వేరొకరు ఉపయోగించకూడదు. దాన్ని తప్పనిసరిగా డిస్పోజ్ చేయాలి.
- జలుబు లేదా ఫ్లూ లక్షణాలున్న వ్యక్తులనుంచి దూరంగా ఉండాలి
- బాధితుల పక్క బట్టలను, పాత్రలను విడిగా ఉంచాల్సినంత అవసరం లేదుగానీ... వ్యక్తిగత పరిశుభ్రత కోసం ఒకరి బట్టలు, పాత్రలను మరొకరు వాడకపోవడమే మంచిది.
- బాధితుల్ని మిగతావారి నుంచి కాస్త విడిగా (ఐసోలేషన్) ఉంచటం మేలు.
- ఇన్‌ఫ్లుయెంజాకు, కోవిడ్‌కు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. వ్యాధి తీవ్రత తగ్గించడానికీ, హాస్పిటల్‌లో చేరికల నివారణకు వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది.

ఈ జ్వరాలు చాలావరకు పెద్దగా ప్రమాదకరం కావు. అరుదుగా ఎవరిలోనైనా పరిస్థితి మరీ తీవ్రంగా మారితే... తక్షణం బాధితుల్ని ఆసుపత్రికి తరలించాలి.



డా॥ వి. రాజమనోహర్ ఆచార్యులు,
సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్

ల్యాప్‌టాప్ సమస్యలకు ఉపశమనం ఇలా...



కొందరు వృత్తి, ఉద్యోగరీత్యా ల్యాప్‌టాప్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దాన్ని వాడే సమయంలో మెడ బాగా ముందుకు సాచి పనిచేయాల్సి ఉండటంతో మెడ ప్రాంతంలోని సెర్వికల్ డిస్క్‌లపై ఒత్తిడి పడుతుంది. నడుం దగ్గర ఉండే లంబార్ వెన్నుపూసల మీద కూడా ఒత్తిడి పడవచ్చు. ల్యాప్‌టాప్ కీబోర్డు ఫ్లాట్‌గా ఉండటంతో సాధారణ కంప్యూటర్ కీ-బోర్డుల్లా... వేళ్లు పూర్తిగా స్వేచ్ఛగా కదపడానికి అనువుగా ఉండవు. దీనివల్ల కూడా వేళ్లపై వేళ్లపై, మెడపై ఒత్తిడి పడుతుంది. అందుకే ల్యాప్‌టాప్‌లతో వచ్చే మెడనొప్పులూ, ఇతర సమస్యల నివారణకు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలివి...
- ల్యాప్‌టాప్‌ను బెడ్ మీద పెట్టి పని చేయకూడదు. ఎందుకంటే బెడ్ మీద ఉంచినప్పుడు మరింత ఎక్కువగా ముందుకు ఒంగాల్సి వస్తుంది. ఏదైనా ఎత్తు మీద లేదా బల్ల మీద పెట్టి వాడటం మంచిది.
- ల్యాప్‌టాప్‌పై చాలాసేపు పని చేయాల్సి వస్తే... దానికి మామూలు కీబోర్డు (అంటే... ఎక్స్‌టర్నల్ కీబోర్డు, మామూలు మౌస్) అమర్చుకోవడం మంచిది.
- ల్యాప్‌టాప్ మానిటర్‌ను కంటికి అనువుగా సరైన ఎత్తులో ఉంచుకోవడంతో పాటు లైటింగ్ కూడా కంటికి హాని చేయని విధంగా అడ్జెస్ట్ చేసుకోవాలి.
- ప్రతిసారీ కొద్ది నిమిషాల పాటు విశ్రాంతి (బ్రేక్) ఇవ్వడం మేలు.
- ల్యాప్‌టాప్‌ను చాలాసేపు ఒడిలో ఉంచుకుని పనిచేయకూడదు.

‘ఐదు’ ఎవరి ఖాతాలో..?

నేడు ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ పోరు

- నాలుగు విజయాలతో సమఉజ్జీలుగా ఇరు జట్లు
- గెలిచిన టీమ్ అగ్రస్థానానికి
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్షప్రసారం





కోహ్లి

ధర్మశాల: క్రికెట్ అభిమానుల కోసం మరో ఆదివారం అసలైన వినోదానికి రంగం సిద్ధమైంది. ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు విజయాలతో అజేయంగా సాగుతున్న జట్లు నేడు జరిగే పోరులో ముఖాముఖీ తలపడనున్నాయి. ప్రపంచంలోని అందమైన క్రికెట్ వేదికల్లో ఒకటైన ధర్మశాలలో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో టీమిండియా చెలరేగిపోతుండగా...ఫేవరెట్‌లుగా భావించిన ఇంగ్లండ్, ఆ్రస్టేలియాలను వెనక్కి నెట్టి గత రన్నరప్ న్యూజిలాండ్ ముందుకు దూసుకొచ్చింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని అందుకునేందుకు జరిగే ఈ పోరులో ఎవరిది పైచేయి కానుందనేది ఆసక్తికరం.

పాండ్యా స్థానంలో ఎవరు?

జోరు మీదున్న భారత్‌కు గత మ్యాచ్ తర్వాత అనూహ్య సమస్య వచ్చింది. గాయపడిన హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అతని స్థానంలో ఎవరిని ఎంచుకుంటారనేది కీలకంగా మారింది. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే నేరుగా షమీకి అవకాశం దక్కవచ్చు. అయితే బ్యాటింగ్ బలహీనంగా మారే అవకాశం ఉంది. దాంతో సూర్యకుమార్ లేదా ఇషాన్ కిషన్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. అలా చేస్తే శార్దుల్ ఠాకూర్ పూర్తి స్థాయిలో ఐదో బౌలర్‌గా తన బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. భారత బ్యాటర్లంతా మంచి ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. రోహిత్, కోహ్లి, గిల్, రాహుల్ అద్భుత ఆటతో కొనసాగిపోతున్నారు. రోహిత్, కోహ్లి దూకుడు భారత్‌కు మరో సారి గెలుపు అవకాశాలు సృష్టించగలదు. ఇప్పటి వరకు టీమిండియాకు లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌కు పరీక్షించే అవకాశం రాలేదు. కానీ కివీస్ బౌలర్లు చెలరేగితే వారు కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. బుమ్రా, సిరాజ్‌లతో పేస్ బౌలింగ్ పదునుగా ఉంది. కుల్దీప్‌ను ఒక్క ప్రత్యర్థి కూడా సమర్థంగా ఎదుర్కోలేకపోయాడు. జడేజా స్పిన్ కూడా కివీస్‌ను కట్టడి చేయగలదు.

అదే జట్టుతో...

మొదటినుంచీ కివీస్ నమ్ముకున్న సమష్టితత్వమే ఆ జట్టును గెలిపిస్తోంది. గత నాలుగు మ్యాచ్‌లలో కూడా అది కనిపించింది. ఒకరు విఫలమైతే మరొకరు ఆ బాధ్యతను తీసుకుంటున్నారు. అందుకే న్యూజిలాండ్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగనుంది. విలియమ్సన్, సౌతీ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌కూ దూరమయ్యాడు. కాన్వే, యంగ్ శుభారంభాలు అందిస్తుండగా రచిన్, లాథమ్ దానిని కొనసాగిస్తున్నారు. ఫిలిప్స్, చాప్‌మన్ మెరుపులు జట్టుకు భారీ స్కోరు అందిస్తున్నాయి. ఇక పేస్ బౌలింగ్ దళం చాలా పదునుగా ఉంది. బౌల్ట్, హెన్రీలను ఎదుర్కోవడం భారత్‌కు అంత సులువు కాదు. వీరితో పాటు ఫెర్గూసన్, సాన్‌ట్నర్ కూడా సత్తా చాటగలరు.

పిచ్, వాతావరణం

పిచ్‌పై కాస్త పచ్చిక ఉంటుంది. స్వింగ్, బౌన్స్‌కు మంచి అనుకూలం. పేసర్లకు సానుకూలాంశం. బ్యాటర్లు నిలదొక్కుకుంటే పరుగులు రావచ్చు. మ్యాచ్ రోజు చల్లటి వాతావరణం ఉంటుంది. వర్షసూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, జడేజా, శార్దుల్, షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, సాన్‌ట్నర్, హెన్రీ, ఫెర్గూసన్, బౌల్ట్

క్లాసెన్ కమాల్ ఇంగ్లండ్ ధమాల్

- క్లాసెన్ మెరుపు శతకం
- జాన్సెన్ సిక్సర్ల వర్షం
- ఇంగ్లండ్‌పై 229 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా భారీ విజయం

డిఫెండింగ్ చాంపియన్ ఆట ఇంతేనా అనిపించేలా... అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో చెత్త ప్రదర్శన చూపిస్తూ... ఇంగ్లండ్ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. కొత్త వ్యూహం, కీలక మార్పులతో బరిలోకి దిగి టాస్ నెగ్గిన అనుకూలతను కూడా సొమ్ము చేసుకోలేక చేతులెత్తేసింది. వన్డే వరల్డ్‌కప్‌లో టైటిల్ నిలబెట్టుకోవడానికి వచ్చిన జట్టు టి20లా 22 ఓవర్లకే ఆలౌట్ కావడమేంటి... కూన అఫ్గాన్ చేతిలో ఓడిన జట్టు ఇక ఆదమరిస్తే కుదరదని అన్నీ అస్త్ర శస్త్రాలకు పదును పెట్టి బలమైన ప్రత్యర్థితో సై అంటుంది. కానీ ఇంగ్లండ్ తీరు చూస్తే అస్త్ర శస్త్రాలన్నీ అటకమీద పెట్టి మైదానంలో ఏదోలా ఆడేందుకు వచ్చినట్లుగా అనిపించింది. మరో వైపు దక్షిణాఫ్రికా మాత్రం నెదర్లాండ్స్ చేతిలో ఓడిన చేదు అనుభవాన్ని మరచి కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగింది. బ్యాటర్ల బాధ్యత, అందరి బౌలర్ల సమష్టి కృషి వరల్డ్‌కప్‌లో సఫారీలకు అసాధారణ విజయాన్నిచ్చింది. ఈ గెలుపులోక్లాసెన్, జాన్సెన్ జట్టు హీరోలుగా నిలిచారు.



క్లాసెన్



బట్లర్



జాన్సెన్

ముంబై: ఇంగ్లండ్ డిఫెండింగ్ చాంపియన్‌లా ఆడలేదు. దక్షిణాఫ్రికాలాంటి పటిష్టమైన జట్టు చేతిలో సాదాసీదా క్రికెట్ కూనలా ఓడింది. బౌలింగ్‌లో విలాపం, బ్యాటింగ్‌లో వైఫల్యంతో ఇంగ్లండ్ చిత్తయింది. శనివారం జరిగిన ప్రపంచకప్‌లో పోరులో దక్షిణాఫ్రికా 229 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 399 పరుగుల భారీ స్కోరు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ హెన్రిచ్ క్లాసెన్ (67 బంతుల్లో 109; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) సునామీ ఆటతో సెంచరీ సాధించగా, రీజా హెండ్రిక్స్ (75 బంతుల్లో 85; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), మార్కో జాన్సెన్ (42 బంతుల్లో 75 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), వాన్‌డర్ డసెన్ (61 బంతుల్లో 60; 8 ఫోర్లు) చెలరేగారు. హెండ్రిక్, డసెన్ 116 బంతుల్లో 121 పరుగులు జోడించగా... క్లాసెన్, జాన్సెన్ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో 12.5 ఓవర్లలోనే 151 పరుగులు జత చేయడం విశేషం. 61 బంతుల్లోనే క్లాసెన్ సెంచరీ పూర్తయింది. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 22 ఓవర్లు మాత్రమే ఆడి 170 పరుగుకే కుప్పకూలింది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మార్క్ వుడ్ (17 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) తప్ప ఇంకెవరూ చెప్పుకునేంత స్కోరు, జట్టు పరువు నిలిపే పోరాటమైనా చేయలేకపోయారు. ప్రధాన బ్యాటర్లంతా విఫలం కాగా, చివర్లో వుడ్ పోరాటం ఆ జట్టు అట్టడుగునకు చేరకుండా ఆపింది. 400 పరుగుల లక్ష్యాన్ని చూడగానే భీతిల్లినట్లుగా ఇంగ్లండ్ బ్యాటింగ్ వరుస కునారిల్లింది. టాపార్డర్‌లో బెయిర్ స్టో (10), మలాన్ (6), రూట్ (2) కలిపి చేసిన స్కోరు 18 దాటలేదు. మిడిలార్డర్‌లో బ్రూక్ (17), బట్లర్ (15), విల్లీ (12) రెండంకెల స్కోర్లు చేశారంతే. టెయిలెండర్ అట్కిన్సన్ (21 బంతుల్లో 35; 7 ఫోర్లు) కొద్దిసేపు క్రీజ్‌లో నిలిచాడు. తాజా ఫలితంతో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలకు పెద్ద దెబ్బ పడింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) బట్లర్ (బి) టాప్లీ 4; హెండ్రిక్స్ (బి) రషీద్ 85; డసెన్ (సి) బెయిర్‌స్టో (బి) రషీద్ 60; మార్‌క్రమ్ (సి) బెయిర్‌స్టో (బి) టాప్లీ 42; క్లాసెన్ (బి) అట్కిన్సన్ 109; మిల్లర్ (సి) స్టోక్స్ (బి) టాప్లీ 5; జాన్సెన్ నాటౌట్ 75; కోయెట్జీ (సి) సబ్–లివింగ్‌స్టోన్ (బి) అట్కిన్సన్ 3; కేశవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (50 ఓవర్లలో 7 వికెట్లకు) 399. **వికెట్ల పతనం:** 1–4, 2–125, 3–164, 4–233, 5–243, 6–394, 7–398. **వికెట్ల పతనం:** 1–4, 2–125, 3–164, 4–233, 5–243, 6–394, 7–398. **బౌలింగ్:** టాప్లీ 8.5–0–88–3, విల్లీ 9–1–61–0, రూట్ 6.1–0–48–0, అట్కిన్సన్ 9–0–60–2, వుడ్ 7–0–76–0, ఆదిల్ రషీద్ 10–0–61–2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్ స్టో (సి) డసెన్ (బి) ఇన్‌గిడి 10; మలాన్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 6; జో రూట్ (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 2; స్టోక్స్ (సి) అండ్ (బి) రబడ 5; బ్రూక్ (ఎల్బీ) (బి) కోయెట్జీ 17; బట్లర్ (సి) డికాక్ (బి) కోయెట్జీ 15; విల్లీ (సి) రబడ (బి) ఇన్‌గిడి 12; ఆదిల్ రషీద్ (సి) హెండ్రిక్స్ (బి) కోయెట్జీ 10; అట్కిన్సన్ (బి) కేశవ్ 35; వుడ్ నాటౌట్ 43; టోప్లీ ఆబ్సెంట్‌హర్ట్ ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (22 ఓవర్లలో ఆలౌట్) 170. **వికెట్ల పతనం:** 1–18, 2–23, 3–24, 4–38, 5–67, 6–68, 7–84, 8–100, 9–170. **బౌలింగ్:** ఇన్‌గిడి 5–1–26–2, జాన్సెన్ 5–0–35–2, రబడ 6–1–38–1, కోయెట్జీ 4–0–35–3, కేశవ్ 2–0–27–1.

శ్రీలంకకు తొలి విజయం

- 5 వికెట్లతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన సమరవిక్రమ

లక్నో: ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాల తర్వాత ఎట్టకేలకు మాజీ చాంపియన్ శ్రీలంక ఖాతాలో తొలి గెలుపు చేరింది. గత మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించిన నెదర్లాండ్స్ ఈ సారి అదే జోరును కొనసాగించలేకపోయింది. శనివారం జరిగిన ఈ పోరులో లంక 5 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 49.4 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. సైబ్రాండ్ ఎంగెల్‌బ్రెట్ (82 బంతుల్లో 70; 4 ఫోర్లు, 1 సిక్స్), లోగన్ వాన్ బీక్ (75 బంతుల్లో 59; 1 ఫోర్, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 21.2 ఓవర్లలోనే హాలండ్ 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడగా...సైబ్రాండ్, వాన్ బీక్ ఏడో వికెట్‌కు 130 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్ల ధాటికి ఒక దశలో వరుసగా 20.4 ఓవర్ల పాటు డచ్ టీమ్ కనీసం ఒక్క ఫోర్ కూడా కొట్టలేకపోయింది. పేసర్లు మదుషంక, రజిత చెరో 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. లంక 26 వైడ్‌లు సహా మొత్తం 33 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం విశేషం. ఇందులో కీపర్ హెల్మెట్‌కు బంతి తగలడంతో ఇచ్చిన ఐదు పెనాల్టీ పరుగులు కూడా



ఉన్నాయి. అనంతరం లంక 48.2 ఓవర్లలో 5 వికెట్లకు 263 పరుగులు సాధించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సదీర సమరవిక్రమ (107 బంతుల్లో 91 నాటౌట్; 7 ఫోర్లు) చివరి వరకు నిలబడి జట్టును గెలిపించగా...పతుమ్ నిసాంక (52 బంతుల్లో 54; 9 ఫోర్లు), చరిత్ అసలంక (66 బంతుల్లో 44; 2 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వ (37 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.

స్కోరు వివరాలు:

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జీత్ (ఎల్బీ) (బి) రజిత 4; మ్యాక్స్ ఒ డౌడ్ (బి) రజిత 16; అకెర్‌మన్ (సి) మెండిస్ (బి) రజిత 29; డి లీడ్ (సి) పెరీరా (బి) మదుషంక 6; తేజ (ఎల్బీ) (బి) మదుషంక 9; ఎడ్వర్డ్స్ (బి) తీక్షణ 16; సైబ్రాండ్ (బి) మదుషంక 70; వాన్‌బీక్ (సి) అసలంక (బి) రజిత 59; వాండర్‌మెర్వ్ (సి) మెండిస్ (బి) మదుషంక 7; ఆర్యన్ దత్ (నాటౌట్) 9; మీకెరెన్ (రనౌట్) 4; ఎక్స్‌ట్రాలు 33; **మొత్తం** (49.4 ఓవర్లలో ఆలౌట్) 262. **వికెట్ల పతనం:** 1–7, 2–28, 3–54, 4–68, 5–71, 6–91, 7–221, 8–244, 9–252, 10–262. **బౌలింగ్:** మదుషంక 9.4–1–49–4, రజిత 9–0–50–4, కరుణరత్నే 9–1–58–0, తీక్షణ 10–0–44–1, హేమంత 8–0–42–0, ధనంజయ 4–0–13–0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) ఎడ్వర్డ్స్ (బి) మీకెరెన్ 54; పెరీరా (సి) డి లీడ్ (బి) దత్ 5; మెండిస్ (సి) మీకెరెన్ (బి) దత్ 11; సమరవిక్రమ (నాటౌట్) 91; అసలంక (బి) దత్ 44; ధనంజయ (బి) అకెర్‌మన్ 30; హేమంత (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం** (48.2 ఓవర్లలో 5 వికెట్లకు) 263. **వికెట్ల పతనం:** 1–18, 2–52, 3–104, 4–181, 5–257. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10–0–44–3, వాన్ బీక్ 10–0–57–0, మీకెరెన్ 8–1–39–1, డి లీడ్ 3–0–29–0, వాన్‌డర్ మెర్వ్ 9–0–42–0, అకెర్‌మన్ 8.2–0–39–1.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	4	3	1	6	2.212
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

నేటి నుంచి పారా ఆసియా క్రీడలు

- వారం పాటు ఈవెంట్
- 313 మందితో భారత బృందం



హాంగ్జౌ: ఇటీవల ఇక్కడే జరిగే ఆసియా క్రీడల్లో ముందెన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో పతకాలు సాధించిన భారత బృందంలాగే పారా అథ్లెట్లు కూడా గంపెడాశలతో పారా ఆసియా క్రీడలకు సిద్ధమయ్యారు. ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు జరుగనున్న ఈ పోటీల్లో భారత దివ్యాంగ అథ్లెట్లు సత్తాచాటాలని గట్టి పట్టుదలగా ఉన్నారు. గత టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన అవని లేఖరా, సుమిత్ అంటిల్‌లు భారత బృందాన్ని ముందుండి నడిపించనున్నారు. టోక్యోలో 2021లో జరిగిన మెగా ఈవెంట్‌లో స్టార్ షూటర్ అవని బంగారంతో పాటు కాంస్యం గెలిచింది. జావెలిన్ త్రోయర్ అంటిల్ కూడా పసిడి పట్టాడు. వీరితో పాటు పతకం ఆశలున్న పారా షూటర్ మనీశ్ నర్వాల్, షట్లర్లు ప్రమోద్ భగత్, కృష్ణ నగర్‌లు సహా మొత్తం 313 మందితో కూడా భారత పారా అథ్లెట్ల బృందం హాంగ్జౌలో పతకాల వేట మొదలుపెట్టేందుకు సై అంటోంది. మొత్తం 22 క్రీడాంశాలు నిర్వహిస్తుండగా భారత అథ్లెట్లు 17 క్రీడాంశాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సరిగ్గా వారం రోజుల పాటు జరిగే ఈ పారా మెగా ఈవెంట్‌లో 43 దేశాలకు చెందిన సుమారు 4000 మంది అథెట్లు పోటీపడనున్నారు. 22 క్రీడాంశాల్లో 566 గోల్డ్ మెడల్ ఈవెంట్లున్నాయి. తొలిసారిగా 2010లో గ్వాంగ్‌జౌలో పారా ఆసియా క్రీడలు జరిగాయి. ఇందులో భారత బృందం 14 పతకాలు సాధించి 15వ స్థానంలో నిలిచింది. 2018లో జరిగిన గత పారా ఈవెంట్‌లో భారత అథ్లెట్లు మొత్తం 72 పతకాలు సాధించి టాప్–10లో తొమ్మిదో స్థానంలో నిలిచారు. ఈ సారి పతకాల సెంచరీ మార్కు దాటించేందుకు భారత అథ్లెట్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. షూటింగ్‌లో క్రితం సారి మూడు పతకాలే వచ్చాయి. అయితే అవని జకార్తా (2018) ఈవెంట్‌లో ఆడలేదు. ఇప్పుడు స్టార్ షూటర్ అందుబాటులో ఉండటంతో షూటింగ్‌లోనూ పతకాల సంఖ్య ఆశించినంత పెరగొచ్చు.

మళ్లీ మరీన్ చేతిలో...

పీవీ సింధుకు మరో పరాజయం



ఒడెన్స్: పీవీ సింధు, కరోలినా మరీన్ మధ్య మంచి స్నేహం ఉంది. కోర్టులో ప్రత్యర్థులే అయినా కోర్టు బయట తమ సాన్నిహిత్యం గురించి వీరిద్దరు చాలా సార్లు చెప్పుకున్నారు. కానీ శనివారం ఇద్దరి మధ్య జరిగిన హోరాహోరీ పోరు అనూహ్య రీతిలో సాగింది. ఒక దశలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రత్యర్థిపై పైచేయి సాధించే క్రమంలో అరుపులు, కేకలతో పాటు పలు మార్లు ఇద్దరూ అంపైర్ల హెచ్చరికకు కూడా గురయ్యారు. అయితే చివరకు 73 నిమిషాల సమరం తర్వాత భారత షట్లర్ పరాజయం పక్షానే నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు ముఖాముఖీ రికార్డులో సింధు 5–10తో వెనుకబడి ఉండగా, ఇప్పుడు అది 5–11కు చేరింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీ డెన్మార్క్ ఓపెన్ సెమీ ఫైనల్లో సింధు ఓటమిపాలైంది. కరోలినా మరీన్ (స్పెయిన్) 21–18, 19–21, 21–7 స్కోరుతో సింధుపై విజయం సాధించింది.

ఇద్దరు ప్లేయర్లు తమదైన శైలిలో చెలరేగడంతో తొలి గేమ్ దాదాపు సమంగా సాగింది. విరామ సమయంలో సింధు 11–10తో ఒక పాయింట్ ముందంజలో ఉంది. ఆ తర్వాతా ఇదే కొనసాగి స్కోరు 18–18కి చేరింది. అయితే మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలుచుకొని గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం సింధు దూసుకుపోయింది. చకచకా పాయింట్లు సాధించిన ఆమె ఎక్కడా ఆధిక్యం తగ్గనీయకుండా 11–3కు చేరింది. అయితే ఆ తర్వాత ప్రతిఘటించిన మరీన్ వరుసగా పాయింట్లు గెలుచుకొని అంతరాన్ని తగ్గించింది. సింధు 20–16తో ముందంజలో నిలిచిన తర్వాత మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలవడంతో 20–19గా మారింది. కానీ స్మాష్‌తో పాయింట్ సాధించి సింధు గేమ్ గెలుచుకుంది. చివరి గేమ్ మాత్రం పూర్తి ఏకపక్షంగా మారిపోయింది. మరీన్ జోరు ముందు భారత షట్లర్ నిలవలేకపోయింది. ముందు 3–0, ఆపై 3–2...ఆ తర్వాత ఆమె జోరు సాగిపోయింది. వరుసగా 11 పాయింట్లు సాధించిన మరీన్ 14–2 దాకా వెళ్లింది. అనంతరం మ్యాచ్‌ను ముగించేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు.

మరీన్ అరుపులు... సింధు అసహనం

పాయింట్లు సాధించినప్పుడు అతిగా భావోద్వేగాలు ప్రదర్శించవద్దని అంపైర్ ఇద్దరినీ పిలిచి మ్యాచ్‌లో పలు మార్లు వారించాడు. అయితే మరీన్ తన అరుపులను ఆపకపోగా, సర్వీస్ అందుకునేందుకు సింధు ఎక్కువ సమయం తీసుకుంది. తొలి గేమ్‌ను మరీన్‌ను మళ్లీ అంపైర్ హెచ్చరించాడు. మూడో గేమ్‌లో సర్వీస్ ఆలస్యానికి సింధును అంపైర్ ప్రశ్నించగా...‘ఆమె అరిచేందుకు అవకాశమిచ్చారు కదా. ముందు ఆమెను ఆపమని చెబితే నేనూ సిద్ధంగా ఉంటా’ అని సింధు బదులిచ్చింది. మరొకరి కోర్టునుంచి షటిల్ తీసుకోవద్దని ఇద్దరికీ చెప్పాల్సి వచ్చింది. చివరకు అంపైర్ ఇద్దరికీ ‘ఎల్లో కార్డు’లు కూడా చూపించాల్సి వచ్చింది.

సినిమా

సరదా.. దసరా..



● ఈషా డియోల్, హేమా మాలిని, రాణీ ముఖర్జీ



● కాజోల్



● దులారీ ఖేర్, అనుపమ్ ఖేర్

బాలీవుడ్‌లో దసరా సందడి జోరు బాగా కనిపిస్తోంది. ప్రతి ఏడాదీ కొందరు స్టార్స్ ప్రముఖ ఏరియాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించే చోటుకి వెళ్లి, పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా కాజోల్, రాణీ ముఖర్జీ తప్పకుండా వెళుతుంటారు. ఈ ఏడాది కూడా ఈ ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. కాజోల్ తన తనయుడు యుగ్‌తో కలిసి వెళ్లారు. ఇంకా హేమా మాలిని, ఆమె కుమార్తె ఈషా డియోల్ తన తల్లి దులారీ ఖేర్‌తో కలిసి అనుపమ్ ఖేర్ తదితరులు దుర్గా మాత ఆశీస్సులు అందుకున్నారు.

సరిపోదా శనివారం?



● నాని

‘అంటే సుందరానికీ’ చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. అలాగే ఈ నెల 23న ఓ అప్‌డేట్, 24న ఈ సినిమా ప్రారంభోత్సవం జరపనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి ‘సరిపోదా శనివారం’ అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం.

మంగళవారం కోసం ఎదురు చూస్తున్నా!

– హీరో కార్తికేయ



● నందిత, స్వాతి, అజయ్ భూపతి, కార్తికేయ, పాయల్, అజ్మల్, సురేష్ వర్మ

‘‘ఆర్‌ఎక్స్ 100’ తర్వాత నేను, అజయ్ భూపతి లేదా నేను, పాయల్ ఎప్పుడు మళ్లీ సినిమా చేస్తామని అందరూ అడుగుతుంటే.. మంచి కథ కుదరాలని చెబుతూ వచ్చాను. వారిద్దరి కాంబినేషన్‌లో ‘మంగళవారం’ సినిమా చేస్తున్నట్లు వార్తలు చూసి, నన్ను వదిలేసి ఇద్దరూ సినిమా చేశారు అనుకున్నా (నవ్వుతూ). అజయ్ తన సొంతూరు ఆత్రేయపురంలో ‘ఆర్‌ఎక్స్ 100’ తీశాడు. ఇప్పుడు ఆ ఊరిని మరో విధంగా ‘మంగళవారం’లో చూపించాడు. 100 పర్సెంట్ అందరికంటే ఈ సినిమా కోసం నేనెక్కువ ఎదురు చూస్తున్నాను’’ అని హీరో కార్తికేయ అన్నారు. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ ఆమిర్ జంటగా అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం ‘మంగళవారం’. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించిన ఈ సినిమా నవంబర్ 17న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో చిరంజీవి సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో హీరో కార్తికేయ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ‘‘మంగళవారం’ మంచి డార్క్ థ్రిల్లర్. ఇందులో మహిళలకు సంబంధించిన పాయింట్‌ని టచ్ చేశాం. కార్తికేయ, నా కాంబినేషన్‌లో మరో సినిమా ఉంటుంది’’ అన్నారు. ‘‘మా నాన్నకు (నిమ్మగడ్డ ప్రసాద్), నాకు సినిమాలంటే ఇష్టం. సినిమా నిర్మించాలనే నా కల ‘మంగళవారం’తో నెరవేరింది’’ అన్నారు స్వాతీ రెడ్డి. ‘‘ఈ సినిమాతో నేను, స్వాతి నిర్మాతలుగా పరిచయమవడం గర్వంగా ఉంది’’ అన్నారు సురేష్ వర్మ. ‘‘నా కెరీర్ ఎటు వెళుతుందో తెలియని అనిశ్చితి ఉన్న సమయంలో ‘మంగళవారం’కి చాన్స్ ఇచ్చారు అజయ్‌గారు’’ అన్నారు పాయల్.

మేడమ్ అని కాకుండా సార్ అని పిలిచారు

– దర్శకురాలు పూజ



సంపూర్ణేష్ బాబు ప్రధాన పాత్రలో వీకే నరేశ్, శరణ్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘మార్టిన్ లూథర్ కింగ్’. పూజా కొల్లూరు దర్శకత్వంలో వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సమర్పణలో మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో పూజా కొల్లూరు మాట్లాడుతూ– ‘‘సైంటిస్ట్ లేదా ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకున్నప్పటికీ సినిమాతో సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని సినిమా రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నాను. తెలుగులో ‘మార్టిన్ లూథర్ కింగ్’ నా తొలి సినిమా. కానీ ఈ చిత్రం కంటే ముందు కొన్ని హాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో అసోసియేషన్ ఉంది. కొన్ని డాక్యుమెంటరీలు తీశాను. ఇక ‘మార్టిన్ లూథర్ కింగ్’ విషయానికి వస్తే.. వై నాట్ స్టూడియోస్ సంస్థ తమిళ చిత్రం ‘మండేలా’ కథను తెలుగులో చెప్పాలనుకుని, వెంకటేశ్ మహాగారిని సంప్రదించారు. అయితే నిర్మాణంలో భాగమౌతానని, దర్శకత్వం వహించలేనని ఆయన చెప్పారు. దీంతో నేను దర్శకత్వం వహిస్తానని వెంకటేశ్ మహాగారికి చెప్పడంతో ఆయన వారికి చెప్పారు. ఓటర్లు వారి ఓటు హక్కును ఎందుకు వినియోగించుకోవాలన్నది ఈ సినిమా థీమ్. ఓ సామాన్యుడు నటిస్తే ఎలా ఉంటుందో అలా ఉండాలని సంపూర్ణేష్‌ని హీరోగా తీసుకోవడం జరిగింది. వెంకటేశ్ మహా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ ఇచ్చారు. నేను ఎడిటింగ్ కూడా చేశాను’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘ఏ భాషలోనైనా మహిళలకు అవకాశాలు తక్కువగానే ఉంటున్నాయి. నేను లేడీ డైరెక్టర్‌ని అయినా సెట్స్‌లో చాలాసార్లు ఓకే సార్ అన్నారు కానీ మేడమ్ అనలేదు. అంటే లింగ వివక్ష ఎంతలా నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. సమస్య ఉన్నప్పటికీ మన పట్టుదలే మనల్ని ముందుకు నడిపిస్తుంది’’ అని చెప్పుకొచ్చారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



● పూజిత, విరాజ్

‘బేబి’ సినిమా ఫేమ్ విరాజ్ అశ్విన్ హీరోగా నటించిన చిత్రం ‘జోరుగా హుషారుగా’. అను ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పూజిత పొన్నాడ కథానాయిక. నిరీష్ తిరువీధుల నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, దర్శకుడు కృష్ణ చైతన్య, పలువురు పాత్రికేయులు విడుదల చేశారు. అను ప్రసాద్ మాట్లాడుతూ– ‘‘యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ‘జోరుగా హుషారుగా’. యువ తరానికి నచ్చే అంశాలతో అన్ని భావోద్వేగాలతో రూపొందించిన చిత్రం ఇది. కొత్తదనం ఆశించే ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది’’అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కాపు (డైరెక్ట్): 40, లేట్ మ్యారేజ్, 5'8", B.Com, బిజినెస్ చేస్తున్న వెల్ సెటిల్డ్ వరునికి మంచి సంప్రదాయ వధువు కావలెను. Ph: 7032918043 [H-793601]

హిందూ/మాల/SC/Any/45/5'6"/PG/ 1st మ్యారేజ్ హైదరాబాద్ బాగా స్థిరపడిన వరునికి 1st మ్యారేజ్ వధువు కావలెను. No Brokers. Ph: 8500813885 [H-793371]

CNB/విడోయర్/36/5'6"/ Business/ 40,000/-pm పిల్లలు గల వరునికి తగిన సాంప్రదాయ వధువు కావలెను (డైరెక్ట్). Ph: 7995032262 [H-793513]

బ్రాహ్మణ: 2వ పెళ్లి/గుడ్ లుకింగ్ & ఫ్యామిలీ/ 45/5'10"/ MBA, BE/ SWE/6LPM/ కోట్ల ఆస్తి గల వరునికి 1st మ్యారేజ్ బ్రాహ్మణ వధువు కావలెను. Ph: 8367619529/ 9515349877 [H-793601]

SC మాల & క్రిస్టియన్/M.Tech(EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/80,000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14007]

రెడ్డి/కుల ప్రసక్తి లేదు/36 సం॥/5'5"/ వ్యవసాయం/5 ఎకరాల భూమి/ సంవత్సరానికి 6 లక్షల ఆదాయం గల అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. Ph: 9441039962 [HA-14007]

రజక/కట్న ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14007]

రజక: B.Tech/Software Design Engineer/ 22 Lacs PA/ 5'9" ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7013449343 [H-12505]

కాపు: 49/5'8"/B.Sc, 5L.PA, 2Cr. ప్రాపర్టీ, బాగా స్థిరపడిన బాదరబందీ లేని లేట్ మ్యారేజ్ వరునికి కాపు వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. (Reg. ఫీజులేదు). Ph: 9573943211, 9849555464. [H-12505]

రెడ్డి/32y/5'10"/MBBS/3 Lak PM/200Cr ప్రాపర్టీ/Well Settled వరుడికి B.Tech/ M.Tech/MBBS వధువు కావలెను. No Brokers డైరెక్ట్. Ph: 8019468462/8897213126 [H-793419]

40 సం॥ వయసు కలిగి, అవివాహితుడైన PG చదివిన 5.7" ఎత్తు, 25 లక్షల ఆదాయం, హైదరాబాద్‌లో సెల్ఫ్ ఎంప్లాయి వరునికి వధువు కావలెను. సం॥ 9985637279 [WB-30813]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech (Business) 1995/6'/150Cr *1994/5'10"/100Cr *1997 / 5'11" / 100Cr * 1997/6'/400Cr *1995/5'8"/250Cr. * Cont: K.C. Reddy /Ph: 9849321309/ 9347807015

Reddy/Business/ B.Tech/ 1991 /6'/ 80Cr *1988/5'8"/200Cr * 1994/5'11"/150Cr *1995/ 5'10"/80Cr *1994/5'11"/250Cr. * Cont: K.C. Reddy/Ph: 9849321309/9347807015

Reddy/Business/B.Tech/MBA/1995/6'/100 Cr *1991/5'11"/200Cr *1990/6'/1000Cr *1989/ 5'11"/500Cr *2001/5'8"/1000Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015

Reddy/MBBS/MD/DM/MCH *1995/ 5'10"/ 400Cr*1994/5'10"/75Cr *1993/ 5'10"/50Cr *1989/5'9"/30Cr *1990/ 5'11"/100Cr. * Cont: K.C. Reddy / Ph: 9849321309/9347807015

Reddy/USA Doctor *1990/6'/50Cr *1991/5'10"/ *1989/5'9"/* 1992/5'11"/ *1998/5'8" *1995/5'8" *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/IIT/BITS/INDIA *1996/5'7"/50 L/yr*1992/5'11"/40L/yr *1992/5'9"/85L/yr * 1992/5'7"/60L/yr *1995/5'10"/22L/yr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech (IIT)/MS/USA *1995/5'7"/ 300K * 1991/5'10"/200Cr *1995/6'/200 K/20Cr *1992/5'11"/400K *1992/6'/330K. *Cont: K.C. Reddy -Mar-Bureau-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1991/5'11"/ 200Cr *1994/5'10"/150Cr *1997/5'9"/60Cr * 1995/5'9"/50Cr *1991/5'7"/60Cr. * Cont: K.C.Reddy-Hyd- Ph:9849321309/ 9347807015

Reddy/(Divorcee) B.Tech/MBA *1981/ 5'8"/ 500Cr *1989/5'9"/300Cr *1994/ 5'9"/ 300Cr *MBBS/ MD/ 1994/ 5'9"/50Cr. * Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309

Reddy/Catholic * B.Tech/1996/5'9"/ 1000 Cr *MS/H1/USA/1994/5'9"/100K *1986/ 5'7"/ 150K *Div.B.Tech/MBA/ 1987/ 5'11"/ 25L/yr. * Cont: K.C. Reddy- Hyd-Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/B.Tech/1994/5'5"/15 Cr * 1994/ 5'6"/ 100Cr * 1995/5'8"/100Cr *MS/ 1994/ 5'3"/ 200Cr *1999/5'8"/15Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/1996/5'7"/50Cr *1995/ 5'5"/120Cr *1995/5'5"/70Cr *1993/ 5'3"/ 500Cr *1997/5'4"/150Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1996/5'4"/30Cr * 1998/ 5'5"/ 100Cr *1996/5'7"/40Cr *1995/ 5'7"/ 10Cr *1998/5'4"/30Cr. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/Only Daughter/V.Big Business/ Hyd/ 1996/ 5'4" / Most Beautiful/Needs India or USA * Cont: K.C. Reddy- Ph: 9347807015

Reddy/B.Tech/1993/5'6"/50Cr *1990/5'4"/ 50Cr *1992/5'4"/25Cr *1996/5'5"/100Cr/ 1993/5'7"/100Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech /1992/ 5'31 / 2"/40Cr/ *BA/1988/5'3"/200Cr *B.Tech/1990/ 5'3"/ 50Cr *1987/5'5"/100Cr. * Cont: K.C. Reddy. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG *1995/ 5'5" / 100Cr *1994/5'6"/100Cr *1998/5'7"/50Cr *1997/ 5'6"300Cr *1996/5'5"/70Cr * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1994/5'4"/10 Cr *1997/5'5"/10Cr *1997/5'8"/12Cr *1998/ 5'4"/30Cr *1996/5'5"/15Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/(Divorcee) B.Tech/ 1988/ 5'6"/ 50Cr *1985/5'5"/400Cr *1993/5'4"/10Cr *1991/5'4"/10Cr * MD/1994/5'5"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/(Divorcee)USA/B.Tech/1995/5'5"/8Cr *1993/5'7"/15Cr *1986/5'6"/30Cr * 1991/5'4"/10Cr * MD/1992/5'3"/9Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

[D-528]

ఆర్యవైశ్య /46yrs / 5'.5"/ బిజినెస్,జాబ్/ 30Cr స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను.(డైరెక్టు కాంటాక్ట్, నో బ్రోకర్స్). 9182161015, 7680872085. [T-2309]

కాపు, CNB, 31, 5'9", M.Tech, 200 Cr. ఆస్తి, సొంత వ్యాపారం గల అందమైన వరునకు Any PG డాక్టర్ / Any PG ఇంజినీర్ వధువుగా కావలెను. డైరెక్ట్. 96429 57888 [B-788038]

★

అమ్మాయి కావలెను 1వ అన్ని కులాలు కోమట్ల అబ్బాయి 35, M.Sc., M.Ed., ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం 20 వేలు, ఆస్తి 40 లక్షలు, నల్లగొండ. : 9121325068 [Y-772547]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి New York, BE, MS, 27, 100 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Motati, LLB, 30, 5' 7", Dy Manager, 25 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", SWE, 120 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, Degree, 28, 5' 8", 50 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Dallas, BE, MS, 26, 5' 7", SWE, 170 K, 40 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", SWE, 9.4 L P/A, 3 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 4", SWE, 180 K, 7 Crores, H1, USA Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5'8", Data Engineer, 110 K, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి California, BE, MS, 29, 5' 11", Engineer, 200 Crores, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 30, 6' 1", 30 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Atlanta, BE, MS, 24, 5' 8", Robotic Engineer, 40 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce ISB, 49, 5' 6", Sr Consultant, 1.6 L P/M, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS, 24, 5' 5", Analyst, 75 K, H1, USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 29, 5' 4", SWE, 72 K, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 26, 5' 2", PG Doctor, 15 Crores, Hyderabad Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 32, 5' 4", SWE, 11 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★★

నో క్యాస్ట్, 35 టు 40 సం.లోపు, ఎత్తు 5'3" లోపు, 10th Pass, విడో / డైవర్సీ, పేద అమ్మాయి కావలెను. సంప్రదించండి నేను డైరెక్ట్ – 6301554541. [B-1210197]


రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రాపర్టీ Rs. 3L / PM గల వరుడికి డిగ్రీ చదివిన వధువు కావలెను. Cont: 94932 42896 [G-786001]

43y, 5'-4", SC హిందూమాల గవర్నమెంట్ జాబ్ 49 వేలు జీతం కలిగిన 2వ సంబంధం వరునికి విడో లేక 2వ సంబంధం వధువు కావలెను. డైరెక్టు సంప్ర: 8008344069 [G-779759]

వైశ్య 38y చాలా అందమైన స్థిరపడిన ఒంటరి వరుడికి బాగా స్థిరపడిన జాబ్ లేదా బిజినెస్ చేయు వధువు మాత్రమే కావాలి. కులము, వయస్సు పట్టింపు లేదు. డైవర్స్, విడో, పిల్లలు ఉన్నా ok. Whatsapp: 7653932778 [S-1195601]

క్రిస్టియన్ మాల 6 ft. ప్రైవేట్ జాబ్ వరుడుకి వధువు కావలెను. కులం, కట్నం పట్టింపు లేదు. విడోయర్స్, డైవర్సీ వారు కూడా నో బ్రోకర్స్. ఓన్లీ జెన్యూన్ కాల్ 9550913919 [Y-784385]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు: జాబ్, బిజినెస్ 2L P.M 5 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకి 1వ, 2వ, వరుడు కావలెను. ముఖాముఖి కల్పించి ఉచితంగా కుదుర్చబడును. ఇల్లరికం OK. సంప్ర: 9704477206 [H-793601]

2వ పెళ్లి: కుల పట్టింపు లేదు 36yrs/ B.Sc, B.Ed/ Govt టీచర్ 1 లక్ష (pm) సొంత ఇల్లు+కారు పిల్లలు లేని తెల్లని అందమైన వెల్ సెటిల్డ్ 50 కోట్ల ఆస్తి కలిగిన వధువుకి వరుడు కావలెను. సంప్ర: 8341454870 [H-793601]

36Yrs 2nd పెళ్లి Govt ఎంప్లాయ్ 2,50,000/-(pm) వెల్ సెటిల్డ్, కులప్రసక్తి లేని అందమైన వధువుకు వరుడు కావలెను (పిల్లలు ఉన్న OK) సంప్ర: 7386550413 [H-793601]

రెడ్డి/డైవర్సీ/29/5'4"/ B.Tech/ SWE/ 1.5L pm/ Own Plots & Business కోట్ల ప్రాపర్టీ గల పిల్లలులేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-793513]

కాపు/30y/ Fair/ M.Com/ గ్రూప్-2 ఆఫీసర్/90K p/m 4 ఎ॥ ఫాంల్యాండ్ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-793513]

రెడ్డి/25y/5'4"/ M.Tech/ SWE/ Hyd/ 18L P/A / Own House గల అందమైన ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9553652167 [H-793513]

FC/విడో/60/రిటైర్డ్ పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్ /వ్యవసాయ భూములు గల మంచి ఆర్థిక స్థోమత గల వెల్ సెటిల్డ్ వధువుకు స్నేహ స్వభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7416286926 [H-793371]

నాయుడు/60y/విడో/5'4"/Govt. Rtd/80 K/PM/2 సొంత ఇల్లు & రెంట్స్/50,000/- PM/ఆస్తి కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. పిల్లలు లేరు. Ph: 7780355650 [H-793371]

బ్రాహ్మణ/33y/5'2" ఇంటర్/29y/5'4"/ డిగ్రీ/అందమైన వధువులకు వరులు కావలెను/రిటైర్/Pvt, Govt జాబ్ & పురోహితం అయినా OK. Ph: 9110723130 [H-793371]

కమ్మ/విడో/58y/5'5"/V.Fair/Govt Job/సొంత ఇల్లు & రెంట్స్/బిజినెస్/ఆంధ్రాలో పొలాలు/2 L / PM గల ఏ బాదరబందీలేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-793371]

SC మాల/ B.Tech / C.Govt. Jr. ఇంజినీర్/రైల్వే/70,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14007]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc '27/5'4"/MBA '30/5'3"/ B.Sc '27/5'2"/ఇంటర్ '32/5'2"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/పురోహితులకు మ్యాచెస్ త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14007]

రెడ్డి విడో: కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ A:30, Height:5.4/Own బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికమైన ఓకె) Ph: 9515673252 [H-12505]

రెడ్డి డాక్టర్: 28. *B.Tech, 26. *PG, 29, జాబ్ *డిగ్రీ 29, డివోర్స్ *USA, డివోర్స్, 32 *డాక్టర్ డివోర్స్ 36. *విడోస్, 40, 45, 51(హై ప్రొఫైల్) *రెడ్డి వధువుల కోసం కాంటాక్ట్ Ph: 6304826162 [H-12505]

వైశ్య/38y/5'5"/Own బేకరీ/1 లక్ష నెలకు/50Cr ప్రాపర్టీ పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8019484384, 7396608019 [H-793419]

కమ్మ/50y/5'4"/సొంత బట్టల షాపు/2 లక్షలు నెలకు, 10Cr ప్రాపర్టీ Widow వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు మ్యారేజ్ బ్యూరో. Ph: 7396608019, 8019484384 [H-793419]

రెడ్డి/26y/5'6"/M.Tech/Fair/200Cr Well Settled వధువుకి వరుడు కావలెను India/ Abroad Any Match డైరెక్ట్ No Brokers. Ph: 8019468462, 8897213126 [H-793419]

కమ్మ/26/ 5''3/10th/29/ఇంటర్/ వధువులకు, కమ్మ వరులు కావలెను. బిజినెస్/ ప్రైవేట్‌జాబ్/ OK. సంప్రదించండి: 89855 80896 [L-798861]

★

29 Years, Divorced, Kapu Reddy Beautiful CA, 15-LPa, Hyderabad based Upper Middle Class family looking for a suitable match. Please contact (080-69070640) [HA-6326]

36 Years Brahmin never married, LLB, Hyderabad based, middle class family, looking for a suitable match (caste no bar and also open for divorce). Please contact (080-69103122) [HA-6327]

30 Years beautiful Padmashali, Graduated, working in MNC, Hyderabad based family looking for a suitable match. Please contact (080-69070619) [HA-6328]

31 Years, Divorced, Graduate, Beautiful Girl, Kamma, 5'9", Business Women, Hyderabad based Upper Middle Class Family looking for a suitable match Please contact (080-69070618) [HA-6325]

★★

ఆదర్శవంతమైన ఆధ్యాత్మికమైన కాపు వరుడు కావలెను. అందమైన విద్యావంతురాలైన ఐశ్వర్య వంతురాలైన 26 సం॥ విశాఖపట్నం మూగ వధువుకి. Cell: 7032375388, 8341014640 [S-771169]

కాపు లేట్‌మ్యారేజ్ 5'-2" Age: 50 సం॥ 1వ, 2వ మ్యారేజ్ OC ఏదైన జాబ్, బిజినెస్, అగ్రికల్చరల్ స్థిరాస్తి కలిగిన వరుడు కావలెను. డైరెక్టు 7207614063 [G-601017]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాలవారికి త్వరగా కుదుర్చబడును స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-793513]

విజయ దశమి శుభాకాంక్షలు. ఉదయ్ మ్యారేజ్ బ్యూరో TM Est 1995, గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, 1st/2nd పెళ్లి/వరుడు సంబంధాలకు సంప్ర: S.రామ గౌడ్ డీలక్స్ కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S. నారాయణగౌడ్ 8790690309 [H-793374]

హై/రిచ్/ఎలైట్ సాఫ్ట్‌వేర్, డాక్టర్, టాప్ బిజినెస్, NRI, ఉన్నత ప్రొఫెషనల్ మ్యాచెస్. అన్ని కులాల మొదటి, సెకండ్ అంత్య పెళ్లి సంబంధాలు చూడబడును. రిజిస్ట్రేషన్ కోసం వాట్సప్. Ph: 9347668696 చేయండి. [H-12505]

మైత్రి రెడ్డి మ్యారేజ్ బ్యూరో 5Cr to 500Cr Only High Profiles Local/ Abroad/ Political Doctors Matches చూడబడును. G.S.Reddy. Ph: 8897213126, 8019468462 [H-793419]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14008]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-189422]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10275]

18 సం.ల అనుభవం. జాతక లగ్నంలో వివాహ సమస్య-పరిష్కారములతో సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, NRI,Govt., రిచ్ వార్కి పెళ్లి సంబంధాలు ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ఒక నమ్మకం. నమో వెంకటేశాయ. 7093722724. [T-1953]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704655103, 9533608887 (Whatsapp). [HA-546]

కుల పట్టింపులు లేని 1,2 & Late వరునికి / వధువుకు & ఇంకా పెళ్లికాని (రెడ్డి కులం) వరులకు & పేదింటి వధువులకు పెళ్లి సంబంధాలు చూడడం మా ప్రత్యేకత. Ph: 8019965137 / 8121065137 [H-788389]

★★

హిందూ, క్రైస్తవ, మాలల వివాహ పరిచయ వేదిక కళ్యాణ మాల 14-10-2023 శనివారం ఉ. 10 గం. నుండి 2 గం. వరకు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, రామారావుపేట, కాకినాడ. ☎ 9440515049 [B-788195]

హార్టీకల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని 11 ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హార్టీసెట్–2023లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా బీఎస్సీ హార్టీకల్చర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌కు 300 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ టి.జానకీరామ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉద్యాన విద్యకు ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. వర్సిటీ పరిధిలోని నాలుగు ప్రభుత్వ ఉద్యాన కళాశాలలు, ప్రైవేటు యాజమాన్యంలోని నాలుగు అనుబంధ ఉద్యాన కళాశాలల్లో హార్టీసెట్ ద్వారా బీఎస్సీ హార్టీకల్చర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి మొత్తం 92 సీట్లు కేటాయించారు. ప్రభుత్వ ఉద్యాన కళాశాలల్లో 52 సీట్లు, ప్రైవేటు ఉద్యాన కళాశాలల్లో 40 సీట్లకు ఈ కౌన్సెలింగ్ జరిగింది.



బీఎస్సీ హార్టీకల్చర్‌లో సీటు పొందిన విద్యార్థినికి పత్రాలు అందజేస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్

రెచ్చిపోయిన 'చంద్రదండు' ప్రకాష్

- తన భూమిలోంచి గ్రావెల్ తోలారంటూ ఆర్ అండ్ బీ ఈఈపై దాడి
- చొక్కా చించి, కాళ్లతో తన్నే యత్నం
- అడ్డొచ్చిన అధికారులపైనా దాడి
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



ప్రకాష్ నాయుడుపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి వస్తున్న ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రసాద్‌రెడ్డి

అనంతపురం క్రైం: టీడీపీ నేత 'చంద్ర దండు' ప్రకాష్‌నాయుడు రెచ్చిపోయారు. రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) ప్రసాద్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. ఈఈ ప్రసాద్‌రెడ్డి శనివారం ఉదయం అనంతపురంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఉన్నారు. చీఫ్ ఇంజినీరుతో సమావేశం ఉండటంతో అందుకు సంబంధించిన రికార్డులు సరి చూసుకుంటున్నారు. 9.15 గంటలకు చంద్ర దండు ప్రకాష్‌నాయుడు ఈఈ ఉన్న గదిలోకి చొచ్చుకెళ్లారు. 'నా భూమిలోంచి గ్రావెల్ ఎలా తోలుతారు' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. సమస్య తన పరిధిలోకి రాదని, భూగర్భ గనుల శాఖ వాళ్లను అడగాలని.. ఈఈ చెబుతున్నా వినకుండా బూతులు తిడుతూ చొక్కా చించేంత పని చేశారు. కాళ్లతో తన్నబోయాడు. నిలువరించే ప్రయత్నం చేసిన తోటి ఇంజినీర్లపైనా దాడికి తెగబడ్డారు. ఈ క్రమంలో ఈఈ ప్రసాద్‌రెడ్డి తన గదికి తలుపులు వేసుకోగా.. వాటిని బద్దలు కొట్టి మరీ అధికారిని అసభ్య పదజాలంతో దూషించారు. ఎక్కడ గదిలోకి వచ్చి దాడి చేస్తాడోనని భయపడిన ఈఈ.. వెంటనే జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆయన ఆదేశాలతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సమస్య ఏదైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని ప్రకాష్‌నాయుడుకు పోలీసులు చెబుతుండగా.. 'రేయ్ ఈఈ.. నాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నీ ప్రాణాలు తీస్తా'నంటూ వారి ముందే బెదిరింపులకు దిగారు. ఈ తతంగాన్ని చిత్రీకరించే ప్రయత్నం చేసిన ఓ మీడియా ప్రతినిధి సెల్‌ఫోన్ లాక్కుని అతన్నీ బెదిరించారు. ఈఈ ప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నాయుడుపై కేసు నమోదు చేసినట్టు సీఐ శివరాముడు తెలిపారు.



ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో తలుపులు బాదుతున్న ప్రకాష్ నాయుడు

సీసీకెమెరాలో రికార్డ్

చంద్రదండు ప్రకాష్‌నాయుడుకు పుట్లూరు మండలం ఏ.కొండాపురం వద్ద భూమి ఉంది. అందులోంచి గ్రావెల్ తోలారని ప్రకాష్‌నాయుడు చెబుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేయాలంటే భూగర్భ గనుల శాఖ కార్యాలయానికి వెళ్లాలి. కానీ ఉదయం తొమ్మిది గంటలకే భార్యను వెంటబెట్టుకుని ఆర్ అండ్ బీ అతిథిగృహానికి చేరుకుని ఈఈ, అధికారులపై దాడి చేశారు. పైగా తన భార్యపై దాడి చేశారని, డ్రైవర్‌ను కులం పేరుతో దూషించారంటూ తప్పుడు ఫిర్యాదు చేసేందుకు యత్నించారు. కానీ పోలీసులు ఆ సమయంలో అక్కడే ఉండటం, ప్రకాష్‌నాయుడు దాడి దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో అతను చెబుతున్నవన్నీ అబద్ధాలేనని నిర్ధారణకు వచ్చిన పోలీసులు అతని ఫిర్యాదును స్వీకరించలేదు. కాగా, 'చంద్రదండు' ప్రకాష్‌నాయుడు తీరు ఆది నుంచీ వివాదాస్పదమే. ఇతనిపై గతంలోనే రౌడీషీటు కూడా తెరిచారు.

దేశంలోనే మిన్నగా.. ఏపీలో రొయ్యకు గిట్టుబాటు ధర

- ఏపీలో 100 కౌంట్ రూ.240 గుజరాత్, మహారాష్ట్రల్లో రూ.230
- ఏపీలో 30 కౌంట్ రూ.420, గుజరాత్, ఒడిస్సాల్లో రూ.380, మహారాష్ట్రలో రూ.400

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అప్సడా ద్వారా ప్రతి 10 రోజులకు ఒకసారి రొయ్యల ధరలను సమీక్షిస్తున్నాం. మార్కెట్‌లో హెచ్చుతగ్గులను గమనిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన ధర రైతులకు దక్కేలా పర్యవేక్షిస్తున్నాం.

– వడ్డి రఘురాం, కో–వైస్ చైర్మన్, అప్సడా

సాక్షి, అమరావతి: ఏపీలో 100 కౌంట్ రొయ్యలకు ప్రభుత్వం నిర్దేశించిన ధర కిలో రూ.210. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రాసెసింగ్ యూనిట్లు రూ.240–రూ.245 మధ్య కొనుగోలు చేస్తున్నాయి. ఇదే కౌంట్ రొయ్యలను గుజరాత్‌లో రూ.230కి కొనుగోలు చేస్తుండగా.. ఒడిశా, తమిళనాడులో కేజీకి రూ.240 చొప్పున చెల్లిస్తున్నారు. 30 కౌంట్ రొయ్యలకు ప్రభుత్వం నిర్దేశించిన ధర కిలోకు రూ.380. ప్రస్తుతం ప్రాసెసింగ్ యూనిట్లు రూ.420–రూ.430 మధ్య ధర చెల్లిస్తున్నాయి. ఇదే కౌంట్‌కు గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో మాత్రం కేజీకి రూ.380 మాత్రమే చెల్లిస్తున్నారు. ఇతర రాష్ట్రాలు రొయ్యల రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో ప్రాసెసింగ్ కంపెనీల నిర్ణయానికే వదిలేస్తుండగా.. ఒక్క ఏపీలో మాత్రమే గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ప్రతి 15 రోజులకు ఒకసారి అంతర్జాతీయ మార్కెట్‌లో రొయ్యల ధరల హెచ్చు తగ్గులను ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) ద్వారా సమీక్షిస్తూ రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఫలిస్తున్న ప్రభుత్వ చర్యలు

సంక్షోభ సమయంలో ఏ ఒక్క రైతు ఆర్థికంగా నష్టపోకూడదన్న ఉద్దేశంతో సీనియర్ మంత్రులతో గతేడాది అక్టోబర్‌లో ఆక్వా సాధికార కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ ప్రతినెలా సమావేశమవుతూ క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తోంది. ప్రతిరోజూ ప్రభుత్వం నిర్ధేశించిన ధరలు, మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న ధరలను సమీక్షించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించింది. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్‌తో కాల్‌సెంటర్ సైతం ఏర్పాటు చేసింది.

వివిధ రాష్ట్రాల్లో కౌంట్‌ల వారీగా శనివారం రొయ్యల ధరలు ఇలా.. (కిలోకు రూపాయల్లో)

కౌంట్	ఏపీ నిర్దేశించిన ధర	ఏపీలో చెల్లించిన ధర	ఒడిశా	తమిళనాడు	గుజరాత్
30	380	420	380	420	380
40	340	360	320	350	330
50	290	320	300	320	300
60	270	300	280	290	280
70	250	280	270	270	270
80	240	265	250	260	260
90	220	250	240	250	250
100	210	240	230	240	230



'అప్సడా' కో వైస్ చైర్మన్ పదవీకాలం పొడిగింపు



సాక్షి, అమరావతి: ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురాం పదవీకాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులిచ్చారు. ఆక్వా కల్చర్ కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో పాటు వాటికి చట్టబద్ధత కల్పించే లక్ష్యంతో అప్సడా చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. అప్సడాకు చైర్మన్‌గా సీఎం వ్యవహరిస్తున్నారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతుల సంక్షేమం కోసం రెండేళ్లుగా రఘురాం చేస్తున్న సేవలను గుర్తించిన సీఎం జగన్ ఈ పదవిలో మరో రెండేళ్ల పాటు కొనసాగే అవకాశం కల్పించారు. కంపెనీలు పెంచిన ఫీడ్ ధరలను 3 సార్లు ఉపసంహరించుకునేలా కృషి చేయడంలో రఘురాం క్రియాశీలకంగా వ్యవహరించారు. ప్రతీ 15 రోజులకోసారి రొయ్యల ధరల హెచ్చుతగ్గులను పర్యవేక్షిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కృషి చేస్తున్నారు. తాను ఈ పదవిలో కొనసాగేందుకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు తాను రుణపడి ఉంటానని రఘురాం పేర్కొన్నారు.

ఇంగ్లిష్ మీడియంపై పవన్ వ్యాఖ్యలు సరికాదు

రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకుల మండిపాటు



తాడికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో పేదలకు అందుతున్న ఇంగ్లిష్ మీడియంపై తాము అధికారంలోకి రాగానే కేసులు వేస్తామంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడం సరికాదని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం, తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,119వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శనివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అసలు పవన్ తన సీటు గెలుస్తాడో లేదో ఓసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. బహుజనులపై తప్పుడు కేసులు పెట్టినప్పుడు పవన్ కళ్యాణ్ మాట్లాడకపోవడం దేనికి నిదర్శనమో చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కరణం వెంకటేష్‌కు తీవ్రగాయాలు



చీరాల: చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం తనయుడు కరణం వెంకటేష్‌ను ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని బోయినవారిపాలెంలో చోటు చేసుకుంది. బోయినవారిపాలేనికి చెందిన మాజీ జెడ్పీటీసీ బోయిన వెంకన్న అనారోగ్యంతో మృతిచెందగా వెంకన్నకు నివాళి, కుటుంబాన్ని పరామర్శించేందుకు చీరాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బోయినవారిపాలేనికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఉన్న రైల్వేగేటు మూసి ఉండటంతో పార్టీ కార్యకర్త కోరిక మేరకు ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తుండగా 12 ఏళ్ల బాలుడు ఆటో నడుపుకుంటూ వేగంగా వచ్చి కరణం వెంకటేష్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో వెంకటేష్ కింద పడిపోగా చేతికి, కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వెంకటేష్‌ను అనుచరులు హుటాహుటిన కారులో ఒంగోలులోని సంఘమిత్ర హాస్పిటల్‌కు తరలించారు. కాలికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడి వెంకటేష్‌కు శస్త్రచికిత్స చేయించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు ఒంగోలు వెళ్లి వెంకటేష్‌ను పరామర్శించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష



కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం గిలకలదిండి వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

చెన్నై టూ సింగపూర్.. వయా వైజాగ్

విశాఖ మీదుగా త్వరలో రెండు క్రూయిజ్ షిప్ సర్వీసులు

- ఇటీవలే ప్రారంభమైన వైజాగ్ క్రూయిజ్ టెర్మినల్
- విశాఖ పోర్టు, చెన్నై, ట్యుటికోరిన్ పోర్టుల మధ్య కొనసాగుతున్న చర్చలు
- భారత్, శ్రీలంక, మాల్దీవుల మధ్య సర్వీసులు నడిపేందుకు ప్రణాళికలు
- రూ.1,200 కోట్లతో 3 వేల మందికి ఉపాధి కల్పించేలా ఒప్పందాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

విహార ప్రపంచానికి విశాఖ సరికొత్తగా కనిపించబోతోంది. విశాఖ మీదుగా పర్యాటక రంగంలో సేవలందించేందుకు రెండు క్రూయిజ్ షిప్పులు క్యూ కడుతున్నాయి. సాగర జలాల్లో హాయిగా విహరిస్తూ.. విశాఖ నుంచి ప్రపంచంలోని పలు నగరాలకు సర్వీసులు నడిపేందుకు లిట్టోరల్ క్రూయిజ్ సంస్థ సిద్ధమవుతోంది. విశాఖలో నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్ మీదుగా డిసెంబర్ నుంచి తొలి సర్వీస్ ప్రారంభించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. చెన్నై నుంచి సింగపూర్‌కి తొలి సర్వీసు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిన లిట్టోరల్.. ఈ క్రూయిజ్‌ని విశాఖ మీదుగా నడపాలని నిర్ణయించింది. మరోవైపు భారత్, శ్రీలంక, మాల్దీవుల్లో విహరించేలా మరో క్రూయిజ్ సర్వీస్ కూడా ప్రారంభం కానుంది. ఇప్పటికే టూరిస్ట్ క్రూయిజ్ షిప్‌ల ప్రతినిధులు విశాఖపట్నం పోర్టు అథారిటీ అధికారులతోపాటు కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పర్యాటక శాఖతో సంప్రదింపులు జరిపారు. అనుమతులు ఇచ్చేందుకు పోర్టు అంగీకారం తెలిపింది. త్వరలోనే సర్వీసుల వివరాల్ని ప్రకటించేందుకు చెన్నైకి చెందిన లిట్టోరల్ క్రూయిజ్ సంస్థ సన్నద్ధమవుతోంది.


విశాఖలోని క్రూయిజ్ టెర్మినల్


లిట్టోరల్ సంస్థకు చెందిన క్రూయిజ్ షిప్

రాష్ట్ర పర్యాటక శాఖతో చర్చలు

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, విశాఖ పోర్టు అథారిటీ సంయుక్తంగా విశాఖలో నిర్మించిన ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్‌ను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జల మార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభించారు. టెర్మినల్ అందుబాటులోకి రావడంతో.. క్రూయిజ్‌లో విహరించే వారికి సౌకర్యాలుంటాయన్న కారణంతో ఈ సర్వీస్‌ని విశాఖ మీదుగా నడపాలని భావించారు. ముంబైలో ఇటీవల ముగిసిన గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్ (జీఎంఐఎస్)–2023లో లిట్టోరల్ క్రూయిజెస్ లిమిటెడ్ ప్రమోటర్ రాజా వైజ్‌తోపాటు చెన్నైకి చెందిన వోక్ పోర్టు అథారిటీ, ట్యుటికోరిన్ పోర్టు ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనికి సంబంధించి విశాఖపట్నం పోర్టు ప్రతినిధులతో సంప్రదింపులు కూడా జరిగాయి. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజాతో లిట్టోరల్ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. చెన్నైని హోం పోర్ట్‌గా చేసుకుని రెండు విలాసవంతమైన నౌకలకు సంబంధించిన నిర్వహణను సులభతరం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

భారత్–శ్రీలంక–మాల్దీవులకు మరో సర్వీసు

రూ.1,200 కోట్ల పెట్టుబడితో భారత్–శ్రీలంక–మాల్దీవుల మధ్య మరో లగ్జరీ క్రూయిజ్ సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సర్వీసును కూడా లిట్టోరల్ సంస్థ నడపనుంది. వీలైనంత త్వరగా ఈ సర్వీసు కూడా విశాఖ మీదుగా ప్రారంభించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీనిద్వారా దాదాపు 3 వేల మందికి ఉపాధి అవకాశాలు కలిగే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు షిప్పులు పూర్తి లగ్జరీగా ఉంటాయని విశాఖపట్నం పోర్టు ప్రతినిధులు చెబుతున్నారు. ఒక్కొక్కటి 10 అంతస్తులుండే ఈ భారీ షిప్‌లో ఒకేసారి 1,200 నుంచి 1,500 మంది వరకూ ప్రయాణించవచ్చు. ఫుడ్ కోర్టులు, స్పెషాలిటీ రెస్టారెంట్లు, బార్లు, స్పా, సెలూన్, థియేటర్, నైట్ క్లబ్, స్విమ్మింగ్ పూల్స్, ఫిట్‌నెస్ సెంటర్లు, డీజే ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్ బ్యాండ్, అడ్వెంచర్ యాక్టివిటీస్, షాపింగ్ మాల్స్, లైవ్‌షో ఉన్నాయి. చిన్నారుల కోసం ప్రత్యేక ఫన్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. టికెట్ తీసుకున్న వారందరికీ షిప్‌లోని క్యాసినో వరల్డ్‌కు ఎంట్రీ ఉచితం. దీంతో పాటు లిక్కర్, ఇతర సర్వీసులకు అదనపు చార్జీలు ఉంటాయి.

రాష్ట్ర ఉద్యోగులకు డీఏ విడుదల

2022 జూలై 1నుంచి 3.64 శాతం డీఏ వర్తింపచేస్తూ ఉత్తర్వులు

- నవంబర్ 1 నుంచి డీఏ అమలు
- బకాయిలు మూడు విడతలుగా జీపీఎఫ్ ఖాతాలో జమ
- కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ మరో జీవో

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మరో రెండు హామీలను నెరవేర్చారు. దసరా పండుగకు 3.64 శాతం డీఏను విడుదల చేయడంతోపాటు రాష్ట్ర విభజన నాటికి ప్రభుత్వ శాఖల్లో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం రెండు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది. ఉద్యోగులకు వారి బేసిక్ పేలో 22.75 శాతం నుంచి 26.39 శాతానికి పెంచిన కరువు భత్యాన్ని 2022 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన కరువు భత్యం నవంబర్ 2023 నుంచి అమల్లోకి వస్తుందని, పెరిగిన డీఏను నగదు రూపంలో డిసెంబర్ జీతంలో అందుకుంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2022 జూలై1 నుంచి ఈ ఏడాది అక్టోబర్31 వరకు ఉన్న బకాయిలను మూడు దఫాలుగా జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు బకాయిల్లో 10 శాతం ప్రాన్ అకౌంట్‌లో జమ చేసి మిగిలిన 90 శాతం మూడు దఫాలుగా అందజేస్తారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఈ బకాయిలను జమ చేస్తారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, మునిసిపాల్టీలు, నగరపాలక సంస్థలు, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సమితులు, రివైజ్డ్ పేస్కేల్ 2022 కింద రెగ్యులర్‌గా జీతాలు అందుకుంటున్న వారు, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు అన్ని ఎయిడెడ్ విద్యాసంస్థల్లోని బోధన, బోధనేతర సిబ్బంది, యూనివర్సిటీల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి ఈ డీఏ పెంపు వర్తిస్తుంది. ఈ మేరకు ట్రెజరీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్ర విభజన జరిగిన తేదీ 2–6–2014కు ముందు వివిధ ప్రభుత్వ శాఖల్లో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను ఆయా శాఖల్లో ఖాళీల ఆధారంగా భర్తీ చేయాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ శాఖల్లోని నియామకాలకే ఇది వర్తిస్తుందని వివిధ పథకాలు, ప్రాజెక్టులు కింద పనిచేసే వారికి ఇది వర్తించదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయా శాఖాధిపతులు నిబంధనల ప్రకారం అర్హత కలిగిన కాంట్రాక్ట్ ఉద్యోగులను గుర్తిస్తూ ఉత్తర్వులు ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తూ డీఏతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాగా.. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ స్టేట్ కాంట్రాక్ట్ ఫార్మాసిస్ట్స్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రత్నాకర్‌బాబు, ప్రధాన కార్యదర్శి వీఎస్‌వీఆర్ కిషోర్ హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాల బానిసత్వానికి విముక్తి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'టీటీడీ కల్పించే సదుపాయాలనే ఉపయోగించుకోండి'

తిరుమల: కోవిడ్ సమయంలో ఆర్జిత సేవా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు ప్రస్తుతం అవకాశం కల్పించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ కొట్టివేసింది. ఆ సమయంలో ఆర్జిత సేవా టికెట్లు బుక్ చేసుకున్న మిగిలిన భక్తులకు కల్పించిన సదుపాయాలనే ఉపయోగించుకోవాలని పిటిషనర్లను ఆదేశించింది. కోవిడ్ నేపథ్యంలో టీటీడీ భక్తులకు అప్పట్లో శ్రీవారి దర్శనం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మేల్ చాట్ వస్త్రం, అభిషేకం సహా ఇతర ఆర్జిత సేవలనూ రద్దు చేసింది. ఆర్జిత సేవా టికెట్లను అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న భక్తులు టికెట్ సొమ్ము వెనక్కు తీసుకోవడమో లేదా టీటీడీ కల్పించే దర్శన సదుపాయం ఉపయోగించుకునే వీలు కల్పించింది. ఈ రకంగా సుమారు 16 వేల మంది భక్తులు ఆర్జిత సేవలో పాల్గొనలేకపోయారు. కొందరు టీటీడీ కల్పించిన దర్శనం చేసుకోగా.. మరికొందరు ఆర్జిత సేవ టికెట్ మొత్తం వెనక్కు తీసుకున్నారు. అయితే.. 16 మంది భక్తులు తమను ఆర్జిత సేవలో పాల్గొనేలా టీటీడీని ఆదేశించాలని హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లకు వారు బుక్ చేసుకున్న ఆర్జిత సేవలో పాల్గొనే అవకాశం కల్పించాలని సింగిల్ జడ్జి ఆదేశించారు. దీనిపై టీటీడీ డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేసింది.

జాతీయ క్రీడల్లో ఏపీ బోణి

మహిళా బ్యాడ్మింటన్ జట్టుకు కాంస్య పతకం



సాక్షి, అమరావతి: గోవాలోని 37వ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ బోణీ కొట్టింది. శనివారం బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో మహిళా జట్టు కాంస్య పతకం సాధించింది. క్వార్టర్ ఫైనల్‌లో పశ్చిమ బెంగాల్‌పై 5–0 తేడాతో విజయం సాధించింది. సెమీ ఫైనల్‌లో అసోం చేతిలో 3–2తో ఓటమిపాలై మూడో స్థానానికి పరిమితమైంది. మహిళల బ్యాడ్మింటన్ జట్టు విభాగంలో అసోం స్వర్ణం, మహారాష్ట్ర రజతం సాధించాయి. ఏపీ మహిళా బ్యాడ్మింటన్ జట్టులో కె.నవ్య, టి.సూర్య చరిష్మా, ఎల్.మమైక్య, డి.రష్మిత, ఎం.ఆకాంక్ష, సీహెచ్.ఉత్తేజితరావు, డి.పూజ, పి.సోనిక సాయి, డి.దీపిక, డి.స్రవంతి ఉన్నారు.

టీడీపీ కోసమే పవన్ జనసేన

ఎంపీ మార్గాని భరత్



రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ పల్లకి మోయడానికే పవన్‌కళ్యాణ్ రాజకీయ పార్టీ పెట్టారు తప్ప ప్రజల కోసం కాదని ఎంపీ మార్గాని భరత్‌రామ్ వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ రాజకీయ పార్టీ పెట్టిందే టీడీపీకోసమన్నారు. చంద్రబాబుకు ఓట్లు కావాలి, పవన్‌కు నోట్ల కట్టలు కావాలని ఎద్దేవా చేశారు. చంద్రబాబు స్కిల్ స్కాంలో జైల్లో ఉండటంతో పవన్ 'రథసారథి' పాత్ర పోషిస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన రాజమహేంద్రవరంలో భేటీ కానున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. దీనివల్ల ఫలితమేమీ ఉండదన్నారు. చంద్రబాబు 40 రోజులకు పైగా సెంట్రల్ జైల్లో ఉన్నా ప్రజల నుంచి ఎలాంటి స్పందన, సానుభూతి కనిపించలేదని చెప్పారు. చంద్రబాబు నక్క జిత్తుల రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకున్నారు కాబట్టే వారిలో స్పందన, సానుభూతి లేవన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను సంపూర్ణంగా విశ్వసిస్తున్నారని ఎంపీ భరత్ వివరించారు.

గోదావరిలో నలుగురు యువకుల గల్లంతు

తాళ్లరేవు: విహార యాత్రకు యానాం వచ్చిన ఏడుగురు యువకుల్లో నలుగురు గౌతమీ గోదావరిలో ఈతకు దిగి గల్లంతయ్యారు. స్థానికులు, కాకినాడ జిల్లా కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సమీపంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన హనుమకొండ కార్తీక్ తన పుట్టిన రోజు సందర్భంగా పార్టీ ఇచ్చేందుకు స్నేహితులైన సలాది దుర్గామహేష్, కొమ్మిరెడ్డి చైతన్య, ముద్దన ఫణీంద్ర గణేష్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ, నేదూరి భానుప్రసాద్‌తో కలిసి యానాం వచ్చాడు. అక్కడ సరదాగా గడిపిన అనంతరం తిరిగి వెళుతూ వారు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర్ ఘాట్ వద్ద గౌతమీ గోదావరి నదిలో స్నానానికి ఆగారు. ముందుగా స్నానానికి దిగిన కార్తీక్ గోదావరిలో మునిగిపోతుండటంతో.. మిగిలిన వారు కాపాడేందుకు యత్నించారు. కార్తీక్‌తో పాటు బాలాజీ, రవితేజ, ఫణీంద్ర గణేష్ నదిలో గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న కోరంగి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943